సంపుటి : 78 సంచిక : 37 పుటలు : 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ నిజ జ్యేష్ఠ పూర్ణిమ
29 జూన్-05 జూలై 2026
వెల : ₹20/-

అజ్ఞానమా.. అభద్రతా?

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

నేల..నీరు..యోగా..!

యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ - ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా ఇతివృత్తంగా జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవంలో ఆసేతుహిమాచలపర్యంతం యావత్ భారతీయులు పాల్గొన్నారు. దేశరాజధాని, ఇండియా గేట్ వద్ద సాటి యోగసాధకుల మధ్య చిన్నారితో ఓ మాతృమూర్తి నుంచి అహ్మదాబాద్‌లోని జల్‌ధార వాటర్ పార్క్‌లో 5 నుంచి 70 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న 50 మందికి పైగా యోగవీరుల సూర్యనమస్కారాలు, సముద్ర మట్టానికి 18వేల అడుగుల ఎత్తున మంచుతో కూడిన సియాచిన్ పర్వతంపైన జాగిలాలతో కూడిన వీర సైనికుల యోగ సాధన వరకు దేశప్రజలందరూ వేడుకలో పాల్గొన్నారు. ప్రపంచానికి భారత్ అందించిన అమూల్యమైన బహుమతి యోగాను త్రికరణశుద్ధితో ఆచరించారు. తద్వారా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, శారీరక పటుత్వ వారసత్వ సంపద పరిరక్షణలో ఐక్యతను చాటుకున్నారు.



మారుతున్న కాలంలో హిందుత్వం
దేశ విభజన కుట్రలను తిప్పికొట్టే ఏకైక బంధనశక్తి!

- నందకుమార్, అఖిల భారత సంయోజక్, ప్రజ్ఞా ప్రవాహ

నేడు కొందరు కపట మేధావులు 'హిందుత్వం' అనేది కేవలం ఒక సంస్థ లేదా పార్టీకి చెందిన రాజకీయ పదం అని ప్రచారం చేస్తున్నారు. కానీ, చరిత్రను శోధిస్తే, ఆర్ఎస్ఎస్ స్థాపనకు ముందే,1916లో కొలంబియా యూనివర్సిటీ, ఆంత్రోపాలజీ సెమినార్‌లో అంబేద్కర్ 'భారతదేశంలో కులాలు' అనే తన పరిశోధనా పత్రంలో "భారతదేశపు అద్భుతమైన భౌగోళిక ఐక్యత కంటే లోతైనది, తిరుగులేనిది, దేశంలో విస్తరించిన సాంస్కృతిక ఐక్యత" అని నొక్కి చెప్పారు. నేతాజీ తన ఆత్మకథ 'ది ఇండియన్ స్ట్రగుల్' పీఠికలో,' 'మీరు భారత్‌లో ఏ దిక్కుకు వెళ్లినా ఈ దేశం ఒక్కటే అని అర్థమవుతుంది" అన్నారు. వారిరువురూ ఆర్.ఎస్.ఎస్ లేదా బీజేపీకి చెందినవారు కాకపోయినా, ఈ దేశాన్ని కలిపి ఉంచే ఆ బంధనశక్తి (Binding Force) హిందుత్వమేనని స్పష్టంగా గుర్తించారు.

భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయాలని, ముక్కలు చేయాలని చూసే శక్తులకు, దేశాన్ని ఐక్యంగా ఉంచే ఈ హిందుత్వమే ప్రధాన అడ్డంకి. దానిని క్షీణింపచేస్తే విడదీయడం తేలికవుతుందన్నది వారి వ్యూహం. 1925లో డాక్టర్ హెడ్గేవార్ నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించిన సంవత్సరంలోనే, రష్యాలో కామ్రేడ్ జోసెఫ్ స్టాలిన్ ఒక వ్యూహాత్మక వ్యాసం రాస్తూ, స్వాతంత్ర పోరువల్లే భారత్‌లో ఐక్యత కనిపిస్తోంది, కానీ అది స్వల్పకాలికమే. భవిష్యత్తులో అక్కడ భాష, ప్రాంతం, కులాల ఆధారంగా అంతర్గత పోరాటాలు ముదురుతాయి. భారత్‌ను

దెబ్బతీయడానికి అదే తగిన సమయం అంటూ భారత్‌లోని కామ్రేడ్లకు దిశానిర్దేశం చేశారు. నేటి వామపక్ష, మతతత్వ శక్తులు ఆ సిద్ధాంతంతోనే హిందుత్వపై దాడి చేస్తున్నాయి.

హిందూ అనేది బ్రిటీషర్ల కాలంలో వచ్చిన పదం కానే కాదు. ప్రాచీన సాహిత్య గ్రంథాలను శోధిస్తే, మెగస్తనీస్ రాసిన 'ఇండికా' వంటి పుస్తకాలలో 'హిందూ' పదాన్ని వాడారు. అలాగే, భారత్‌ను 'హిందుస్తాన్' అని సంబోధించిన తొలి వ్యక్తులలో గురునానక్ దేవ్ ఒకరనేందుకు చారిత్రిక ఆధారాలున్నాయి.

ప్రస్తుతం కొందరు మేధావులు, "హిందూయిజం మంచిదే, కానీ హిందుత్వం మతతత్వం" అని ఒక కొత్త ద్వంద్వాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే, భాషాశాస్త్ర పరంగా 'ఇజం' అనే పదానికి అర్థం పరిమిత భావజాల సిద్ధాంతం. మార్క్సిజం లేదా కొన్ని మతపరమైన సిద్ధాంతాల లాగా 'ఇజం'లో ఒక చిన్న మార్పు చేసినా, ప్రశ్నించినా ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుంది

కాని హిందుత్వం ఎప్పుడూ 'మేమే అంతిమ సత్యాన్ని కనుగొన్నాం' అనలేదు. దా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పినట్లు, 'ఇది ఒక నిరంతర ప్రవాహం, నిరంతర పరిణామం చెందే సంప్రదాయం. అంటే కాలానికి అనుగుణంగా మారే సత్యాన్ని అన్వేషించే స్వేచ్ఛ గల ఓపెన్ సిస్టమ్ 'హిందుత్వం'.

ఒకనాడు మోతీలాల్ నెహ్రూ విదేశాలలో, తనను గాడిద అన్నా పర్లేదు కానీ హిందూ అనకండి అంటే, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తాను ప్రమాదవశాత్తు హిందువుగా పుట్టానని చెప్పుకున్నారు. కేరళ తొలి సిఎం నంబూద్రిపాద్, నేను హిందువునని ఎవరన్నారంటూ ప్రశ్నించారు. కాని నేడు హిందుత్వ ఉద్యమం వెల్లువెత్తుతుండటంతో, "నన్ను గాడిద అనండి" అన్న స్థాయి నుండి "నేను హిందువుని" అని చెప్పుకునే స్థాయికి వారు రావడం హిందుత్వ సాధించిన మేధోపరమైన విజయం.

హిందుత్వం అనేది కేవలం చరిత్రకే పరిమితం కాదు, ఇది ఆధునిక సాంకేతిక సవాళ్లను కూడా పరిష్కరించగలదు. ప్రసిద్ధ ఇజ్రాయెల్ ప్రొఫెసర్ యువల్ నోవా హరారి రాసిన '21 Lessons for the 21st Century' పుస్తకంలో AI (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), అల్గోరిథమ్స్ ద్వారా మనుషుల మనస్సులను నియంత్రించే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Managing Editor : Kurra Durga Reddy.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం
9959991304
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

డిజైనర్ : చిగుళ్ల కుమార్

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

ప్రజా బాహుళ్యంలో విశ్వాసాల ప్రమేయం పెరిగినప్పుడు, ధార్మికత పాళ్లు ఎక్కువైనప్పుడు వాటిని ధ్వంసం చేసే శక్తులు బయలుదేరతాయి. సనాతనతత్వంపై, హిందూ ధర్మంపై దాడి తీవ్రమవుతోంది. ఈ క్రమంలో జరిగిన దుర్మార్గమైన కుట్రే 'ధర్మస్థల' వివాదం. గతేడాది జూలైలో సంచలనం సృష్టించిన 'ధర్మస్థల కేసు' కొత్త మలుపు తీసుకుంది. ప్రాచీన ఆలయంపై చేసిన తప్పుడు ప్రచారం వెనుక పెద్ద కుట్ర ఉందని తేటతెల్లమైంది.

ఆశ్చర్యకరంగా ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ పేరు బయటకు వచ్చింది. స్వయాన నిందితుడు చిన్నయ్య జూన్ 6న కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ధర్మస్థల ఆలయం దుష్ప్రచారం వెనుక రూ.200 కోట్లు చేతులు మారాయని, ఇందులో నటుడు ప్రకాశ్‌రాజ్ పాత్ర ఉందని, ఈ కుట్రకు కేంద్రం కేరళ అని నిందితుడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. అతను ప్రకాశ్‌రాజ్‌తో ఫోన్‌లో సంభాషించిన అంశం కూడా తెరపైకి వచ్చింది. తాను నిందితుడు చిన్నయ్యతో మాట్లాడినట్టు ప్రకాశ్‌రాజ్ బెంగళూరులో పత్రికా విలేఖరుల సమావేశంలో అంగీకరించారు.

ధర్మస్థల ఆలయంలో అత్యాచారాలు జరిగాయని తాను మీడియా ముందు చెపితే కావాల్సినంత డబ్బు ముడుతుందని కొందరు ప్రేరేపించడం వల్లనే తాను ప్రసార మాధ్యమాల ముందు వెల్లడించానని నిందితుడు చిన్నయ్య న్యాయ స్థానానికి విన్నవించాడు. 'నువ్వేమీ భయపడకు. నేనున్నాను. నేను నీ వద్దకు వచ్చి..నిన్ను ఆలింగనం చేసుకుంటాను' అని ప్రకాశ్‌రాజ్ అన్నట్టు కూడా నిందితుడు కోర్టుకు తెలిపాడు. కర్ణాటక ప్రభుత్వం సిట్ వేసిన తర్వాత భయపడిన తను, ప్రకాశ్‌రాజ్‌కు ఫోన్ చేశానని, 'సిట్' అధికారి నిజాయతీపరుడని, ఆయన వద్దకు వెళ్లవలసిందిగా ప్రకాశ్‌రాజ్ సలహా ఇచ్చాడని నిందితుడు పిటిషన్‌లో వివరించాడు. ఈ కేసులో నాటి కేబినెట్ మంత్రి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక ఖర్గేపై సైతం ఆరోపణలు వచ్చాయి. దీన్నిబట్టి చూస్తే దేశంలో ప్రాచీన ఆలయ ప్రతిష్ఠను, భక్తుల విశ్వాసాలను గాయపరిచేందుకు చాలా పెద్ద కుట్ర జరుగుతోందని అర్థమవుతుంది.

శాలివాహన 1948 శ్రీ పరాభవ నిజ జ్యేష్ఠ పూర్ణిమ

లోపలి పేజీలలో...

6లో

ముఖపత్ర కథనం

అజ్ఞానమా.. అభద్రతా?

ధారావాహిక నవల

42 **గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

సంఘానికి ఆదర్శమే గురువు

26లో

జాగృతి

సంపాదకీయం

ప్రకాశ్‌రాజ్ బెంగళూరు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, వీర్ సావర్కర్, ప్రధాని నరేంద్ర మోదీ పేర్లను అనవసరంగా ప్రస్తావించి తన అహంకారాన్ని చాటుకున్నారు. 'సారీ' చెప్పడానికి తాను సావర్కర్ కాదని, విలేకరుల సమావేశాలు పెట్టకుండా ఉండటానికి తాను మోదీని కాదంటూ వ్యంగ్య వ్యాఖ్యలతో వాచాలత్వం ప్రదర్శించారు. దీంతో ప్రకాశ్‌రాజ్ విలక్షణ నటుడు కాదు..'అవలక్షణ' నటుడని అర్థమైంది.

అవలక్షణ నటుడు గతంలోనూ జుగుప్సాకరంగా స్పందించాడు. 'దేశంలో కోట్లమంది రాముడిని ఆరాధిస్తారు కదా' అని ఓ మీడియా వేదికపై అడిగిన

విలువలరాహిత్యమే విశ్వాసఘాతుకం

ప్రశ్నకు, 'అశ్లీల చిత్రాలను కూడా చూస్తారు కదా?' అని గర్వం ప్రదర్శించాడు. మనిషిలో మిగిలిపోయిన అనేక ఆదిమ లక్షణాలలో అహంకారం ఒకటి. అది ప్రకాశ్‌రాజ్‌లో పుష్కలంగా ఉంది. తన అల్పత్వాన్ని, పిపీలకత్వాన్ని బయటపెట్టే ఏ వాస్తవానికైనా మనిషి భయంతో వణికిపోతాడు. ప్రకాశ్‌రాజ్‌లో అది స్పష్టంగా కనిపించింది. లోకాల చీకట్లను పోగొట్టేదే ధార్మిక విశ్వాసం. ప్రజా జీవితంలో ధార్మిక విశ్వాసాలపాలు పెరుగుతున్నప్పుడు.. అడుగడుగునా ఎదురయ్యే కలుపు మొక్కలను నిర్దాక్షిణ్యంగా ఏరివేయాలి.

'ధర్మస్థల' కుట్రను బట్టబయలు చేసి నిందితులెవరైనా, ఎంతటివారైనా శిక్షించడం ప్రభుత్వం, చట్టబద్ధ సంస్థలు అవశ్యం చేయాల్సిన పని. ప్రకాశ్ రాజ్ మాత్రమే కాదు గతంలో అనేక మంది బాలీవుడ్ నటులు, తమిళ నటులు ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ప్రకాశ్‌రాజ్ ఒకడుగు ముందుకు వేసి తానొక కుట్రలో భాగస్వామి అయ్యాడు. ఏ భాగస్వామ్యమూ లేకపోతే... నిందితుడితో, విచారణ అధికారితో పదే పదే ఎందుకు సంభాషించినట్టు? అనే అనుమానాలు కలగడం సహజం. విలేకరుల సమావేశంలో ఆయన తడబాటు, తన చర్యల తాలూకు రహస్యాన్ని బట్టబయలు చేసింది.

ధర్మస్థల అంశం దేశాన్ని దిగ్భ్రాంతి పరచింది. ఎంత హిందూ వ్యతిరేకత, సనాతన ధర్మం పట్ల ఏహ్యభావం ఉన్నా.. ఇంత దారుణానికి ఒడిగట్టడం, మనిషి దిగుజారుడు తనానికి నిదర్శనం. కేరళ కేంద్రంగా కుట్ర జరిగిందంటే దీని వెనుక ఎవరున్నారనేది విచారణ సంస్థలు తేల్చాలి. కేరళ క్రైస్తవ మతమార్పిడి సంస్థలకు కేంద్రం. ఐసిస్ వంటి అత్యంత ప్రమాదకరమైన ఇస్లామిక్ ఉగ్రవాదులకు అడ్డా. అందుకే కర్ణాటక ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలి. కోట్లాది మంది విశ్వాసాలను గాయపరిచే కుట్రలో కోట్ల రూపాయలు చేతులు మారడం వెనుక ఎవరున్నారో పార్టీలు, రాజకీయాలతో సంబంధం లేకుండా వెలికితీయాలి.

తాను ధర్మస్థల కేసులో నిందితులతో మాట్లాడానని ప్రకాశ్‌రాజ్ స్వయంగా వెల్లడించినా కర్ణాటక ప్రభుత్వం లేదా 'స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం' ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తే ఇదంతా ఉద్దేశపూర్వక అలక్ష్యమని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఈ తరహా వైఖరి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు మంచిది కాదు. కేంద్ర ప్రభుత్వంతో ఉన్న రాజకీయ వైరాన్ని ఇలా వ్యక్తం చేయడం సముచితం అనిపించుకోదు. ప్రజల విశ్వాసాలను గౌరవించడం ప్రభుత్వాల విధి. ధర్మస్థల కేసు విషయంలోనే కాదు, ప్రకాశ్‌రాజ్ అనేక సందర్భాల్లో రాజ్యాంగ, చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్టు అనేక ఆధారాలు, రుజువులు కనిపిస్తూనే ఉన్నాయి. ఇంత జరిగిన తర్వాత అయినా కర్ణాటక ప్రభుత్వం తక్షణమే స్పందించి 'ధర్మస్థల' కేసులో చర్యలకు ఉపక్రమించాలి. ★

29 జూన్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్

38లో

కథ

ఆశల పల్లకి

- గోవిందరాజు చక్రధర్



ఎన్డీఏకు బలం - జాతికి వరం (జాతీయం) - 12
అప్పుల ఊబిలో 'సంపన్న' రాష్ట్రం (తెలంగాణ) - 14
కల్తీ మాంసాహారంతో కలపరం (ఆంధ్రప్రదేశ్) - 16
సాధికారతలో స్త్రీ సంతకం (మహిళ) - 18
జీ7 సదస్సుతో భారత్‌కు.. (అంతర్జాతీయం) - 24
భారతీయ సంస్కృతికి దిక్సూచి-గురుశిష్యుల బంధం (పరంపర) - 30
మురికి ప్రజ ఎవరు?.. (గళమెత్తిన గతం) - 32
జోజీలాతో కశ్మీర్‌కు కొత్త జోష్! (మార్గం) - 34
విలక్షణమైన వ్యక్తిత్వం (ఆర్ఎస్ఎస్-100) - 36
భారత హాకీ 'భీమార్జునులు'! (క్రీడ) - 43
బాలజాగృతి - 46
వినోదాన్ని పంచే 'మా ఇంటి బంగారం' (సినిమా) - 50

అజ్ఞానమా..

కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే

ఆర్ఎస్ఎస్ ఎందుకు రిజిస్టర్ చేసుకున్న సంస్థ కాదు అంటూ కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే తాజాగా ఓ ప్రశ్న లేవదీశారు. ఇది అజ్ఞానమా? లేక ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశపూర్వక ప్రయత్నమా? అదీ కాకుంటే అభద్రతా భావమా? అనే ఒక ముఖ్యమైన సందేహానికి ఇలాంటి ప్రశ్న దారితీస్తుంది. నవంబర్ 9, 2025న బెంగళూరులోనే ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ సరిగ్గా ఇదే అంశంపై స్పష్టంగా మాట్లాడారు. అయితే జూన్ 15, 2026న తాము ఒక "ప్రశ్నను వంపామని" ఖర్గే ఇప్పుడు పేర్కొంటున్నారు. ఆయన అప్పట్లో కర్ణాటక సమాచార, సాంకేతిక శాఖ మంత్రిగా ఉండేవారు. కాబట్టి, తన సొంత రాష్ట్ర రాజధానిలోనే కొద్ది నెలల క్రితం విస్తృతంగా చర్చకు వచ్చిన వివరణ గురించి ఆయనకు తెలియదనుకోవడం నమ్మశక్యం కాని విషయం. అప్పట్లో ఆయనకు ఈ విషయం తెలియని రీతిలో ఆయన శాఖ పనితీరు ఉన్నది అని అనుకున్న పక్షంలో ప్రస్తుతం హోం మంత్రిగా ఉన్న ఖర్గే ఆ రికార్డులను తెప్పించుకొని సమాధానం తెలుసుకోవచ్చు.

ఇదే ఖర్గే నవంబర్ 9, 2025న ఆర్ఎస్ఎస్ రిజిస్ట్రేషన్ విషయంలో ఓ ప్రశ్న అడిగారు. దీనికి సమాధానంగా.. ఇది చట్టపరమైన సూక్ష్మమైన అంశానికి సంబంధించిన విషయం కాదు. భారత రాజ్యాంగం "వ్యక్తుల సమూహం" (Body of individuals)ను చెల్లుబాటు అయ్యే న్యాయపరమైన సంస్థలుగా గుర్తిస్తుంది. దశాబ్దాలుగా భారతీయ న్యాయస్థానాలు కూడా ఈ చట్రం పరిధిలోనే ఆర్ఎస్ఎస్ హోదాను, పనితీరును గుర్తించాయి. ఈ సంస్థ నిర్మాణం, దాని రూపకల్పనరీత్యా, సాంప్రదాయ నమోదిత సంఘం లేదా ట్రస్ట్ తరహాలో అది లేదు. అదే తీరుగా వ్యవహరించడానికి దానికి పూర్తి చట్టపరమైన హక్కు ఉంది అనే వివరణ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చింది. మరి అదే ప్రశ్నను ఎందుకు పట్టుబట్టి మరీ అదేపనిగా అడుగుతున్నారు? ఇప్పటికే బహిరంగంగా, చట్టపరంగా సమాధానం చెప్పినా సరే మళ్లీ మళ్లీ అడగడమెందుకు? ఒక ప్రముఖ వ్యక్తి ఒకే ప్రశ్నను పదేపదే లేవనెత్తినప్పుడు అది కాస్త అడిగినట్లు కాకుండా నిందారోపణలు చేస్తున్నట్లుగానే ఉంటుంది. అందరూ అలాగే అనుకుంటారు కూడా. ఈ విషయంలో స్పష్టత, వివరణ కోరే కన్నా కూడా ఎలాంటి సందేహమే లేని చోట, సందేహాన్ని సృష్టించే ప్రయత్నం కిందికే ఇదంతా వస్తుంది. అయితే కొన్ని సంస్థలను ఎంపిక చేసుకొని వాటిపై విమర్శలకు దిగడంలో కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆ సంస్థలతో సౌకర్యంగా ఉంటే వాటి జోలికి వెళ్లదు. అదే సంస్థలు తనకు రాజకీయంగా ప్రయోజనకరంగా లేని సమయంలో వాటిని ప్రశ్నిస్తుంది. చట్ట పరిధిలో పనిచేస్తూ, కాలక్రమేణా పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ ఆమోదం పొందిన ఒక సంస్థ చట్టబద్ధతను ప్రశ్నించడం అనేది సంస్థాగతంగా ఆ సంస్థ స్థిరత్వం పొందిన విషయంపై ఆందోళన చెందుతున్నారనే అనిపిస్తుంది. ఉద్దేశం నిజాయతీతో కూడుకున్నదైతే, ఆ స్పందనను గుర్తించి, దానిపై చర్చించి, లేదా సారాంశంతో కూడిన ఖండన ఇచ్చి ఉండేవారు. దానికి బదులుగా సందర్భానికి సంబంధం లేకుండా, ముందస్తు వివరణను పట్టించుకోకుండా మళ్లీ మళ్లీ అదే ప్రశ్నలు వేయడాన్ని మనం చూస్తూనే ఉన్నాం. అడిగిన ప్రశ్నలే అడగడం కంటే విస్తృతమైన బహిరంగ చర్చే మెరుగైంది. కొత్త వాదనలు చేస్తే, వాటిని బహిరంగంగా చేయనివ్వాలి. కానీ విచారణ ముసుగులో స్థిరపడిపోయిన విషయాలను తిరిగి తవ్వడం అనేది ఒక పరిశీలనగా కాకుండా ఒక వ్యూహంగా భావించాల్సి ఉంటుంది. వీటి మధ్య తేడాను క్షుణ్ణంగా చూడటంలో దేశ ప్రజలు సమర్థులు.

కేరళ సీఎం వీడీ సతీశన్

అభద్రతా?

"ఈ అంశంపై నేను స్పందించాల్సిన అవసరం లేదు. రిజిస్టర్ కాకుండా ఎన్నో కార్యకలాపాలు జరుగుతున్నాయి. మాది ఏదీ రహస్యం కాదు.. బహిరంగంగానే పనిచేస్తున్నాం. మేం ప్రజలను పిలిచి సంఘం గురించి చెబుతున్నాం. ఇదంతా రాజకీయం. ఇలాంటి ఎత్తుగడలు వేయడం సహజం. సంఘ్ ఏర్పడిన 10-15 ఏళ్ల నుంచే, మేము ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటూనే ఉన్నాము. మాకు ఇవన్నీ అలవాటే.. అక్కడేమీ ఉండదు గానీ, ఏదో ఉన్నట్టు అనుకుంటాం(ఖర్గే వంటి విమర్శకుల భావనలో). అందువల్ల మేం స్పందించాల్సిన పని లేదు. బ్రిటిష్ కాలంలో సంఘం ఏర్పడింది. ప్రజా మోదంతోనే ఆరంభమైంది. అప్పట్లో మేధోమథనం జరిపినవారు ముందుకెలా సాగారో మీకు చెప్పాను. ఏకాభిప్రాయంతో కార్యాచరణ సాగింది. అదీ సంఘం అంటే.. అందుకే దానికి ఎలాంటి ఆటంకం లేదు. హిందూ ధర్మం కూడా రిజిస్టర్ కాలేదు. అలా చాలానే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఎవరైతే నిధులు కావాలనుకుంటారో వారికి రిజిస్ట్రేషన్ అనేది కావాలి. అది అవసరం. అయితే, సంఘం ఉందన్న సంగతి ప్రభుత్వానికి తెలుసు. మమ్మల్ని రెండుసార్లు నిషేధించింది. కానీ ఒకసారి కోర్టు ఆదేశంతోను, మరోసారి సత్యాగ్రహం కారణంగా నిషేధాన్ని తొలగించారు. అందువల్ల ప్రభుత్వానికి ఆర్ఎస్ఎస్ గురించి తెలుసు. వారు ఆర్ఎస్ఎస్‌ని గుర్తించారు కాబట్టే దానిపై నిషేధం విధించారు. ఈ 100 సంవత్సరాల కాలంలో ఇలాంటివి చాలా జరిగాయి. మేం రిజిస్టర్ కావాలని ఏ ఒక్కరు చెప్పలేదు. మా లిఖితపూర్వక రాజ్యాంగం ప్రభుత్వం దగ్గరుంది. మేం 1950 దశకంలోనే ప్రభుత్వానికి దానిని సమర్పించాము. అప్పుడే మేం రిజిస్టర్ చేసుకోవాల్సి ఉందని ప్రభుత్వం చెప్పవచ్చు .మేమూ ఆ పని చేసి ఉండేవారం. వాళ్లు(ప్రభుత్వం) ఏమీ చెప్పలేదు. అందుచేత నేనెందుకు స్పందించాలి? ఇదంతా రాజకీయం. ఇదేమంత తీవ్రమైన విషయం కాదు. ఏదో ఒక విధంగా సంఘం పనిని ఒకవైపు అడ్డుకుని, ప్రజల మనస్సుల్లో అనుమానాలు రేకెత్తించాలని వాళ్లు (పరోక్షంగా ఖర్గేను ఉద్దేశించి) అనుకుంటున్నారు. ఇకపై ఇలాంటివి సాధ్యం కాదు. ఎందుకంటే మేమేంటో ప్రజలకు తెలుసు కాబట్టి. మేము రహస్యంగా పనిచేస్తున్నామని వారు విమర్శిస్తుంటారు. మా కార్యకర్తలు అన్ని చోట్లా ఉన్నారు. ప్రజలు వారిని ప్రతిరోజూ చూస్తుంటారు. మా శాఖలు ప్రజలు చూస్తుండగా బహిరంగ ప్రదేశాల్లో జరుగుతుంటాయి. మేం బహిరంగ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుంటాం. ఈ ఏడాది మేం చాలా మందిని కలుసుకున్నాం. ప్రతి చోటా హిందూ సమ్మేళనం జరుపుకున్నాం. మా పని రహస్యంగా చేసుకునేది అయితే ఇవేవీ సాధ్యం కావు."

– కేరళ, త్రిశూర్‌లో సర్‌సంఘచాలక్
డాక్టర్ మోహన్ భాగవత్

ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొనడం నేరమా?

సంఘ శతాబ్దిని పురస్కరించుకొని కేరళలోని తిరువనంతపురంలో ఆరెస్సెస్ సమావేశాన్ని నిర్వహించింది. సమావేశానికి వివిధ రంగాలకు చెందిన మేధావులు, ప్రముఖులతో పాటుగా కేరళ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైఎస్ చాన్సెలర్(వీసీ), కేరళ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ వీసీ డా. మోహనన్ కున్నుమ్మల్, మహాత్మా యూనివర్సిటీ వీసీ డాక్టర్ డి.మావూతు, మలయాళం యూనివర్సిటీ వీసీ డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ కీలక ఉపన్యాసం చేశారు. అయితే.. ముగ్గురు వీసీలు పాల్గొనడాన్ని కాంగ్రెస్, సీపీఎం పార్టీలతో కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ తీవ్రంగా తప్పుపట్టారు. దాన్ని ఒక పెద్ద వివాదంగా చేశారు. సంఘ శతాబ్దిని పురస్కరించుకొని, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నివ్వణులను కలవడం సర్వసాధారణంగా జరుగుతున్నది. అలాగే సంఘ కార్యక్రమాలకు వారిని ఆహ్వానిస్తున్నారు. ఇందులో ఎలాంటి దాపరికం లేదు. అయితే మొదట్నుంచి కూడా ఆర్ఎస్ఎస్ ప్రచారానికి, హంగూ ఆర్భాటాలకూ దూరంగా ఉంటూ వస్తున్నది. తనపనేదో తాను చేసుకుంటూ పోతున్నది. దీంతో పలువురు ప్రముఖులను ఆర్ఎస్ఎస్ కలిసిన సంగతి వార్తలుగా బయటికి రాలేదు. అయితే తిరువనంతపురంలో సమావేశం బహిరంగంగానే జరిగింది. అందులో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు, సేవా కార్యక్రమాలు, వేర్వేరు రంగాలలో సంఘ దృక్పథాన్ని మోహన్ భాగవత్ వివరించారు. వారి ప్రసంగంలో ఎలాంటి రాజకీయ ప్రస్తావనలు కానీ, మత ఛాందసాలు కానీ ఏమీ లేవు. అయినప్పటికీ ముగ్గురు వీసీలు క్షమాపణలు చెప్పాలని కేరళ సీఎం వీడీ సతీశన్ డిమాండ్ చేశారు. వారిని తీవ్ర పదజాలంతో విమర్శించారు. మతతత్వానికి చట్టబద్ధత కల్పించే ఏ చర్య అయినా ఆమోదయోగ్యం కాదని అన్నారు. వీసీలు తమ పదవుల గౌరవాన్ని, హుందాతనాన్ని తీవ్రంగా దెబ్బతీశారని విమర్శించారు. అయితే వీసీలకు మద్దతుగా బీజేపీ ఎమ్మెల్యే వీ మురళీధరన్ నిలిచారు. విద్యావేత్తలను సతీశన్ బెదిరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చేసిన విమర్శల వెనుక ఉన్న తర్కాన్ని ఆయన ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ అనేది ఒక ప్రధాన సామాజిక-సాంస్కృతిక సంస్థ. ప్రధానమంత్రి, రాష్ట్రపతి కూడా ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ ఏమీ నిషేధ సంస్థ కాదు. అది ప్రజాస్వామ్య, సాంస్కృతిక సంస్థ. ఈ సంస్థ సమావేశానికి హాజరైతే ఎందుకు క్షమాపణలు చెప్పాలని జాతీయవాదులు ప్రశ్నిస్తున్నారు. 1947 నుండి ఆర్ఎస్ఎస్‌ను ప్రజలకు శత్రువుగా చిత్రీకరించడాన్ని ఒక విధానంగా కాంగ్రెస్ పార్టీ మార్చుకుంది. అన్ని వర్గాల ప్రజలలో సంఘం, దాని సిద్ధాంతాలకు పెరుగుతున్న ఆదరణను చూసి భయపడుతోంది. ఈ ధోరణే సంఘ శతాబ్ది ఉత్సవాల వరకూ కొనసాగుతోంది. కొందరు కాంగ్రెస్ అధిష్ఠానం మెప్పుకోసం ఆర్ఎస్ఎస్‌ను విమర్శిస్తుంటారు. వారికి ఇదో అలవాటుగా కూడా మారిపోయింది.

ఖర్గేకు ఎమర్జెన్సీ పాఠం

ఆర్ఎస్ఎస్ ఎక్కడా అధికారికంగా నమోదు కానందున అది ఒక "రహస్య సంస్థ" అని సూచిస్తూ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఇటీవల చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ వాక్చాతుర్యం మాత్రమే కాదు. అవి భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కుల పట్ల లోతైన అపార్థాన్ని, భారత నాగరిక, సంస్థాగత సంప్రదాయాల పట్ల అగౌరవాన్ని వెల్లడిస్తున్నాయి. దేశంలోని దాదాపు ప్రతి గ్రామంలో వేళ్లూనుకున్న దశాబ్దాల నాటి జాతీయ ఉద్యమాన్ని కేవలం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ లేదనే ప్రాతిపదికన అంచనా వేయడానికి ప్రయత్నించడం, చట్టబద్ధత అంటే అధికారిక గుర్తింపు అని భావించే వలసవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

రాజ్యాంగ విలువల గురించి ఇతరులకు ఉపన్యాసాలు ఇవ్వాలనుకునేవారు ముందుగా రాజ్యాంగాన్ని జాగ్రత్తగా చదవాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(సి) ప్రతి పౌరునికి సంఘాలు లేదా యూనియన్లను ఏర్పాటు చేసుకునే ప్రాథమిక హక్కుకు హామీ ఇస్తుంది. ఒక సంఘం ఉనికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్‌పై ఆధారపడి ఉండదు. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం లేదా ట్రస్ట్ చట్టం కింద నమోదు అనేది ప్రాథమికంగా ఒక పరిపాలనా కార్యక్రమం. బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆస్తిని సంపాదించడం, గ్రాంట్లు లేదా పన్ను మినహాయింపులు పొందడం వంటి కార్యకలాపాలను సులభతరం చేయడానికి ఇది రూపొందింది. ఇది రాజ్యాంగబద్ధతకు అంతిమ పరీక్ష కాదు. పౌరుల శాంతిభద్రతలకు, జాతీయ సార్వభౌమత్వానికి లేదా రాజ్యాంగ పాలనకు ముప్పు కలిగించని ఏ సంఘమైనా, అది రిజిస్టర్ అయినా కాకపోయినా, రాజ్యాంగ రక్షణలో పనిచేయడానికి పూర్తిగా హక్కు కలిగి ఉంటుంది. కేవలం కేంద్రీకృత రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ లేదనే కారణంతో ఆర్ఎస్ఎస్‌ను "రహస్య" లేదా "చట్టవిరుద్ధ" సంస్థగా వర్ణించడం, ప్రజాస్వామ్యంలో పౌర సమాజాన్ని రక్షించే రాజ్యాంగ స్వేచ్ఛల పట్ల ఉన్న అపార్థాన్ని ప్రదర్శిస్తుంది.

వలస పాలన వారసత్వం

సామాజిక దృక్కోణం నుండి చూస్తే ప్రతి సామాజిక సంస్థ తప్పనిసరిగా అధికారిక రిజిస్ట్రేషన్ ద్వారా చట్టబద్ధతను పొందాలనే పట్టుదల కూడా వలసవాద పాలన వారసత్వమే అవుతుంది. భారతీయ నాగరికత చారిత్రాత్మకంగా వికేంద్రీకృత, సమాజ-ఆధారిత, స్వీయ-నియంత్రణ సంస్థల ద్వారా పరిణామం చెందింది.ప్రాచీన మఠాలు, సంప్రదాయ మఠాలు, వేద పాఠశాలలు, గ్రామ భజన మండళ్లు, సామాజిక ట్రస్టులు, స్థానిక ఉత్సవ కమిటీలు తరచుగా వలసవాద చట్టపరమైన నిబంధనల నుండి చట్టబద్ధతను పొందకుండా తరతరాలుగా సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. వాటి అధికారం సామాజిక విశ్వాసం, ఉమ్మడి విలువలు,

ఆర్ఎస్ఎస్‌తో వీవీ గిరి, ప్రణబ్ ముఖర్జీ

ఆర్ఎస్ఎస్ చరిత్ర గురించి కేరళ సీఎం వీడీ సతీశన్‌కు పెద్దగా తెలియక పోవడం విచారకరం. మహాత్మాగాంధీ, బి.ఆర్. అంబేద్కర్, కైలాష్ నాథ్ కట్జూ (నెహ్రూ కేబినెట్‌లో హోం మంత్రిగా, మధ్యప్రదేశ్ సీఎంగా పనిచేశారు) వంటి ప్రముఖులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు హాజరైన వారిలో ఉన్నారు. ఇదే విషయమై కైలాష్‌నాథ్ కట్జూను నెహ్రూ, ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించినప్పుడు, "ఒకసారి మీరు ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొంటే, స్వయంసేవకులను ప్రశం సించకుండా ఉండలేరు. స్వయంసేవకులకు అటువంటి క్రమశిక్షణ, అంకితభావం ఉంటాయి" అని ఆయన బదులిచ్చారు. 2018లో మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రణబ్ ముఖర్జీ నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్‌తో కలిసి ఒకే వేదికను పంచుకున్నారు. ఆ పర్యటన సందర్భంగా, ఆయన సందర్శకుల పుస్తకంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవర్ "భారతమాత ముద్దుబిడ్డ"గా అభివర్ణిస్తూ రాశారు. ఆయన పదవిలో ఉన్నప్పుడు మోహన్ భాగవత్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఆతిథ్యం కూడా ఇచ్చారు. మే 15, 1983న హరిద్వార్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్మితమైన 'భారతమాత మందిరాన్ని' అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రారంభించారు. సెప్టెంబర్ 2, 1970న కన్యాకుమారిలో వివేకానంద స్మారక చిహ్నాన్ని అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి ప్రారంభించారు.

సామాజిక భాగస్వామ్యంపై ఆధారపడి ఉంది. ఆర్ఎస్ఎస్ ఈ స్వదేశీ సంస్థాగత సంప్రదాయానికి కొనసాగింపుగా నిలుస్తుంది. అటువంటి సామాజిక ఉద్యమాన్ని కేవలం అధికారిక నమోదు అనే దృష్టితో అంచనా వేయడం, భారతదేశ నాగరిక సంస్థల సహజ స్వభావాన్ని అపార్థం చేసుకోవడమే అవుతుంది.

పారదర్శకత-ఆర్థిక స్వావలంబన

ఆర్ఎస్ఎస్ చట్టానికి వెలుపల పనిచేస్తుందని లేదా రహస్యంగా పనిచేస్తుందనే ఆరోపణ కూడా అంతే తప్పుదోవ పట్టించేదిగా ఉంది. ఆర్ఎస్ఎస్ ప్రాథమికంగా సామాజిక-సాంస్కృతిక ఉద్యమానికి నడుం బిగించిన సైద్ధాంతిక సంస్థ. చట్టపరమైన ఆర్థిక లావాదేవీలు ఎక్కడ జరిగినా దానికి సంబంధించిన నిర్ధారిత విధానాలను అది అనుసరిస్తుంది.దేశవ్యాప్తంగా ఉన్న ఆర్ఎస్ఎస్ కార్యాలయాలు, ఆస్తులు సాధారణంగా చట్టబద్ధంగా నమోదైన ట్రస్టుల ద్వారా నిర్వహణలో ఉంటాయి. ఇవి ఖాతాలను నిర్వహిస్తూ, వర్తించే చట్టాలను పాటిస్తాయి. అంతేకాకుండా ఆర్ఎస్ఎస్ స్ఫూర్తితో ఏర్పడిన అనేక సంస్థలు, ఉదాహరణకు విద్యా రంగంలో విద్యాభారతి, కార్మిక రంగంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్), సామాజిక సేవలో సేవా భారతి, గిరిజన అభివృద్ధిలో వనవాసి కళ్యాణ్ ఆశ్రమం వంటివి దేశ చట్టపరమైన చట్రంలో పనిచేస్తూ, సక్రమంగా నమోదైన సంస్థలుగా ఉన్నాయి. ప్రభుత్వ గ్రాంట్లు లేదా విదేశీ నిధులపై ఆధారపడే అనేక సంస్థల తరహాలో కాకుండా, ఆర్ఎస్ఎస్ ప్రధానంగా తన స్వయంసేవకులు ఏటా అందించే గురుదక్షిణ అని పిలుచుకునే స్వచ్ఛంద విరాళాల ద్వారానే తన ఉనికిని కాపాడుకుంటుంది. ఈ ఆర్థిక స్వావలంబన నమూనా, సంస్థ తన సభ్యులకు సమాజానికి జవాబుదారీగా ఉంటూనే స్వతంత్రంగా పనిచేయడానికి వీలు కల్పించింది. న్యాయస్థానాలు వెలువరించిన అనేక తీర్పులు కూడా ఈ నమూనాను సమర్థించాయి.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఆర్ఎస్ఎస్

ఆర్ఎస్ఎస్‌ను రాజ్యాంగ వ్యతిరేక సంస్థగా చిత్రీకరించే ముందు, చరిత్ర పుటలను ఒకసారి పరిశీలించాలి. 1975లో విధించిన అత్యవసర పరిస్థితి సమయంలో ప్రజాస్వామ్య స్పృహ లేకుండా పోయినప్పుడు, పౌర హక్కులు కుదించుకు పోయినప్పుడు, రాజ్యాంగబద్ధమైన పాలన తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు నిరంకుశత్వాన్ని ఎదిరించిన ప్రధాన శక్తులలో ఒకటిగా ఆర్ఎస్ఎస్ నిలిచింది. ప్రాథమిక హక్కులు నామరూపాల్లేకుండా పోయినప్పుడు వేలాది మంది ఆర్ఎన్ఎన్ స్వచ్ఛంద కార్యకర్తలు జైలుపాలయ్యారు. రహస్య ప్రతిఘటన ఉద్యమాలలో పాల్గొన్నారు. అధికార కేంద్రీకరణకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలు చేపట్టారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే పోరాటంలో చాలామంది తమ వృత్తి జీవితాలను, స్వేచ్ఛను, వ్యక్తిగత భద్రతను పణంగా పెట్టారు. ప్రజాస్వామ్య సంస్థలను రక్షించడంలో, రాజ్యాంగబద్ధమైన పాలన పునరుద్ధరణకు దోహదపడటంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పోషించిన పాత్ర ఆధునిక భారతీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైన ఒక చెక్కుచెదరని అధ్యాయం. కాబట్టి, ప్రజాస్వామ్య స్పృహను పునరుద్ధరించే ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న సంస్థ రాజ్యాంగబద్ధమైన నిబద్ధతను, అత్యవసర పరిస్థితి కాలం నాటి వారసులు ఇప్పుడు ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది.

పరిణతితో కూడుకున్న బహిరంగ చర్చ అవసరం

రాజ్యాంగంపై పరిణతి చెందిన అవగాహనకు కేవలం చట్టపరమైన నిబంధనలను అక్షరాలా చదవడం సరిపోదు. వాటి వెనుక ఉన్న అంతరార్థాన్ని లేదా స్ఫూర్తిని గ్రహించడం అవసరం. ఒక సంస్థ విలువను కేవలం ప్రభుత్వ కార్యాలయంలోని ధ్రువీకరణ పత్రం ఉనికిని బట్టి నిర్ణయించలేము. దానికి బదులుగా సమాజానికి అది అందించిన సహకారం, సంక్షోభ సమయాల్లో అందించిన సేవ, దేశ నిర్మాణంలో దాని పాత్ర ఆధారంగా దానిని అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజం. అయితే, రాజ్యాంగ సూత్రాలు, చారిత్రక వాస్తవాలకు సంబంధించిన చర్చలు మేధోపరమైన గంభీరత, వాస్తవిక కచ్చితత్వంతో జరగాలి. అటువంటి చర్చలను కేవలం రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాల గురించిన పైపైన వాదనలకు పరిమితం చేయడం వల్ల ప్రజాస్వామ్య చర్చా విధానం బలపడదు. ఆర్ఎన్ఎన్‌తో ఏకీభవించినా, ఏకీభవించకపోయినా సామాజిక సేవ, జాతీయ సమగ్రత, ప్రజలలో చైతన్యం పెంపొందించడంలో ఆ సంస్థ శతాబ్ద కాలంగా అందించిన సహకారాన్ని కేవలం పరిపాలనాపరమైన సాంకేతిక అంశాలతో కొట్టిపారేయలేం. రాజకీయ చర్చను నిరాధారమైన ఆరోపణలకు కుదించకుండా, దాని స్థాయిని పెంచాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉంది. రాజ్యాంగ అవగాహన, చారిత్రక చైతన్యం, మేధోపరమైన నిజాయతీతో కూడిన విభేదాలు వ్యక్తమైనప్పుడు ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.

'ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు'



దేశంలోని యువతపై ఆర్ఎస్ఎస్ ఎంతో ఆశాభావంతో ఉందని, నేటి యువత తమ సంప్రదాయాలతోనూ, భారతదేశపు ఘనమైన చరిత్రతోనూ అనుసంధానమై ఉందని ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ అన్నారు. పుణె శ్రామిక్ పాత్రకార్ సంఘ్ శతాబ్ది వేడుకల సందర్భంగా నవీపేఠ్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక చర్చా కార్యక్రమంలో సునీల్ అంబేకర్ పాల్గొన్నారు. సంఘం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కొందరు రాజకీయ నేతలు సృష్టిస్తున్న గందర గోళాన్ని తోసిపుచ్చారు. సంఘ్ చట్టబద్ధమైన ఉనికికి సంబంధించి ఎటువంటి న్యాయపరమైన వివాదమూ లేదు. స్వల్ప రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించేలా కొందరు దురుద్దేశపూర్వక ప్రయత్నం చేస్తున్నారు అని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ పూర్తిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందిన ఒక సామాజిక సంస్థ. అందుకే, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి వివిధ జాతీయ విపత్తుల సమయంలోనూ, నిర్మాణాత్మక కార్యక్రమాలలోనూ ఆయా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సంఘం క్రియాశీల సహకారాన్ని కోరుతూ వచ్చాయని గుర్తు చేశారు. సంఘ పథ సంచలన్ విషయంలో నిబంధనల ప్రకారం ప్రభుత్వం యంత్రాంగం నుంచి అనుమతి లభించిందని, అంతేకాకుండా తమ శాఖల పేర్లతో అధికారికంగా బ్యాంక్ ఖాతాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే సంఘ ఆర్థిక లావాదేవీలన్నీ పూర్తిగా పారదర్శకంగా ఉంటాయని, కేవలం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారానే జరుగుతాయన్నారు. తన దైనందిన 'శాఖ' వ్యవస్థ ద్వారా, సంఘం ప్రతిరోజూ సమాజానికి ప్రత్యక్షంగా జవాబుదారీగా ఉంటుందన్నారు.



హిందూ చైతన్యానికి రిజిస్ట్రేషన్ అవసరమా?

హిందూ చైతన్యాన్ని సాంస్కృతిక, సైద్ధాంతిక వ్యక్తీకరణగా పరిగణిస్తున్న ఆర్ఎస్ఎస్‌కు చట్టపరమైన నమోదు అవసరమా అనే ప్రశ్న అంతటా వినవస్తున్నది. ఆర్ఎస్ఎస్ ఒక స్వచ్ఛంద, వాణిజ్యేతర సామాజిక సంస్థగా పనిచేస్తుందని వాదించడం ద్వారా, దీనికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలన్న ఇటీవలి రాజకీయ డిమాండ్లను ఇది తోసిపుచ్చుతున్నది.

ఆర్ఎస్ఎస్ అనేది హిందూ సమాజాన్ని సంఘటితం చేసి, చైతన్యవంతం చేసిన ఒక మహావృక్షం (మర్రిచెట్టు) వంటిది. అది అనేక కొమ్మలు, రెమ్మలు, తీగలుగా విస్తరించింది. ఈ శాఖలన్నీ స్వతంత్రంగా పనిచేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అందువల్ల, దీనికి ఒకే ఒక మూలాన్ని వెతకడం అనేది నిష్ప్రయోజనమైన మేధోపరమైన కసరత్తు మాత్రమే అవుతుంది. అయినప్పటికీ, దీని అంతర్భాగం ఎప్పటికీ దృఢంగా, సందర్భోచితంగానే ఉంది. ఎందుకంటే దీని వేర్లు భారతీయ నేలలోని మౌలిక ఆదర్శాలు, త్యాగాలతో లోతుగా పెనవేసుకుని ఉన్నాయి. దీనికి అధికారిక నమోదు (రిజిస్ట్రేషన్) కావాలని కోరడం లేదా అధికార యంత్రాంగ నిబంధనలను పాటించాలని డిమాండ్ చేయడం అనేది గాలిని బంధించడానికి ప్రయత్నించడం లాంటి వ్యర్థమైన పని.

ఇటీవల ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్‌కు కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఒక లేఖ రాశారు. అందులో ఆయన సంస్థ చట్టపరమైన హోదాకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆ లేఖను వ్యక్తిగత హోదాలో కాకుండా, అధికారిక మంత్రి హోదాలో రాశానని స్పష్టం చేశారు. అందులో ఆయన ఆర్ఎస్ఎస్ రిజిస్ట్రేషన్, నిధులు, సంస్థాగత నిర్మాణం, రాజ్యాంగపరమైన జవాబుదారీతనం గురించి ఎనిమిది ప్రశ్నలను లేవనెత్తారు. 60,000కు పైగా శాఖల ద్వారా కార్యకలాపాలు సాగిస్తున్న ఒక సంస్థ చట్టపరమైన నియంత్రణ పర్యవేక్షణ పరిధికి వెలుపల ఉండకూడదని ఆయన వాదించారు. హిందూ సమాజాన్ని, దాని చైతన్యాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ఒక పాత వ్యూహాన్నే కొత్త రూపంలో ఈ లేఖ ద్వారా మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ప్రయోగించింది. ఇది ఒక అంతర్గత వైరుధ్యాన్ని సూచిస్తుంది. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ బహిరంగంగా, గర్వంగా తన హిందూ అస్తిత్వాన్ని ప్రకటించుకుంటారు. ఆయనతో కలిసి మంత్రిగా ఖర్గే పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా హిందూ అస్తిత్వాన్ని సమర్థిస్తుండగా, హిందూ చైతన్యాన్ని ప్రశ్నించే ముందు ఖర్గే తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం ఉందా లేదా అనే ప్రశ్న కూడా తలెత్తుతున్నది.

హిందూ చైతన్యం నుండి ఉద్భవించిన తాత్వికత

భారతదేశ పునరుజ్జీవనం, ధర్మ పరిరక్షణ కోసం 1925లో స్థాపించబడిన ఆర్ఎస్ఎస్, తన శతాబ్ద కాలపు ప్రయాణంలో ఏమి సాధించిందో, అది ఎందుకు అధికారిక నమోదుకు దూరంగా ఉందో అర్థం చేసుకోవలసిన అవసరం సామాన్య ప్రజలకు ఎంతైనా ఉంది. దీనికి ముందుగా ఆర్ఎస్ఎస్‌కు, హిందూ ధర్మానికి మధ్య ఉన్న సంబంధాన్ని గ్రహించాలి. హిందూ ధర్మం ఏ విధంగానైతే ఒకే ఒక్క రక్షకుడిపైన లేదా ప్రవక్తపైన ఆధారపడదో, ఒకే ఒక్క పవిత్ర గ్రంథానికి కట్టుబడి ఉండదో, ఒకే ఒక్క అధికారిక ప్రార్థనా స్థలాన్ని నిర్దేశించదో, అలాగే ఆర్ఎస్ఎస్ కూడా ఒకే ఒక్క కార్యకలాపానికి లేదా వేదికకు పరిమితం కాదు.

అది హిందూధర్మపు శక్తిలాగే సమాజంలో వ్యాపించి ఉంది. ఈ భావనను "ధారయేత్ ఇతి ధర్మ" (ఏది నిలబెడుతుందో అదే ధర్మం) అనే ప్రాచీన తత్వశాస్త్రం ద్వారా ఉత్తమంగా అర్థం చేసుకోవచ్చు. భారతదేశ సాంస్కృతిక చైతన్యానికి ఏదైనా పునాది ఉన్నది అంటే అది ధర్మమే అవుతుంది. భారతీయ సంప్రదాయంలో, ధర్మం కేవలం ఒక మతం లేదా ఒక నిర్దిష్ట ఆరాధనా విధానం కాదు. అది వ్యక్తిని, సమాజాన్ని, విశ్వాన్ని నిలబెట్టే శాశ్వతమైన వ్యవస్థ. 'ధ్రి' (నిలబెట్టడం) అనే సంస్కృత మూల పదం నుండి

ఉద్భవించిన ధర్మం, అస్తిత్వాన్ని కాపాడి, జీవితానికి అర్థాన్నిచ్చే దానికి ప్రతీకగా నిలుస్తుంది. హిందూ సమాజాన్ని సంఘటితం చేయడానికి, దాని ఉనికిని కాపాడేందుకు అవసరమైన 'హిందూ చైతన్యాన్ని' పెంపొందించడానికి ఆర్ఎస్ఎస్ కట్టుబడి ఉంది. ఇది దేశ చిహ్నాలు, ప్రమాణాలు, ఆదర్శాలు, జీవన విధానాలకు ప్రతిరూపంగా నిలుస్తుంది. ఈ బాధ్యతను నిర్వర్తించడానికి, బ్రిటిష్ పాలన కాలంలో ఉన్న 'సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం–1860' నుండి ఎటువంటి ధ్రువీకరణ లేదా గుర్తింపు అవసరం పడలేదు. అలాగే, స్వాతంత్ర్యం తర్వాత అమల్లోకి వచ్చిన 1950 నాటి రాజ్యాంగం కూడా హిందూ చైతన్య హితం కోసం పనిచేయడానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయలేదు. పైగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ, సమావేశమయ్యే హక్కులకు హామీ ఇస్తుంది. శాంతియుతంగా కార్యకలాపాలు సాగించే వ్యక్తులు లేదా సమూహాలపై అధికారిక రిజిస్ట్రేషన్ కోసం ఇది ఎటువంటి చట్టపరమైన బాధ్యతను లేదా నిర్బంధాన్ని విధించదు.

హిందూ సమాజాన్ని మేల్కొల్పి, ఏకం చేయడమే ఆర్ఎస్ఎస్ ప్రధాన ధ్యేయం. ప్రభుత్వ గ్రాంట్లు, నిధులు లేదా పన్ను మినహాయింపులు ఆశించే ప్రభుత్వేతర సంస్థ (ఎన్జీఓ) తరహాలో ఇది పరిమితమైన, లావాదేవీల పరిధిలో పనిచేయదు. ఆర్ఎస్ఎస్ అనేది సమాజం నుంచి, సమాజం చేత, సమాజం కోసం ఏర్పడిన ఒక స్వచ్ఛంద, సైద్ధాంతిక సంస్థ. ఇది లాభాపేక్షతో నడిచే వాణిజ్య సంస్థ కాదు. అధికారాన్ని ఆశించే రాజకీయ పార్టీ కాదు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ ముసుగులో నిధుల సేకరణ వ్యాపారంలో నిమగ్నమైన ఎన్జీఓ కూడా కాదు. మానవాళికి నీటిని అందించ డంలో ఒక నదికి రిజిస్ట్రేషన్ అవసరమా? అని ప్రశ్నిస్తే అవసరం లేదు అనే సమాధానం. కానీ ఆ నీటిని సీసాలలో నింపి అమ్మే వాణిజ్య సంస్థకు మాత్రం కచ్చితంగా అవసరం. ఇది సమాజాన్ని, దాని సాంస్కృతిక విలువలను రాజ్యానికి లోబడి ఉండేవిగా పరిగణించే మనస్తత్వాన్ని ప్రతిబింబి స్తుంది. విద్యావంతుడైన మంత్రిగా ఖర్గేకు ఈ తేడా గురించి నిస్సందేహంగా తెలుసు.

సామూహిక చైతన్య నిర్మాణం

"ఋతం చ సత్యం చాభీద్ధాత్త పసోధ్యాజాయత్"

– ఋగ్వేదం (10.85.1)

"నీతి, సత్యం శాశ్వతమైన విశ్వ క్రమం నుండి పుట్టాయి"

ధర్మానికి సారాంశంగా సత్యం, నీతి ఉన్నాయి. క్రమశిక్షణ, సదుద్దేశం, నిస్వార్థంతో కూడుకున్న వ్యక్తుల నెట్వర్క్‌ను పెంపొందించడం ద్వారా ఈ నైతిక, లౌకిక వ్యవస్థను క్షేత్రస్థాయిలో ఆవిష్కరించ డానికి ఆర్ఎస్ఎస్ అంకితమై ఉంది. చట్టాలు, అధికారిక నిబంధనలు వ్యవస్థలను, యంత్రాంగాన్ని నిర్మించగలిగినప్పటికీ, సకల జీవుల సంక్షేమాన్ని నిర్ధారించడానికి సమాజం నైతిక, ఆధ్యాత్మిక బలాన్ని కలిగి ఉండాలని మానవ చరిత్ర నిరూపిస్తుంది. ఇదే ఆర్ఎస్ఎస్ కచ్చితమైన కార్యాచరణ. దీనికి రాజ్యాంగ నిబంధన లేదా రిజిస్ట్రేషన్ అవసరమా? ఒకవేళ ఎవరైనా పెద్దల పట్ల గౌరవం, సామాజిక సామరస్యం, తమ సంస్కృతి, వారసత్వం పట్ల భక్తిని బోధించాలనుకుంటే, వారు ప్రభుత్వ అనుమతిని కోరాలా? ఖర్గేకు ఈ వాస్తవం తెలియదనేది అత్యంత అసంభవమైన విషయం.

ఏకత్వ భావన: పరమాణువు నుండి విశ్వం వరకు

ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల విధానం దాని సిద్ధాంతం, ఆచరణల మధ్య ఉన్న సంపూర్ణ సమన్వయాన్ని ప్రతిబింబిస్తుంది. దాని సమావేశాలు ఋగ్వేదంలోని **"సంగచ్ఛధ్వం సంవదధ్వం సం వో మనాంసి జానతామ్। దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే॥"** (మండలం 10, సూక్తం 191, మంత్రం 2) అనే వైదిక ప్రార్థనతో ప్రారంభ మవుతాయి. ''దేవతలు తమ హవిస్సులను ఏకమనోభావంతో సమర్పించినట్లే కలిసి నడవండి, కలిసి మాట్లాడండి, మీ మనస్సులు ఏకమై ఉండనివ్వండి" అనే అర్థాన్ని ఈ ప్రార్థన ఇస్తుంది. ఈ శ్లోకం ఐక్యత, సామరస్యం, సహకారానికి ఒక శక్తివంతమైన ప్రతీక. ఆధునిక సమాజానికి అత్యంత అవసరమైనవి అటువంటి శాశ్వత విలువలే కదా? అని ప్రశ్నిస్తే నిస్సందేహంగా అవును అనే సమాధానం వస్తుంది. ప్రభుత్వ నమోదు లేదా అధికారిక ప్రకటన లేకుండా ఐక్యత, సామరస్యం, పరోపకారం, సహకారం సాధ్యం కావని కాంగ్రెస్ పార్టీ వాదిస్తోందా? ప్రతి ఆర్ఎస్ఎస్ కార్యక్రమం "సర్వేభవంతు సుఖినః, సర్వేసంతు నిరామయాః" (అందరూ సుఖంగా ఉండాలి, అందరూ అనారోగ్యం నుండి విముక్తులై ఉండాలి) అనే సర్వజన శ్రేయస్సును కోరే విశ్వవ్యాప్త ప్రార్థనతో ముగుస్తుంది. మానవాళి, ప్రకృతి శ్రేయస్సు కోసం చేసే సామూహిక కృషికి ప్రభుత్వ అనుమతి అవసరమా? ఒకవేళ అదే నిజమైతే, బ్రిటిష్ పాలన, కాంగ్రెస్ పార్టీ లేదా ఖర్గే ఉనికిలోకి రాకముందే, వేల సంవత్సరాలుగా హిందూ సమాజానికి దిశానిర్దేశం చేసే వెలుగుగా నిలిచిన ప్రాచీన వేద శ్లోకాలు నిలిచి ఉండేవి కావు.

మహాభారతం (శాంతి పర్వం, 109.10)లో చెప్పినట్లుగా "ధర్మో రక్షతి రక్షితః" (ధర్మాన్ని రక్షించేవారిని ధర్మం రక్షిస్తుంది) ధర్మ పరిరక్షణను ఆర్ఎస్ఎస్ ఎల్లప్పుడూ తన ప్రాథమిక కర్తవ్యంగా భావిస్తూ వచ్చింది. తత్ఫలితంగా, అది అంతర్గత, బాహ్య భారత్–వ్యతిరేక, హిందూ–వ్యతిరేక శక్తులకు లక్ష్యంగా మారింది. భారతదేశ పరిరక్షణ కోసం, హిందూ సంప్రదాయాలను నిరంతరం బలోపేతం చేయడం అనేది ఐచ్ఛికమైన పని కాదు. అది అత్యంత ఆవశ్యకమైన కార్యం.

ఆర్ఎస్ఎస్ అనేది ఒక జీవన విధానం, హిందూ చైతన్యానికి సంబంధించిన ఒక మేల్కొలుపు. దీనితో అనుబంధం కలిగి ఉండి చట్టబద్ధంగా నమోదైన సంస్థల ద్వారా లక్షలాది మంది పౌరులు దేశానికి వివిధ రంగాలలో సేవలు అందిస్తున్నారు. వీటిలో విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక సంక్షేమం, అనాథాశ్రమాలు, విశ్వవిద్యాలయాలు, ప్రచురణ సంస్థలు, మీడియా సంస్థలు, సాంస్కృతిక ట్రస్టులు, వ్యవసాయ, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఆర్థిక సంస్థలు వంటివి ఉన్నాయి. ఈ అనుబంధ సంస్థలన్నీ అధికారికంగా నమోదయ్యాయని, నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని, తమతమ రంగాలలో అగ్రగాములుగా గుర్తింపు పొందాయని ఖర్గేకు బాగా తెలుసు.

ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన ప్రతి విషయం బహిరంగమే. ఇందులో ఎలాంటి రహస్యం లేదు. ప్రియాంక్ ఖర్గే తన తండ్రి(కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే)తో కలిసి ఏ ఆర్ఎస్ఎస్ కార్యక్రమానికైనా లేదా రోజువారీ 'శాఖ' కైనా హాజరై స్వయంగా పరిశీలించవచ్చు. ఆర్ఎస్ఎస్ ఎటువంటి ప్రభుత్వ గ్రాంట్లనూ స్వీకరించదు. దీని నిర్వహణ ఖర్చులు పూర్తిగా గురుపౌర్ణమి సందర్భంగా స్వయంసేవకులు సమర్పించే గురుదక్షిణ ద్వారానే సమకూరుతాయి. ఒకవేళ మంత్రికి ఈ వాస్తవాలు తెలిసి కూడా ఆయన వైఖరి ఉద్దేశపూర్వకంగా వ్యతిరేకతను ప్రదర్శించేలా కనిపిస్తుంది. ఎన్నికైన ప్రజాప్రతినిధిగా ఆయన విచక్షణతో వ్యవహరించాలి.

ఆర్ఎస్ఎస్ అనేది వ్యక్తిత్వ వికాసానికి అంకిత మైన ఒక జీవితకాల క్రమశిక్షణ. దేశ వ్యతిరేక లేదా విభజనవాద ఉద్దేశాలు లేనంత వరకు, ఏ కులం, మతం, లింగం లేదా రాజకీయ భావజాలం కలిగిన వారికైనా ఇందులో ప్రవేశం ఉంటుంది. ఈ సంస్థ ద్వారా రూపుదిద్దుకున్న వ్యక్తులు ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, బ్యాంకింగ్, విశ్వవిద్యాలయాలు, రైల్వేలు, తపాలా శాఖ వంటి వివిధ రంగాలలో సేవలు అందిస్తున్నారు. వారు తమ నిజాయతీ, వినయం, సామాజిక సామరస్యం పట్ల అంకితభావానికి గుర్తింపు పొందారు.

ఆర్ఎస్ఎస్ రిజిస్టర్ కావాలని డిమాండ్ చేయడం అంటే, సాంస్కృతిక సమగ్రతా భావనతో ఏకీభవించే ప్రతి భారతీయుడు తమ వ్యక్తిగత విశ్వాసాలను ప్రభుత్వం దగ్గర రిజిస్టర్ చేసుకోవాలా అని పరోక్షంగా అడగడమే అవుతుంది. ఆ మాటకొస్తే, ప్రతి హిందువు ఆలోచనా విధానాన్ని కూడా రిజిస్టర్ చేయాల్సి వస్తుంది.

– జాగృతి డెస్క్

ఆపరేషన్ కమల్.. ఇప్పుడు కొన్ని పార్టీలను వణికిస్తున్న పదం.. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు, రాజ్యసభ ఎన్నికల ద్వారా ఎన్డీఏ కూటమికి పెరిగిన బలంతో దేశ రాజకీయాల్లో ఒక్కసారిగా అలజడి మొదలైంది. టీఎంసీలో చీలిక, శివసేన (యూబీటీ)లో తిరుగుబాటు, ఎన్సీపీ (ఎస్పీ)లో ఆయోమం, సమాజ్‌వాదీలో లుకలుకలు, కాంగ్రెస్ పార్టీ నమ్మకద్రోహంపై డీఎంకే, ఆప్ ఆగ్రహం ఇండీ కూటమిని మరింత దెబ్బ తీస్తున్నాయి. ఇందులో కొన్ని పార్టీల మనుగడకే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిణామాల్లో కొన్నింటి వెనుక బీజేపీ ఉందని ఆయా పార్టీల ఆరోపణ. ఆపరేషన్ కమల్ మళ్లీ మొదలైందని మీడియా విశ్లేషిస్తోంది. ఇందుకు కారణం ఈ పార్టీల్లోని తిరుగుబాటుదారులు ఎన్డీఏ కూటమికి మద్ధతు ప్రకటించడమే.

విపక్షం ఆందోళనలు ఎలా ఉన్నా, ఈ పరిణామాలు ఎన్డీఏ కూటమికి, కేంద్ర ప్రభుత్వానికి ఎంతో అనుకూలిస్తున్నాయి. ముఖ్యంగా పార్లమెంట్ ఉభయసభల్లో మహిళా రిజర్వేషన్, లోక్‌సభ సీట్ల సంఖ్య పెంపు బిల్లు గట్టెక్కేందుకు తగిన సంఖ్యాబలం లభించే అవకాశం ఉంది. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఇంకో ఏడాదిలోగా పడిపోతుందని ఇటీవల విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఆయన ప్రకటన ఈ ఏడాది అత్యుత్తమ జోక్ అని బీజేపీ నాయకులు నవ్వుకున్నారు. నిజంగానే దేశంలో అలాంటి వాతావరణం ఉందా?.. నిరాశా నిస్పృహల్లో ఉన్న తమ పార్టీ యంత్రాంగంలో జోష్ నింపేందుకు రాహుల్ అలా అని ఉం డవచ్చు.. కానీ వాస్తవ పరిస్థితులు వేరుగా ఉన్నాయి.. ఈ ఏడాది లోపే విపక్షం మరింత క్షీణించే అవకాశాలు కనిపిస్తు న్నాయి.

తాజా పరిణామాలు గమనిస్తే, చివరకు టీఎంసీ వ్యవస్థాపకురాలైన మమతా బెనర్జీ నాయకత్వానికి సవాల్ విసురుతూ పార్టీలో ఛైర్ పర్సన్ పదవిని సృష్టించింది తిరుగుబాటువర్గం. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను పార్టీ ఛైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించింది. ఫిర్హాద్ హకీమ్, రథిన్ ఘోష్, సబీనా యాస్మిన్‌లను ఉపాధ్యక్షులుగా.. రితబ్రత బెనర్జీ, జావెద్ ఖాన్, సందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. అఖ్రుజ్జమాన్ అన్సారీకి కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. టీఎంసీ రాజ్యాంగం ప్రకారం అన్ని నిబంధనలను పాటిస్తూ ఈ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు రితబ్రత. పార్టీ అసలైనదా కాదా? అన్నది తాము నిర్ణయించేది కాదని, ఎన్నికల సంఘమే దానిపై తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మమత కోరుకుంటే ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించవచ్చని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? మమతా బెనర్జీ తదుపరి వ్యూహం ఏమిటి? అనేది ఆసక్తి కలిగిస్తోంది..

ఇండీ కూటమికి బీటలు

ప్రాంతీయ పార్టీల్లోని అంతర్గత తిరుగుబాట్లకు, ఇండీ కూటమి క్షీణతకు గల 5 ముఖ్య కారణాలుగా కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష వైఖరి, నమ్మక ద్రోహం, ఎన్నికల ఓటములు, అంతర్గత శత్రుత్వం, రాజకీయ అవకాశవాదం కనిపిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ మిత్రపక్షమైన డీఎంకేను వదిలేసి, ఎన్నికల్లో విజయం సాధించిన నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చింది. వారి ప్రభుత్వంలో కాంగ్రెస్ చేరడం తీవ్ర నమ్మకద్రోహంగా భావించారు స్టాలిన్. దీనివల్ల డీఎంకే ఇండీ కూటమి నుండి పూర్తిగా బయటకు వచ్చింది. ఢిల్లీ, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమను ఓడించడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని ఆప్ నేతలు కూటమికి దూరమయ్యారు.

ప్రాంతీయ పార్టీలలోని చాలామంది సీనియర్ నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం అధికార ఎన్డీయే లేదా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. సిద్ధాంతాల కంటే అధికారమే పరమావధిగా భావించే కొందరు నేతలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడుతూ సొంత పార్టీలను బలహీనపరుస్తున్నారు.

టీఎంసీపై పిడుగు

టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీల నియంతృత్వం మీద స్వయంగా సొంత పార్టీ వారే తిరగబడ్డారు. ఆ పార్టీకి చెందిన 58 మంది ఎమ్మెల్యేలు, 20 మంది లోక్‌సభ ఎంపీలు వేరు కుంపటి పెట్టుకున్నారు. ముగ్గురు రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేశారు. మరోవైపు లోక్‌సభలో కకోలి ఘోష్ దస్తీదార్ నాయకత్వంలోని తిరుగుబాటు ఎంపీలు తగిన సంఖ్యాబలంతో అసలైన టీఎంసీ తమదేనని ప్రకటించారు. వీరంతా ఎన్డీఏ కూటమికి మద్దతు ఇవ్వడంతో పాటు 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో విలీనమైనట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖను అందించారు.

ఉద్ధవ్ సేనలో చీలిక

తాజాగా శివసేన (యూబీటీ)కి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ ఎంపీల్లో ఆరుగురు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేనలో చేరిపోయారు. నాలుగేళ్ల క్రితం 2022 జూన్ 22న 40 మంది ఎమ్మెల్యేలు తమతో వచ్చారన్న షిండే, ఇప్పుడు ఏకంగా 'సిక్స్' కొట్టామని పేర్కొన్నారు. శివసేన రెండో విడత విస్తరణ ప్రణాళికగా ఈ చేరికను అభివర్ణించారు. 'ఆరు పులులు ఇప్పుడు అసలైన శివసేన ఫ్యామిలీలోకి వచ్చాయి. వారికి స్వాగతం. ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది' అని ప్రకటించారు. తిరుగుబాటు

ఎంపీలు పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించకుండా స్పీకర్ ఓం బిర్లాకు లేఖ కూడా ఇచ్చేశారు.

అయోమయంలో శరద్ పవార్

శివసేన (యూబీటీ)లో సంక్షోభం నడుస్తున్న తరుణంలోనే ఎన్‌సీపీ (శరద్ పవార్)లో కూడా మరో తిరుగుబాటు రాబోతోందనే వార్తలు ఊపందుకున్నాయి. కనీసం ఐదుగురు లోక్‌సభ ఎంపీలు అధికార పక్షంలో భాగమైన ఎన్సీపీ (సునేత్రా పవార్)లోకి మారేందుకు చర్చలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతుండగా శరద్ పవార్ వర్గం ఈ వాదనలను తీవ్రంగా కొట్టిపారేసింది. మరోవైపు ఎన్‌సీపీ (శరద్ పవార్)ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయబోతున్నారనే విస్తృత ప్రచారం జరిగింది. దీంతో తమ పార్టీ స్వతంత్రంగానే ఉంటుందని వివరణ ఇచ్చుకోక తప్పలేదు. మహారాష్ట్ర రాజకీయాల్లో

కి వరం

రానున్న రోజుల్లో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సమాజ్‌వాదీ చీలుతోందా?

మరోవైపు వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లోనూ అలజడి మొదలైంది. ఎస్పీకి చెందిన 37మంది ఎంపీల్లో సుమారు 25 మంది బీజేపీతో టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. వీరంతా అఖిలేష్ యాదవ్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారని, వారు పార్టీని వీడటానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య, మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఆ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ బీజేపీలో చేరడానికి సంసిద్ధంగా ఉన్నామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారని అంటున్నారు. ఈ పరిణామాలు పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌ను కలవరపెడుతున్నాయి. ఇవన్నీ ఉద్దేశ పూర్వకంగా సృష్టిస్తున్న పుకార్లని కొట్టిపారేశారు. విపక్షాలను బలహీనపరచడానికి బీజేపీ 'ఆపరేషన్ కమల్' ద్వారా కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

తృణమూల్, శివసేన యూబీటీ, సమాజ్‌వాది పార్టీలలో అలజడి మిగతా ప్రాంతీయ పార్టీలను హడలెత్తిస్తోంది. తదుపరి వంతు ఎవరు? అనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలు రాఘవ్ చద్దాతో కలిసి బీజేపీలో చేరారు. జార్ఖండ్‌లోని అధికార జేఎంఎం సైతం ఎన్డీఏ కూటమిలోకి వస్తుందన్న ప్రచారం సాగుతోంది. తాజాగా అక్కడ జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఒకటి జేఎంఎం గెలుచుకోగా, మరో సీటును బీజేపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఇండీ కూటమిలోని ఆర్‌జేడీ, లెఫ్ట్ పార్టీల ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో తాము ఓడిపోవాల్సి వచ్చిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఒకప్పుడు దేశంలో మూడో జాతీయ పార్టీగా వెలుగొందిన బీఎస్పీ ఇప్పటికే కనుమరుగు దశలో ఉంది.మరోవైపు ప్రాంతీయ పార్టీల్లో మాత్రం ఏ నేత ఎప్పుడు తమపై తిరుగుబాటు జెండా ఎగరవేస్తారో ననే బెంగ పట్టుకుంది.

ఎన్డీఏకు తిరుగులేని బలం

విపక్ష ఇండీ కూటమి బలహీనపడటం, ప్రాంతీయ పార్టీలలో వస్తున్న చీలికలు నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీకి, ఎన్డీఏ కూటమికి రాజకీయంగా, వ్యూహాత్మకంగా భారీగా లబ్ధి చేకూరుస్తున్నాయి. విపక్ష కూటమి నుండి అసంతృప్తితో బయటకు వచ్చే చిన్న లేదా ప్రాంతీయ పార్టీలు తమ మనుగడ కోసం ఎన్డీఏ వైపు చూసే అవకాశం పెరుగుతోంది. విపక్షాల బలం తగ్గడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో కీలక బిల్లులను ఆమోదించుకోవడం సులువవుతుంది. లోక్‌సభలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు 293 సీట్ల బలం ఉంది. రెండొంతుల సంఖ్యాబలం లేకపోవడంతో ఇటీవల 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపు బిల్లులు వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. రాజ్యసభలో ప్రస్తుతం ఎన్డీఏ కూటమి బలం తగినంత కాదు. తాజాగా జరిగిన ఎన్నికలు, టీఎంసీలో చీలిక ప్రభావంతో 163 స్థానాలకు చేరింది. అయితే కనీస మెజారిటీ అయిన 172 సీట్లకు దూరంలోనే ఉంది. పార్లమెంటులో కీలక బిల్లులు నెగ్గాలన్నా, ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు సాధించాలన్నా తగిన సంఖ్యాబలం అవసరం. టీఎంసీ, శివసేన పార్టీల తిరుగుబాటు ఎంపీలు ఎన్డీయే కూటమికి మద్ధతు ఇవ్వడంతో అధికార పక్షం పని మరింత సులువు కానుంది. సమాజ్‌వాదీలో లుకలుకలు, ఆప్ చీలిక, కాంగ్రెస్ పార్టీకి దూరమైన డీఎంకే కూడా అధికార పక్షం ప్రవేశ పెట్టే బిల్లులకు మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ కారణంగా మరిన్ని పార్టీలు ఇండీ కూటమి నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నాయని డీఎంకే నేత ఇళంగోవన్ పేర్కొన్నారు

బీజేపీ ఏమంటోంది?

ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమల్' వ్యూహాన్ని అమలు చేస్తోందనే మీడియా వర్గాల్లో ప్రచారమవుతోంది. ప్రాంతీయ పార్టీల్లో ఉన్న అసంతృప్తిని, ఆశలను బీజేపీ సమర్థవంతంగా వాడుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్–ప్రాంతీయ పార్టీల మధ్య ఉన్న ఆధిపత్య పోరును బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంటోందని అంటున్నారు

ఇండీ కూటమిలో చీలికలు, భాగస్వామ్య పక్షాల అంతర్గత విభేదాల వెనుక బీజేపీ ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ఆ కూటమి సహజంగానే కాలక్రమేణా విచ్ఛిన్నమవుతుందని బీజేపీ పేర్కొంటోంది. తాము ఎవరినీ విడగొట్టాల్సిన అవసరం లేదని, విపక్షాలు తమ స్వంత అంతర్గత కుమ్ములాటలు, అవినీతి ఆరోపణలతో కూలిపోతున్నాయని స్పష్టం చేస్తోంది.కాంగ్రెస్‌కు, ప్రాంతీయ పార్టీలైన తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ , డీఎంకేల మధ్య క్షేత్రస్థాయిలో ఎలాంటి ఐక్యత లేదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేస్తున్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఎన్డీఏ కూటమి మాత్రమే స్థిరమైన ప్రభుత్వాన్ని ఇవ్వగలదనే నమ్మకాన్ని బీజేపీ మరింత పటిష్టం చేసుకుంటోంది. మోదీకి ప్రత్యామ్నాయం ఎవరు?" అనే ప్రచారాన్ని బీజేపీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలుగుతోంది. విపక్షాల్లో ఐక్యత లేదని, వారు దేశాన్ని పాలించలేరనే భావనను ఓటర్లలో నాటడానికి ఇది ఉపయోగపడుతుంది.ఈ పరిణామాలు కాంగ్రెస్‌కు ఆందోళన కలిగిస్తున్నాయి. దాదాపుగా ప్రాంతీయ పార్టీలన్నీ కుటుంబ ఆధిపత్యంలో ఉంటాయి. దీంతో ఆ పార్టీల్లో వారసులు తప్ప, ఎంత కష్టపడ్డా ఇతరులు అగ్రస్థానాలకు చేరుకోలేరు. ఇదే ఆ పార్టీల్లో అంతర్గత చీలికలకు దారి తీస్తోంది.

క్రాంతిదేవ్ మిత్ర
సీనియర్ జర్నలిస్ట్

ఒకప్పుడు మిగులు బడ్జెట్, వేగవంతమైన ఆర్థిక వృద్ధి, భారీ పెట్టుబడులకు చిరునామాగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు అప్పుల చర్చలో దేశవ్యాప్తంగా ముందువరుసలో నిలుస్తోంది. రాష్ట్రం ఏర్పడిన తొలి దశలో ఆదాయ వృద్ధి, పారిశ్రామిక విస్తరణ, ఐటీ రంగం ప్రగతి, భూముల విక్రయాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చినా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్రాన్ని అప్పుల్లో కూరుకుపోయేలా చేశాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే ఒరవడిని కొనసాగిస్తోంది.

రాష్ట్ర ఆదాయం అప్పులు, వడ్డీలకే కరిగి పోతోంది. సంక్షేమ పథకాలు, ప్రాజెక్టుల నిర్మాణం వివిధ కార్యక్రమాల అమలు కోసం ఎంత భారీ రుణభారం పేరుకుపోతోందో చూపిస్తూ.. కంప్రోల్టర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇస్తున్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రం తీసుకుంటున్న అప్పులు అభివృద్ధి కోసం మాత్రమే కాకుండా, పాత అప్పులు తీర్చడానికి కూడా సరిపోని స్థితికి చేరాయని గణాంకాలు సూచిస్తున్నాయి. అభివృద్ధి కోసం అప్పులు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. తెచ్చిన ఆ అప్పులు ఎక్కడికి వెళ్తున్నాయి? భవిష్యత్తులో వాటి భారం ఎవరిపై పడబోతోంది? అనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు కొత్త పథకాల ప్రకటనలు, మరోవైపు పెరుగుతున్న అప్పులు, వడ్డీ చెల్లింపులు, రెవెన్యూ లోటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

రూ.6.89 లక్షల కోట్ల రుణభారం

కాగ్ విశ్లేషణ ప్రకారం 2015-16 నుంచి 2024-25 మధ్య దేశంలోని అన్ని రాష్ట్రాల అప్పులు సగటున 190 శాతం పెరిగాయి. కానీ తెలంగాణ విషయంలో అది 357 శాతంగా నమోదై, దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2024-25 నాటికి రాష్ట్ర మొత్తం రుణభారం రూ.6,89,021 కోట్లకు చేరింది. రాష్ట్ర జీఎస్‌డీపీలో అప్పుల వాటా 27.27 శాతంగా ఉంది. ఇది ప్రమాదకర స్థాయికి చేరువలో ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర ఆదాయం పెరిగినా, అప్పుల పెరుగుదల అంతరంటే వేగంగా ఉండడం ఆర్థిక సమతుల్యతను దెబ్బ తీస్తోంది. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్కువ భాగం వడ్డీలు, అప్పుల చెల్లింపులకే సరిపోతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ''డెట్ ట్రాప్'' లక్షణాలు కనిపించడం. 2024-25లో రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ రుణాలు, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్‌డ్రాఫ్ట్‌ల రూపంలో రూ.1,89,071 కోట్లు అప్పు తెచ్చింది. అయితే అందులో రూ.1,42,701 కోట్లు పాత అప్పులు, వడ్డీల చెల్లింపులకే సరిపోయాయి. అంటే ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి నాలుగు రూపాయల్లో మూడు రూపాయలు పాత బకాయిలను తీర్చడానికే వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తగా అభివృద్ధి కార్యక్రమాలకు లేదా సంక్షేమానికి నిర్దేశించిన మొత్తం కేవలం రూ.46,370 కోట్లు మాత్రమే.

రెవెన్యూ లోటు సర్దుబాటు చేసిన తర్వాత మిగిలింది రూ.36,950 కోట్లు. ఇది అప్పు మీద అప్పు తీసుకుంటూ ముందుకు సాగుతున్న ఆర్థిక వ్యవస్థకు సంకేతంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.



అప్పుల ఊ

రోజూ ఓవర్‌డ్రాఫ్ట్?

కాగ్ నివేదికలోని నగదు కొరత తీవ్రతను తెలియజేసే మరో లెక్క ఆందోళనకర అంశం. రాష్ట్రం దాదాపు ఏడాది పొడవునా తాత్కాలిక అప్పులపైనే ఆధారపడుతోంది. 2024-25లో ఆర్థిక సంవత్సరంలో వేస్ అండ్ మీన్స్ లేదా ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాలను వినియోగించుకుంది. దేశంలో పంజాబ్ తర్వాత రెండో స్థానంలో నిలిచింది. సాధారణంగా ఈ విధమైన అప్పులు తాత్కాలిక నగదు కొరతను అధిగమించేందుకు ఉపయోగిస్తారు. కానీ, దాదాపు ప్రతిరోజూ వాటిపైనే ఆధారపడటం ఖజానా నిర్వహణలో ఒత్తిడిని ఎత్తిచూపుతోంది. దాదాపు ఏడాది పొడవునా తాత్కాలిక అప్పులపై ఆధారపడటం రాష్ట్ర ఖజానా పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం నేరుగా తీసుకున్న అప్పులు మాత్రమే కాదు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, ప్రత్యేక ప్రయోజన వాహనాల కోసం తీసుకున్న రుణాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా భారీ స్థాయిలో ఉన్నాయి. కాగ్ నివేదిక ప్రకారం 2025 మార్చి నాటికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు రూ.2,41,528 కోట్లకు చేరాయి. ఇవి రాష్ట్ర జీఎస్‌డీపీలో 14.72 శాతం. దేశంలోనే అత్యధికం. జీఎస్‌డీపీలో 10 శాతానికి మించి గ్యారంటీలు ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ సంస్థలు అప్పులు చెల్లించ లేని పరిస్థితి వస్తే, ఆ భారం చివరికి ప్రభుత్వంపైనే పడుతుంది. ఇవి ప్రస్తుతం కనిపించని

బిలో 'సంపన్న' రాష్ట్రం

అప్పులైనా భవిష్యత్తులో ప్రజలపైనే భారం పడే అవకాశముంది.

అంచనాలు, వాస్తవాల మధ్య భారీ వ్యత్యాసం

రాష్ట్ర బడ్జెట్ అంచనాలు, వాస్తవ ఆదాయాల మధ్య భారీ అంతరం కనిపిస్తోంది. 2026-27 బడ్జెట్‌లో రూ. 2.41 లక్షల కోట్ల రెవెన్యూ వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ, మే నాటికి వచ్చిన ఆదాయం కేవలం రూ. 28,442 కోట్లు. అంచనాలో 11.7 శాతం. ప్రత్యేకంగా పన్నేతర ఆదాయం విషయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. భూముల అమ్మకాలు, ఇతర వనరుల ద్వారా రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ఖర్చులను నిర్వహించేందుకు ప్రభుత్వం అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. బడ్జెట్‌లో రూ. 6,858 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని ప్రభుత్వం ప్రకటిస్తే, మే నాటికి వాస్తవంగా రూ. 5,038 కోట్ల రెవెన్యూ లోటు నమోదైంది. ఇది అంచనాలు, వాస్తవాల మధ్య పెరుగుతున్న అంతరానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

అప్పులతో పాటే వడ్డీ భారం కూడా పెరుగుతోంది. ప్రస్తుతం వడ్డీ చెల్లింపుల కోసం పెన్షన్ వ్యయం కంటే ఎక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉంది. 2024-25లో మొత్తం బడ్జెట్ వ్యయంలో 10 శాతానికి మించిన మొత్తం.. వడ్డీల చెల్లింపులకే ఖర్చవుతోంది. ఇది అప్పుల భారాన్ని ప్రతిబింబించే సూచికగా కాగ్ పేర్కొంది. ప్రభుత్వం కొత్త అభివృద్ధి పనుల కోసం కేటాయించాల్సిన నిధుల్లో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలకే వెళ్తుండటం భవిష్యత్ తరాలపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతోంది.

సంక్షేమం కోసం అప్పులు

కాగ్ నివేదికలో మరో అంశం గమనిస్తే... రాష్ట్ర బడ్జెట్‌లో మెజార్టీ భాగం సంక్షేమ కార్యక్రమాలకే కేటాయిస్తున్నారు. మే 2026 నాటికే జీతాలకు రూ. 8,324 కోట్లు, పెన్షన్లకు రూ. 4,758 కోట్లు, సబ్సిడీలకు రూ. 5,809 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ. 9,930 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇది రాజకీయంగా అధికార పార్టీకి ప్రజాదరణ పొందేందుకు కారణమవుతున్నప్పటికీ.. అదే సమయంలో భవిష్యత్తులో ఆదాయం పెంచే పెట్టుబడులు తగ్గిపోతే ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగడం తథ్యమంటున్నారు విశ్లేషకులు. కాగ్ నివేదిక ప్రకారం 2024-25లో ఆస్తుల సృష్టికి తెలంగాణ ప్రభుత్వం పెద్దగా ఖర్చు చేయలేదు. మిషనరీ, పరికరాల కొనుగోలుపై దేశవ్యాప్తంగా రాష్ట్రాలన్నీ.. రూ. 16,849 కోట్లు ఖర్చు చేస్తే, తెలంగాణ వాటా కేవలం రూ. 300 కోట్ల లోపే ఉంది. అంటే అప్పులు పెరుగుతున్నా, ఆ అప్పులతో కొత్త ఆదాయ వనరులు సృష్టించే పెట్టుబడులు తగిన స్థాయిలో కనిపించడం లేదు. మరోవైపు జీతాలు, పెన్షన్లు, సబ్సిడీలు, సంక్షేమ పథకాలపై భారీగా ఖర్చు పెరిగిపోతోంది. సంక్షేమం అవసరమే అయినప్పటికీ, అదే సమయంలో ఆదాయాన్ని పెంచే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉత్పాదక రంగాలపై ఖర్చు తగ్గిపోతే భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక స్థితి మరింత బలహీనపడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మద్యం ఆదాయమే కీలకం

రాష్ట్ర ఆదాయంలో ఎక్సైజ్ వసూళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఎక్సైజ్ ఆదాయం విషయంలో రాష్ట్రం,దేశంలో మొదటి స్థానాల్లో ఉంది. గత పదేళ్లలో ఈ ఆదాయం 388 శాతం పెరిగింది. 2024-25లో మద్యం విక్రయాల ద్వారా రూ. 18,604 కోట్ల ఆదాయం వచ్చింది. దేశంలోనే అత్యధిక వృద్ధి ఇది. ఆర్థిక పరంగా ఇది ఆదాయ వనరే అయినా, సామాజికంగా దీర్ఘకాలిక ప్రభావాలు తప్పవని, ప్రజారోగ్యంపై ప్రభావం చూపే రంగాలపై అధికంగా ఆధారపడటం దీర్ఘకాలంలో సుస్థిర ఆర్థిక వ్యూహం కాదని నిపుణులు చెబుతున్నారు.

ప్రభుత్వం తీసుకునే అప్పులను ప్రభుత్వం మాత్రమే చెల్లించదు. ఆ భారాన్ని చివరికి పన్నుల రూపంలో, ఫీజుల రూపంలో, వినియోగదారులపై ఛార్జీల రూపంలో ప్రజలే భరిస్తారు. అంటే.. ఈరోజు తీసుకున్న అప్పులు రేపటి తరాలకు బాధ్యతలుగా మారతాయి. వడ్డీ చెల్లింపులు పెరిగితే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు తగ్గిపోతాయి. కొత్త పన్నులు విధించే అవకాశం పెరుగుతుంది. ప్రభుత్వ రంగ సంస్థల సేవల ధరలు కూడా పెరగవచ్చు. అంటే అప్పు తీసుకుని అమలు చేస్తున్న ప్రతి పథకం వెనుక భవిష్యత్తు తరాలు చెల్లించాల్సిన బిల్లు కూడా ఉందన్నది వాస్తవం అంటున్నారు ఆర్థిక నిపుణులు.

రాష్ట్రానికి బలమైన ఆదాయ వనరులు ఉన్నాయి. సొంత ఆదాయంలో దేశంలోనే ముందంజలో ఉంది. ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య రంగాలతో పాటు.. పన్ను వసూళ్లు, జీఎస్‌టీ, వాణిజ్య పన్నులు, భూముల విక్రయాలు ఆర్థిక ఆధారంగా ఉన్నాయి. ఇదే కాగ్ నివేదికలోని సానుకూల అంశంగా చెప్పుకోవచ్చు. అయితే ఆదాయం పెరుగుతున్నా అప్పులు కూడా మరింత వేగంగా పెరుగుతుండటం, కొత్త అప్పుల్లో ఎక్కువ భాగం పాత అప్పుల చెల్లింపులకే వెళ్తుండటం, వడ్డీ భారం పెరగడం, అభివృద్ధి పెట్టుబడులు తగ్గిపోవడం వంటి అంశాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతుల్యత, అప్పుల నిర్వహణలో క్రమశిక్షణ, ఆదాయ వనరుల విస్తరణ తప్పనిసరిగా మారాయి. లేకపోతే ఈరోజు కనిపిస్తున్న సంక్షేమ వెలుగుల వెనుక రేపటి ఆర్థిక చీకట్లు మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని కాగ్ గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

కల్తీ మాంసా

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతి సహా అనేక నగరాలు, పట్టణాలు కల్తీ మాంసంతో కలవరపడుతున్నాయి. ప్రజల జిహ్వాచాపల్యం ఆసరాగా మాంసం వ్యాపారులు వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రోజుల తరబడి నిల్వ ఉంటున్న కల్తీ మాంసం పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి అవుతోంది. ఆహారభద్రతా అధికారులు తగినంత సంఖ్యలో లేకపోవడంతో తనిఖీలకు అవకాశం లేకుండా పోతోంది.

సాక్షాత్ శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న పవిత్ర ప్రదేశం తిరుపతి. ఐదారు లక్షలమంది స్థానికులు, రోజువారీగా శ్రీవారి దర్శనానికి వేలల్లో వచ్చే యాత్రికులు, ఇతర అవసరాలతో వచ్చే వేలమంది వ్యాపారులు.. ఇలా లక్షలాది జనాభాతో తిరుపతి నిత్యం కిటకిటలాడుతుంది. రాష్ట్రంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగి భారీ రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పరిశుభ్రమైన ఆహారం లభించడం ఒక కలగా మారిందా? అన్న ప్రశ్న చర్చనీయాంశం అయింది. తిరుపతి నగరంలో ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీల్లో ఘోరమైన వాస్తవాలు బయట పడ్డాయి. కుళ్లిన మాంసం, పురుగులు పట్టిన చేపలు, రసాయనాలు కలిపిన ఆహార పదార్థాలు ఈ పవిత్ర నగర ప్రజలకు పళ్లేలలో వడ్డనవు తున్నాయని తేలడం భయకంపితులను చేస్తోంది. అత్యంత ఆందోళన కరమైన విషయమేమిటంటే, ఇది కేవలం తిరుపతికే పరిమితమైన సమస్య కాదు ఆంధ్రప్రదేశ్ నలు మూలలకు సరఫరా అవుతున్నాయి. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, ఉత్తరాది రాష్ట్రాల నుండి టన్నుల కొద్దీ అపరిశుభ్రమైన మాంసం రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు దిగుమతి అవుతున్నది. ఇది ప్రజారోగ్యానికి పొంచి ఉన్న మహాముప్పుగా పరిణమించింది.

ఎక్కడి నుండి వస్తున్నది? ఎలా వస్తున్నది?

ఆంధ్రప్రదేశ్‌లో దిగుమతి అవుతున్న మాంసం మొత్తం తెలంగాణ,తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణా తదితర రాష్ట్రాల నుండి వస్తున్నదే. ముందుగా హైదరాబాదు, చెన్నైకి చేరిన మాంసం, నిల్వఉండేలా రసాయనాలను పూసి రాష్ట్రం లోని అన్నిప్రాంతాలకు తరలిస్తున్నారు. హైదరాబాదు, చెన్నై నగరాల్లో మేక తలలు, కాళ్లు వంటి అవయవాలకు పెద్దగా గిరాకీ ఉండదు. అందువల్ల వాటిని చాలా చౌకగా (ఒక్కో తల రూ. రెండు నుండి మూడు వందలు) కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి... ఇలా ఒకటేమిటి అన్ని నగరాలు, పట్టణాలకు పంపు తున్నారు. ఆ మాంసాన్ని నీళ్లతో కడిగి, తాజాగా రక్తం కనపడేలా రసాయనాలు కలిపి వినియోగ దారులను మోసగిస్తున్నారు. ఇలా వారాల తరబడి నిల్వఉంచిన మాంసాన్ని వండి వడ్డిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో మాంసం అమ్మే పెద్ద దుకాణాల కన్నా చిన్నదుకాణాలే అత్యధికం. వాటిలో ఆదివారాల్లో రెండు నుంచి మూడు మాత్రమే మేకలు కోస్తారు. కాని అక్కడ పదుల చొప్పున తలకాయలు,

వందకుపైగా కాళ్లు కనిపిస్తాయి. ఇవన్నీ ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నవే. ఇదలా ఉంటే, ఇందులో మరో కోణంకూడా ఉంది. కోళ్ల వ్యర్థాలను తెచ్చి చేపల చెరువుల్లో ఆహారంగా వాడుతున్నారు. పూర్తిగా నిషేధితమైన ఈ పద్ధతి రాష్ట్రంలో విస్తృతంగా అమలవుతున్నది. కోళ్ల వ్యర్థాల్లో హానికరమైన సూక్ష్మజీవులు, రసాయనాలు పుష్కలంగా ఉంటాయి. ఆ వ్యర్థాలు తిన్న చేపలు ఆహారానికి అనర్హంగా మారతాయి. అలాంటి చేపలు తింటే సాల్మొనెల్లా వంటి సూక్ష్మజీవులవల్ల వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి తీవ్ర ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయి.

పీపీ చావడి నుండి నగరమంతా సరఫరా

తిరుపతిలోని పీపీ చావడి మటన్ మార్కెట్ కుళ్లిన మాంసానికి చిరునామాగా మారింది. అంతేకాదు.. ఇది పూర్తిగా అనధికారికంగా నడుస్తున్నది. ఈ ఒక్క మార్కెట్ నుండే నగరమంతా మాంసం సరఫరా అవుతున్నదని తనిఖీల్లో తేలింది. నగరపాలక సంస్థ లెక్కల ప్రకారం తిరుపతిలో 237 మటన్, కోళ్ల మాంసం చిల్లర దుకాణాలు ఉన్నాయి. వారాంతంలో సుమారు నూట యాభై పొట్టేళ్లు, మేకపోతులను మాత్రమే అధికారికంగా వధిస్తున్నారు. కానీ దుకాణాల్లో 500 తలకాయలు, 2 వేలకు పైగా కాళ్లు విక్రయిస్తున్నారు. ఇవన్నీ చెన్నై, హైదరాబాదు నుంచే వస్తున్నాయని మాంసం వ్యాపారులే ఒప్పుకున్నారు. ఆ మార్కెట్ పరిసరాల్లో రక్తం, జంతు వ్యర్థాలు నేలపైన, గోడలపైన పేరుకు పోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నది. సరైన మురుగునీటివ్యవస్థ లేకుండా మార్కెట్ మొత్తం అపరిశుభ్రంగా మారింది. ఆ మార్కెట్ ప్రహరీగోడకు ఆనుకుని మున్సిపల్ పాఠశాల ఉంది. ఈ వాతావరణం పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులే అంగీకరిస్తున్నారు.

పెద్ద సంస్థలు కూడా అదే దారిలో

ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్న బహుళ జాతి సంస్థలు సైతం ప్రజారోగ్యంతో నిర్దాక్షిణ్యంగా వ్యాపారం చేస్తున్నాయి. తిరుపతిలోని రెండు ప్రసిద్ధ భోజనశాలలలో మున్సిపల్ అధికారులు తనిఖీలు జరిపారు. ఎయిర్ బైపాసు రోడ్డు, భవానీనగరాల్లో ఉన్న ఆ భోజనశాలల్లో కోళ్ల మాంసాన్ని సరైన అరలలో కాకుండా, నేలపైనే అపరిశుభ్ర వాతా వరణంలో నిల్వ ఉంచడంతో కంపు కొడుతున్నదని అధికారులు గుర్తించారు. దాదాపు 683 కిలోల చెడిపోయిన కోళ్ల మాంసాన్ని బెంగళూరుకు వెనక్కి పంపించారు.

ఆహార పదార్థాల ప్యాకింగ్‌పై లేబుళ్లు లేకపోవడం, గిడ్డంగి అపరిశుభ్రంగా ఉండడం వంటి లోపాలు కనిపించాయి. పీపీ మహల్ రోడ్డులోని మరో ప్రముఖ భోజనశాలలో 680 కిలోల కుళ్లిన కోళ్ల మాంసం గుర్తించారు. తక్కువ ధరకు ఆఫర్లు ఇవ్వడానికి బెంగళూరు నుండి భారీగా ఈ మాంసం తెప్పించారని తేలింది. తిమ్మనాయుడు పాలెంలో ఆవు మాంసపు కొవ్వును కరిగించి వంట నూనెగా వాడు తున్నట్లు గుర్తించారు. ఇది మత విశ్వాసాలను దెబ్బ తీయడమే కాదు.. ఆరోగ్యానికి కూడా హాని చేస్తుంది.



హారంతో కలవరం

ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్న బహుళ జాతి సంస్థలు సైతం ప్రజా రోగ్యంతో నిర్దాక్షిణ్యంగా వ్యాపారం చేస్తున్నాయి. తిరుపతిలోని రెండు ప్రసిద్ధ భోజనశాలలలో మున్సిపల్ అధికారులు తనిఖీలు జరిపారు. ఎయిర్ బైపాసు రోడ్డు, భవానీనగరాల్లో ఉన్న ఆ భోజనశాలల్లో కోళ్ల మాంసాన్ని సరైన అరలలో కాకుండా, నేలపైనే అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచడంతో కంపు కొడుతున్నదని అధికారులు గుర్తించారు.

చేపల మార్కెట్లో దారుణాలు

లీలామహల్ నర్కిలువద్ద ఉన్న చేపల మార్కెట్‌లోనూ అదే వాతావరణం వెలుగు చూసింది. ఇరవై రెండు దుకాణాలున్న ఆ మార్కెట్లో మున్సిపల్ సిబ్బంది జరిపిన తనిఖీల్లో రెండు దుకాణాల్లో కుళ్లిపోయిన రొయ్యలు, పురుగులు పట్టిన చేపలు బయటపడ్డాయి. చల్లదనపు పెట్టెలు పగిలిపోవడంతో ముక్కుపుటాలు అదిరే దుర్వాసనతో నూట యాభై కిలోల కుళ్లిన చేపలు బయటపడ్డాయి. నిల్వ ఉంచిన సముద్ర ఆహారపు ఉత్పత్తుల్లో శిలీంధ్రాల ఆనవాళ్లు కూడా గుర్తించారు. ఆ రెండు దుకాణాలను సీజు చేసి, వ్యాపార అనుమతులను రద్దు చేశారు. చేపల నాణ్యతను పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ, ఆహారభద్రతా ప్రమాణాలను పరిశీలించాల్సిన ఆహార భద్రతాధికారులు, పారిశుధ్య నిర్వహణకు బాధ్యత వహించే మున్సిపల్ అధికారులు ఏళ్లతరబడి తనిఖీలు జరపకుండా ఏంచేస్తున్నారని జనం ఆగ్రహంగా ప్రశ్నిస్తున్నారు.

ఆహార భద్రతా విభాగం వైఫల్యం

ఆహార భద్రతా విభాగం పూర్తి నిర్వీర్యమే ఈ సమస్యకు మూల కారణమని ఆరోపణలు ఉన్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, తిరుచానూరు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు కలిగిన తిరుపతి జిల్లాకు కేవలం ముగ్గురు సహాయ ఆహార భద్రతాధికారులే ఉన్నారు. వారిలో ఒకరు తిరుమలకు పరిమితమయ్యారు. మరొకరు దీర్ఘకాలిక సెలవు తీసుకున్నారు. ఇంకొకరు ప్రముఖుల పర్యటనలకు నిరంతరం వెళ్తుంటారు. అదనపు బాధ్యతలు అప్పగించిన నెల్లూరు జిల్లా అధికారి అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటారు. ఫిర్యాదు అందితే తప్ప తనిఖీలు లేకపోవడం ఈ దుస్థితికి మూల కారణం. పైగా ఆహార కల్తీపై కేసు నమోదు చేసే అధికారం కేవలం ఆహార భద్రతాధికారులకే ఉంటుంది. ఆ అధికారులు పనిచేయకపోవడంతో మున్సిపల్ అధికారులు జరిమానాలు విధించడం తప్ప నేర విరోధకచర్యలు చేపట్టలేకపోతున్నారు. ప్రారంభించలేకపోతున్నారు. ఇది నేరస్తులకు కలిసి వస్తున్నది.

ప్రయోగశాల ఏర్పాటులో జాప్యం

తిరుపతిలో రూ. 25 కోట్లతో అత్యాధునిక ఆహార పరీక్ష ప్రయోగశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రతి వారం ఒక్కో అధికారి కనీసం పది నమూనాలు సేకరించి వెంటనే పరీక్షించి, కల్తీ నిర్ధారణ అయిన తర్వాత కేసులు నమోదు చేయాలన్న లక్ష్యంతో ఈ ప్రయోగశాలను ప్రణాళిక వేశారు. శ్రీదేవి కాంప్లెక్సులో అద్దె భవనంలో ప్రారంభించాలని నిర్ణయించి ఏడాది పూర్తవుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం నమూనాలను హైదరాబాదుకు పంపాలి కనుక ఫలితాలు ఆలస్యమవుతున్నాయి. అందువల్ల అధికారులు నమూనాల సేకరణ పైనే శ్రద్ధ చూపట్లేదు. ప్రయోగశాల అందుబాటులో లేకపోవడం ఆహార కల్తీదారులకు కొండంత ఆసరాగా మారింది.

ఆరోగ్య ముప్పులు తీవ్రం

కుళ్లిన మాంసంలో, రసాయనాల్లో పరిమితికి మించిన క్యాన్సర్ కారకపదార్థాలు ఉంటాయి. హోటళ్లలో ఒకే నూనెను పదే పదే వాడటంతో హాని కలిగించే సమ్మేళనాల శాతం పెరిగి గుండె జబ్బులు వచ్చే ముప్పు పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. కుళ్లిన మాంసంలో సాల్మొనెల్లా వంటి సూక్ష్మజీవుల వల్ల వాంతులు, విరేచనాలు, ఆహారపు కాలుష్యం సంభవిస్తుందని హెచ్చరిస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు తిన్న చేపలను భుజిస్తే జీర్ణ సంబంధ వ్యాధులు ప్రబలుతాయని స్పష్టం చేస్తున్నారు.

ఈ ఘటనలపై జిల్లా కలెక్టరు వెంకటేశ్వర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహారభద్రతా అధికారులతో, మున్సివల్ వైద్యాధికారులతో సమీక్ష జరిపారు. బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఆధారాలతో నేరు నమోదుచేయాలని ఆదేశించారు. వీపీచావడి మార్కెట్‌లో అక్రమ మాంసం కార్యకలాపాలను నిలిపి వేయాలని పరిశీలిస్తున్నారు. అయితే ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తెచ్చి మార్కెట్ తెరిపించాలని ప్రయత్నిస్తున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఇది కేవలం ఒక జిల్లా సమస్య కాదు. వ్యవస్థీకృత మాఫియా ద్వారా ఆంధ్రప్రదేశ్ అంతటా జరుగుతున్న ఆహార కల్తీ దందా. ఆహార భద్రతా విభాగానికి తగిన సిబ్బందిని వెంటనే నియమించడం, తక్షణం ప్రయోగశాలను ఏర్పాటుచేయడం, నిరంతర తనిఖీలు చేపట్టడం, నేరస్తులకు కఠిన శిక్షలు విధించడమే ఇవే పరిష్కార మార్గాలు. ప్రజలుకూడా అప్రమత్తంగా ఉండాలి. చవకగా వచ్చే ఆహారంపై అనుమానం కలిగినప్పుడు వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి. పవిత్ర తిరుపతి నగరంతో పాటు ఆంధ్రప్రదేశ్ మొత్తంలో ప్రజలు తినే ఆహారం నిజంగా పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండాలంటే ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు నిజాయతీగా బాధ్యత వహించాలి.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

కత్తి పడితే రుద్రమదేవి.. కలం పడితే మొల్ల.. పోరాడితే ఝాన్సీ లక్ష్మీబాయి.. రంగం ఏదైనా, సవాలు ఎంతటిదైనా.. తాము అనుకుంటే సాధించగలమని నాటినుంచి నేటివరకు నిరూపిస్తూనే ఉన్నారు మన మహిళలు. చరిత్రను మలుపు తిప్పిన ధీర వనితల స్ఫూర్తితో.. నేటి తరం మహిళలు సైతం ఎనలేని విజయాలు సాధిస్తున్నారు. ఆధునిక సమాజంలో అమ్మగానూ.. దేశ సరిహద్దుల్లో తుపాకీతో శత్రువును ఆపే సైనికురాలిగాను.. స్త్రీ రూపాంతరం చెందింది. తాను అబల కాదని నిరూపిస్తూ... అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేస్తోంది.

ఒకప్పుడు నాలుగు గోడల మధ్యే బందీ అయిన జీవితాలు.. కానీ ఈరోజు అంతరిక్ష నౌకలో మువ్వన్నెల జెండాను ఎగరేస్తున్న చేతులు.. అసలు మహిళలు లేని సమాజాన్ని ఊహించగలమా? ఒకవైపు కట్టుబాట్లు, మరోవైపు హేళనలు.. వీటన్నింటినీ అధిగమించి చరిత్ర పుటల్లో తమ నంతకాన్ని బలంగా లిఖించారు ఎందరో నారీమణులు. సావిత్రీబాయి ఫూలే అక్షర జ్ఞానం మొదలుకొని.. నేటి కార్పొరేట్ ప్రపంచాన్ని శాసిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల వరకు.. సమాజ పునాదులనే మార్చేశారు.

మహిళల అభివృద్ధి లేనిదే ఏ దేశమూ, ఏ సమాజమూ ముందుకు సాగలేదు. ఒక బండి సజావుగా సాగాలంటే రెండు చక్రాలు సమానంగా ఉండాలి. దేశ జనాభాలో సగంగా ఉన్న మహిళలు ఇంట్లోనే ఉండిపోతే, దేశ ప్రగతి ప్రశ్నార్థకమౌతుంది. సగభాగం మానవ వనరులను వాడుకోనట్లే అవుతుంది. మహిళలు చదువుకుని, ఉద్యోగాలు లేదా వ్యాపారాలు చేసినప్పుడు కుటుంబ ఆదాయంతో పాటు స్థూల దేశీయోత్పత్తి కూడా ఊహించని స్థాయిలో పెరుగుతుంది. ఒక అమ్మాయికి చదువు చెబితే, ఒక తరానికి చదువు చెప్పినట్లు. ఒక స్త్రీకి విద్యనందిస్తే ఒక దేశానికే విద్యనందించినట్లవు తుంది. విద్యావంతురాలైన తల్లి తన పిల్లల చదువు, క్రమశిక్షణ, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. దీంతో భావితరాలు మరింత తెలివైనవిగా, బాధ్యతాయుతమైనవిగా తయారవుతాయి.

మహిళల ఆరోగ్యం, పోషకాహారంపై పెట్టుబడి పెట్టిన దేశాల్లో శిశు మరణాలు తగ్గి, ఆరోగ్యకరమైన మానవవనరులు పెంపొందుతాయి. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, తద్వారా దేశం ఆరోగ్యంగా ఉంటుంది. భారతీయ సంస్కృతిలో స్త్రీకి ఎప్పుడూ ఉన్నత స్థానం ఉంది. అయితే, ఆధునిక కాలంలో వారిని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయడం ఎంతయినా అవసరం. మహిళల అభివృద్ధి లేనిదే దేశ అభివృద్ధి సాధ్యం కాదు. ఒక మహిళ సంపాదిస్తే, ఆ కుటుంబ జీవన ప్రమాణాలు పెరుగుతాయి. మహిళలకు అవగాహన పెరిగితే, కుటుంబంలో ఆరోగ్యం, పరిశుభ్రత మెరుగవుతాయి. ఇది దేశంలో శిశు మరణాల రేటును తగ్గించి, ఆరోగ్యకరమైన మానవ వనరులను అందిస్తుంది.

నేటి మహిళ

నేడు మహిళలు వంటింటికే పరిమితం కాకుండా, ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవుల నుంచి దేశ అత్యున్నత పదవులైన రాష్ట్రపతి, ప్రధానమంత్రి వరకు మహిళలు సమర్థవంతంగా రాణిస్తున్నారు. ఒకప్పుడు పురుషులకే పరిమితం అనుకున్న సైన్యం, వైమానిక దళం, నౌకాదళంలో మహిళలు ఫైటర్ పైలట్లుగా, కమాండర్లుగా దేశ సరిహద్దులను కాపాడుతున్నారు. ఇస్రో చేపట్టిన చంద్రయాన్, మంగళయాన్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వెనుక ఎందరో మహిళా శాస్త్రవేత్తల మేధస్సు ఉంది. పి.వి. సింధు, మిథాలీ రాజ్, మీరాబాయి చాను వంటి వారు అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలు, స్టార్టప్‌ల ద్వారా పట్టణ మహిళలు ఆర్థిక విప్లవాన్ని సృష్టిస్తున్నారు.

ప్రభుత్వ సహకారం

నారీశక్తిని మరింత బలోపేతం చేయడం కోసం గడచిన పన్నెండేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. ఆడపిల్లల రక్షణ, విద్యను ప్రోత్సహించడానికి 'బేటీ బచావో – బేటీ పఢావో', మహిళా పారిశ్రామికవేత్తలకు సులభంగా రుణాలను అందించడానికి 'ముద్ర యోజన', గ్రామీణ మహిళల ఆరోగ్య రక్షణ, ఉచిత గ్యాస్ కనెక్షన్లు కోసం 'ఉజ్వల యోజన' వంటి పథకాలు అమలు చేస్తోంది. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు, చట్టసభల్లో రిజర్వేషన్లు అందుబాటులోకి తెచ్చేందుకు బిల్లు సిద్ధంగా ఉంది. మహిళల విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వాలంబన, రక్షణే ధ్యేయంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయి.

ప్రభుత్వ తోడ్పాటును మనం ప్రధానంగా నాలుగు విభాగాలుగా చూడవచ్చు. మహిళలు సొంతంగా వ్యాపారాలు చేయడానికి, ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వాలు రుణ సదుపాయాలు, సబ్సిడీలను అందిస్తున్నాయి. మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎటువంటి గ్యారెంటీ లేకుండా వ్యాపార రుణాలు అందిం చడం వీటిలో కీలకమైనది. ఈ పథకంలో ద్వారా మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లకు 10లక్షల నుండి కోటి రూపాయల వరకు రుణ సహాయం అందిస్తారు. గ్రామీణ, పట్టణ మహిళలను సంఘాలుగా ఏర్పరచి, తక్కువ వడ్డీకే రుణాలు లేదా వడ్డీ లేని రుణాలు అందిస్తూ, వారు సొంతంగా చిన్న తరహా పరిశ్రమలు లేదా వ్యాపారాలు చేసుకునేలా తోడ్పాటు నందిస్తున్నారు.

ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, వృద్ధులకు ఆసరా పెన్షన్ పథకం ద్వారా నెలవారీ ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆరోగ్య రక్షణ పథకం ద్వారా గర్భిణీలకు పౌష్టికాహారం, ఆడపిల్లల డ్రాపౌట్లను నివారించడానికి ప్రత్యేక మరుగుదొడ్లు, శానిటరీ పాడ్స్ వంటివి అందిస్తు న్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం ఈ

కుటుంబంలో ఎందరు సభ్యులున్నా, అందరినీ ఒక తాటిపైకి తెచ్చేది మహిళే. ఎంతటి కష్ట సమయాల్లోనైనా కుటుంబ సభ్యులకు మానసిక స్థైర్యాన్ని ఇవ్వడంలో వారు ముందుంటారు. పిల్లలకు కేవలం చదువు మాత్రమే కాదు, సమాజంలో ఎలా బతకాలి? ఇతరులను ఎలా గౌరవించాలి? అనే విలువలను, బాధ్యతాయుతమైన ప్రవర్తనను నేర్పే తొలి గురువు అమ్మే.

తలో స్త్రీ సంతకం

పథకం ముఖ్య ఉద్దేశం.

కుటుంబంలో మహిళ

కుటుంబంలో మహిళలకు లభించే మద్దతు అనేది ఒక ఇల్లు ఆనందంగా ఉండడానికే కాదు, వారు మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కూడా చాలా కీలకం. ఉదయం నుంచి రాత్రి వరకు ఇల్లూ, పిల్లల బాధ్యతలు చూసుకోవడం లేదా ఉద్యోగం చేస్తూ ఇంటిని మేనేజ్ చేయడం అంత సులువు కాదు. వారు చేసే చిన్న చిన్న పనులను గుర్తించి ఒక మంచి మాట మాట్లాడడం వారికి కొండంత బలాన్ని ఇస్తుంది. ప్రతి మహిళకూ సొంత ఆలోచనలు, ఇష్టాలు ఉంటాయి. వారి నిర్ణయాలకు గౌరవం ఇవ్వడం ముఖ్యం. కుటుంబంలో అందరూ కలిసి ఇంటి పనులను పంచుకుంటే వారిపై శారీరక ఒత్తిడి తగ్గుతుంది. పిల్లల చదువు, వారి అవసరాలను చూసుకోవడంలో తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు భాగస్వామ్యంతో పిల్లల పెంపకంలో తల్లికి కొంత విశ్రాంతి దొరుకుతుంది. మహిళకు పోషకాహారం, శారీరక ఆరోగ్యం పట్ల కుటుంబం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వారికి 35 సంవత్సరాలు దాటిన తర్వాత కనీసం ఆరు నెలలకు ఒకసారైనా సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించడం బాధ్యతగా తీసుకోవాలి. పెళ్లి లేదా ప్రసవంవంటి ముఖ్యమైన మార్పులు వచ్చినప్పుడు వారి కెరీర్ ఆగిపోకుండా, అవసరమైన భరోసాను కుటుంబమే ఇవ్వాలి. కుటుంబంలో మహిళను కేవలం బాధ్యతలు మోసే వ్యక్తిగా కాకుండా, సమాన భాగస్వామిగా చూసినప్పుడే ఆ బంధాలు మరింత బలపడతాయి.

కుటుంబంలో ఎందరు సభ్యులున్నా, అందరినీ ఒక తాటిపైకి తెచ్చేది మహిళే. ఎంతటి కష్ట సమయాల్లోనైనా కుటుంబ సభ్యులకు మానసిక స్థైర్యాన్ని ఇవ్వడంలో వారు ముందుంటారు. పిల్లలకు కేవలం చదువు మాత్రమే కాదు, సమాజంలో ఎలా బతకాలి? ఇతరులను ఎలా గౌరవించాలి? అనే విలువలను, బాధ్యతాయుతమైన ప్రవర్తనను నేర్పే తొలి గురువు అమ్మే. ఆర్థిక వనరులను లోపాలు లేకుండా నిర్వహించడం మహిళలకు సహజంగా అబ్బిన కళ. సంపాదన తక్కువైనా, ఎక్కువైనా దానికి తగ్గట్టుగా ఇల్లు గడపడం, భవిష్యత్తు కోసం పొదుపు చేయడం ఆమెకే సాధ్యం. తాను ఎదుగుతూ, తన కుటుంబానికి ఆర్థికంగా సమాంతరంగా అండగా నిలబడటం నేటి మహిళ ప్రత్యేకత.

మార్పు అవసరమే

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, సమానత్వంతో జీవిస్తున్న దేశాలను మనం గమనిస్తే... ప్రపంచంలో కొన్ని దేశాలు మిగతా వాటి కంటే చాలా ముందున్నాయి. గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ నివేదికల ప్రకారం, మహిళల హక్కులు, భద్రత, విద్య, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యంలో కొన్ని అగ్రస్థానంలో ఉన్నాయి.

మహిళా సాధికారతలో అగ్రస్థానంలో ఉన్న దేశం ఐస్లాండ్. ఇది ప్రపంచంలోనే మహిళలకు అత్యంత సురక్షితమైన, సమానత్వం కల దేశం. ఇక్కడ పురుషులతో సమానంగా మహిళలకు వేతనాలు ఇవ్వడం చట్టంలో ఒక భాగం. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం చాలా ఎక్కువ.

కార్పొరేట్ కంపెనీల బోర్డులలో కనీసం నలభై శాతం మహిళలు ఉండాలనే చట్టం తెచ్చిన దేశం నార్వే. ఇక్కడ ప్రసవ సమయాల్లో తల్లిదండ్రులిద్దరికీ ఇచ్చే సెలవులు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉంటాయి.

మహిళా విద్య, ఆరోగ్య రంగాల్లో ఫిన్లాండ్ అగ్రస్థానంలో ఉంది. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన మహిళా ప్రధానమంత్రి సనా మారిన్ నేతృత్వంలో ఇక్కడ ప్రభుత్వం పనిచేసిన రికార్డు ఉంది. మహిళలకు ఓటు హక్కు కల్పించిన మొదటి దేశం న్యూజిలాండ్. 1893లోనే మహిళలకు అంతటి ప్రాధాన్యతను కల్పించింది. జసిండా ఆర్డెన్ వంటి మహిళా నాయకురాళ్ల నాయకత్వంలో ఈ దేశం మహిళా హక్కుల్లో ఆదర్శంగా నిలిచింది. స్వీడన్ పార్లమెంట్‌లో దాదాపు సగంమంది మహిళలే. స్త్రీ, పురుష భేదం లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడంలో ఈ దేశం ముందుంది.

మన దేశంలో కూడా సమాన పనికి స్త్రీ, పురుషులకు సమానమైన జీతం అందించడం, చట్టసభల్లో, నిర్ణయాలు తీసుకునే పదవుల్లో మహిళలకు ఎక్కువ స్థానాలు కేటాయించడం, రాత్రి వేళల్లో కూడా మహిళలు ఎలాంటి భయం లేకుండా తిరగగలిగేలా పూర్తి రక్షణ కల్పించడం, ఉద్యోగం చేసే మహిళలకు ప్రసవ సెలవులు, పిల్లల సంరక్షణ కేంద్రాలు ప్రభుత్వమే కల్పించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని అమలు చేసేందుకు ప్రయత్నించాలి.

కాగా, ఇప్పటికే భారతదేశం ఈ దిశగా అడుగులు వేస్తోంది. మహిళలు రాజకీయాల్లోకి, ఉన్నత పదవుల్లోకి వచ్చినప్పుడు సమాజంలో అవినీతి తగ్గి, ప్రజా సమస్యలపై మరింత సున్నితత్వంతో కూడిన నిర్ణయాలు, చట్టాలు వస్తాయి.

నారీశక్తి అనేది కేవలం ఒక నినాదం కాదు... అది దేశ వికాసానికి ఇంధనం. స్వామి వివేకానంద అన్నట్లు ఒక పక్షి ఒకే రెక్కతో ఎగరలేదు. అలాగే మహిళల స్థితి మెరుగుపడకుండా దేశ, ప్రపంచ సంక్షేమం సాధ్యం కాదు.

ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా... వాటిపై మహిళల్లో పూర్తి అవగాహన ఉన్నప్పుడే, సమాజంలో పురుషుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే నిజమైన మహిళా సాధికారత, దేశాభివృద్ధి సాధ్యమవుతాయి.

జయశ్రీ ఆచంట
సీనియర్ జర్నలిస్ట్

తిక్కనామత్యునికి తన యుద్ధ తంత్రాన్ని వివరించింది రుద్రమ.

"అసలు ఈ రక్కస గండడే ఈ యుద్ధానికి మూలం. అతడు అతి చిన్నసైన్యం కలవాడు అనేది అందరికి తెలిసిందే. కాని అలాంటివాడు కాకతీయ సామంత రాజ్యంలోకి చొచ్చుకువచ్చాడంటే.. వీడి వెనుక ఏదో బలీయమైన శక్తి ఉందని నా అనుమానం తాతగారు. అది దేవగిరి సంఘణ దేవుడో, ఆయన అనుచర వణిజుడో, ఆయన మరో ప్రతినిధో కావచ్చని నా సందేహం. అతడు నా మేనమామగా మా కుటుంబంతో ఆప్యాయత నటిస్తూనే కాకతీయ వంశ నాశనానికి కుట్రలు చేస్తున్నాడు. అందుకు ఈ రక్కస గండడిని ప్రయోగించాడు. నేనా కుట్రను ఛేదించాలని నిర్ణయించుకున్నాను. అందుకు అనుజ్ఞ ఇవ్వండి మహామాత్యా.." చేతులు జోడించి అడిగింది రుద్రమ.

"తెలుగు సామ్రాజ్య లక్ష్య సాధనలో ఎవరు అడ్డు వచ్చినా సహించేది లేదు వీరనారీ! ప్రత్యక్ష యుద్ధాన్ని వదలి పరోక్ష యుద్ధానికి ఇటీవల కొందరు మహారాజులు ఆసక్తి చూపుతున్నారు. అందుకు వాణిజ్య శ్రేణులను అడ్డు పెట్టుకుంటున్నారు. ఈ కుట్రలను ఛేదించాల్సిందే. అందుకు నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి. జయహో.."

త్రిముఖ యుద్ధం భారీగా మొదలయ్యింది. సర్వసైన్యాధ్యక్షునిగా గంగయ సాహిణీ మొత్తం యుద్ధ నిర్వహణ చేపట్టగా రుద్రమ రెండవ యుద్ధ బృందంతో సిద్ధంగా ఉంది.

సందివిగ్రహిని రక్కస గండడి స్కంధావారానికి పంపి రుద్రమదేవి గోల్లెనకు వచ్చాడు గంగయ సాహిణీ. అంగరక్షకులతో మాట్లాడుతున్న రుద్రమ–గంగయ సాహిణీని చూసి వారిని బయటకు పంపించివేసింది.

"జయము జయము వీరనారీ.." అన్నాడు గంగయ సాహిణీ.

అతని ముఖం చూస్తే ఏదో సంశయిస్తున్నాడని రుద్రమ గుర్తించింది.

"జయము జయము కేయూర దేవా.." అన్నది.

నిర్విణ్ణుడయ్యాడు గంగయ సాహిణిగా ప్రసిద్ధుడైన కేయూరదేవుడు.

ఏమీ అనలేక, "అమ్మా.." అని మాత్రం అనగలిగాడు. తన అసలు పేరు కూడా మర్చిపోయేంతగా ఈ పదేళ్లలో తెలుగు రాజ్యాల్లో గంగయ సాహిణిగా ప్రసిద్ధుడయ్యాడతను.

"క్షమించండి మామా.."

అతనికి దగ్గరగా వచ్చింది.

"ఆ రోజు మీ గోల్లెనలో ఆమె.. మీ భార్య.. తండ్రిగారిపై పగబట్టిన ఆమె.. బాలకవ్వల కదూ.. ఆమె ఆ రోజు నా తండ్రిని స్వహస్తాలతో తీవ్రంగా కొట్టింది. అదంతా నేను గోల్లెన వెనుక నుండి చూశాను.. విన్నాను.." నివ్వెరపోతూ వెనకడుగు వేశాడు గంగయ. అతనిది ఊహించని సంగతి.

ఆరోజు గణపతిదేవునితో పాటు రుద్రమ కూడా వచ్చిందని కేయూరకు ఇప్పుడు గుర్తొచ్చింది. దిగ్భ్రమతో నోట మాట రాలేదు. అలా కళ్లప్పగించి చూస్తున్నాడామెను.

"ఆ కవ్వల తన పగను మర్చిపోయిందని మనమంతా అనుకునేలా ఇన్నేళ్ల యుద్ధం నిశ్శబ్దంగా కనిపిస్తూ, తన పని తాను చేసుకుపోతోంది. కాకతీయరాజ్య పతనం, గణపతిదేవుని దుర్మరణం.. ఆమె ఆశయాలు. ఇప్పుడు ఇలా ఈ యుద్ధం ద్వారా మళ్లా బయటకు వచ్చాయి. ఈ యుద్ధానికి రక్కస గండడు కేవలం ముఖం మాత్రమే. అసలు మీపై.. మనపై యుద్ధం చేస్తోంది ఆమె.. ఆ బాల కవ్వలాబాయి!!"

వాస్తవాన్ని, యుద్ధం వెనుకనున్న అసలు శత్రువులను వారి బలాబలాలను రుద్రమ కచ్చితంగా గుర్తించింది.

ముఖ్యంగా బాల కవ్వలను గుర్తించడం రుద్రమ ప్రతిభకు నిదర్శనం.

ఈ అంశం అప్పటికే గంగయ సాహిణికి తెలిసింది. రక్కసగండడి వెనుక ఉన్నది వణిజ ప్రముఖుడు నానప్పశెట్టి.

బాల కవ్వలాబాయికి, సింఘణ దేవునికి ఈ శెట్టి పరమవిధేయుడు. బాలకవ్వలాబాయి కేయూరను పక్కన పెట్టి ఎవరినో పెళ్లి చేసుకున్నట్లు గూఢచారులు అతనికి తెలియజేశారు కూడా. ఆ కొత్త మొగుడు ఈ నానప్పశెట్టి కావచ్చునని గంగయకు అందిన సమాచారం!

ఇప్పుడు రుద్రమదేవి పూర్తి అవగాహనతో మాట్లాడటం అతడిని చకితుడ్ని చేసింది.

రుద్రమ గణవతిదేవుడి అంగరక్షకులను పటిష్టపరచింది. రెండు అంచెల భద్రత ఏర్పరచింది. ఇవేవీ గణవతిదేవునికి తెలియవు. ఆయన, తిక్కనార్యునితో కలసి మూడు యుద్ధ బృందాలను సమన్వయం చేస్తూ యుద్ధ వార్తల సైనికులతో.. లేఖకులతో ఊపిరి సలపకుండా ఉన్నాడు.

"గంగయ సాహిణీ.. మహావీరా.. మీరు యుద్ధ రంగంలో ప్రచండంగా విజృంభించండి. నేను ఆ దుర్మార్గురాలి సంగతి తేలుస్తాను. మహాకవులన్నట్లు ఇది అంతిమయుద్ధం.. తెలుగు జాతికి, కాకతీయ వంశానికి కూడా.."

ఆమె చెప్పడం ఆపాక కూడా ఆ గోల్లెనలో ఆమె ప్రకటించిన ఉద్వేగం.. చాలాసేపు గంగయను ఊపిరి తీసుకోనివ్వలేదు. మాటలు రాక.. ఆమెకు నమస్కరించి మౌనంగా వెనుదిరిగాడు గంగయ

గణపతి దేవుడు

42

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

సాహిణి.

ఆయన గోల్లెన వీడగానే రుద్రమ అంగరక్షకులు మళ్లీ లోపలికి వచ్చారు.

* * *

బెలగావి పట్టణానికి దూరంగా యుద్ధ క్షేత్రం.

పూర్తిగా యుద్ధ దుస్తులు..కొడవ వీరుల యుద్ధ దుస్తులలో పూర్తిగా మగవీరుడిలా ఉంది రుద్రమ. మూతికి అడ్డంగా గుడ్డ చుట్టుకుంది. ఒంటరిగా గుర్రంపై వెళుతోంది. ఆమెకు తగినంత దూరంలో అంగరక్షకులు సాధారణ పౌరుల్లా వెంట వస్తున్నారు. ఆమెకు ఎవరి నుండైనా ప్రమాదం వస్తే లిప్తకాలంలో వారిని అడ్డంగా నరికివేయడానికి తగినంత దూరంలో కదులుతున్నారు వాళ్లు.. పాతికమంది.

ఆమె ఎవరికీ అనుమానం రాకుండా కేవలం క్రీగంట విపులంగా చుట్టూ పరికిస్తూ మెల్లగా గుర్రాన్ని నడుపుతోంది. అలా వెళ్లి వెళ్లి శత్రు స్కంధావారం వెనుకవైపు ప్రదేశానికి చేరుకొని ఆ ప్రాంతాన్ని పరికిస్తోంది.

విశాలమైన స్కంధావారమే కాని అందులో వెనక భాగంలో ఓ పాడుబడిన భవనం కనిపించింది. సాధారణంగా జనావాసాలు ఉన్నచోట తాత్కాలికంగా స్కంధావారం నిర్మిస్తారు. కాని ఈ స్కంధావారం చివర ఓ పాడుపడిన భవంతి ఉండటం ఆమెను ఆకర్షించింది. ఆ భవంతిని ఎందుకు స్కంధావారంలో భాగం చేశారు. ఎందుకెందుకు??

ఆమె వెనక్కు తిరిగి అంగరక్షకులైన లెంకలకు చూపులతో సందేశమిచ్చి గుర్రం దిగి మెల్లగా ఒక్కొక్క అడుగే వేసుకుంటూ భవంతి దగ్గరగా వెళ్లింది. లెంకలు తమ గుర్రాలు దిగి ఆమె గుర్రపు కళ్లేన్ని అందుకుని.. ఆమెకు అన్నివైపులా చుట్టూ పరివేష్టించి కదులుతున్నారు.

భవంతి దగ్గరగా వెళ్లింది రుద్రమ. దాని ద్వారాలు మూసి ఉండటం వల్ల కాపలి భటులు లేరు కాబోలు అనుకుంటూ మరింత దగ్గరగా వెళ్లింది.

లోపల ఎవరివో కదలికలు.. ఎవరో మనుష్యులున్నట్లు తెలుస్తోంది. రుద్రమ భ్రూనృడిపోయింది.

ఇదేమి చోద్యం?!.. ఇదే వీళ్ల యుద్ధ తంత్రం కాబోలు!!

దూరంగా అరుపులు, కేకలు వినవస్తుండటంతో చెవులు రిక్కించి జాగ్రత్తగా వింటూ ఓ కిటికీ దగ్గరకు వెళ్లి మెల్లగా దాని ద్వారాలు కదిపి చూసింది. కేవలం కొంచం మాత్రమే తలుపులు కదిలాయి. లోపల ఆముదపు కాగడా వెలుగులో దృశ్యం స్పష్టాస్పష్టంగా తెలుస్తోంది. మరాఠీ సాంప్రదాయ దుస్తులలో ఉన్న ఓ మహిళ అటూ ఇటూ తిరుగుతూ చెబుతోంది. వినపడటం లేదు కాని ఆమె కాస్త కనపడుతోంది. బహుశా ఎదురుగా కొందరు వ్యక్తులున్నారు. ఏదో చెబుతోంది. బహుశా ఏవో సూచనలు..

యుద్ధభూమిలో మహిళ? సాధారణంగా ఉండరు.. ఉన్న ఈమె ఎవరై ఉండవచ్చు??!

చురుకయ్యింది రుద్రమ. ఈమె.. ఆమె కావచ్చు??

ఏదైతే సందేహించిందో ఆ సందేహమే బలపడుతోంది.

లోపల ఉన్నది బాల కవ్వలాబాయి. లోపల సంభాషణలు వివరంగా తెలియడం లేదు. అవతల యుద్ధం జరుగుతుంటే ఇక్కడ మరేదో చర్చ ఏవిటి?? ఏదో కుట్ర జరుగుతోంది. రుద్రమలో ఉత్సుకత పెరిగిపోతోంది. తెలుసుకోవాలి.. ఎలా ఎలా..

తలెత్తి పైకి చూసింది. భవంతిపైన వెలుతురు కోసం తలుపులులేని కిటికీ ఉన్నట్లు కనిపించింది. దూరంనుండి పరికిస్తున్న అంగరక్షకులలో ఒకరిని దగ్గరకు రమ్మంటూ వ్రేలితో సంజ్ఞా చేసి పిలిచింది. అతడు వచ్చి గోడ వద్ద వంగి నిలబడగా రుద్రమ అతని వీపు పైకెక్కి లోపలికి తొంగిచూసింది.

మహిళ చేతులు కదుపుతూ చెబుతుండగా ఓ సైనిక బృందం వింటున్న దృశ్యం స్పష్టంగా కనబడుతోంది కానీ వినపడటం లేదు. కాసేపటికి ఆమెతో సహా ఆ బృందం కదిలి మరోవైపు వెళ్లింది.

రుద్రమ లోపలికి వంగి కాళ్లు కిందికి దింపి కిందున్న కిటికీ తలుపులు కాలివేళ్లతో మరి కాస్త తెరచి వేగంగా పైకి ఎగిరి బయటకు వచ్చేసి అంగరక్షకులు దగ్గరకు రాగానే కిందికి ఉరికింది. వాళ్లు ఆమె కిందపడకుండా పట్టుకున్నారు. తర్వాత ఆ కిటికీ మరింత తెరచి ఒకరిని లోపలికి వెళ్లమంది. అతని వెనక రుద్రమ కూడా లోపలికి వెళ్లింది.మళ్లీ ఆమె, ఆ బృందం వస్తున్న అలికిడి వినపడి ఇద్దరూ చటుక్కున మరో గదిలోకి పరుగుపెట్టి మూలగా దాక్కున్నారు.

ఇప్పుడు రుద్రమ, ఆమె అంగరక్షకుడైన లెంక ఆ భవంతిలో చాటుగా దాగి వాళ్ల మాటలు, ప్రణాళికలు వినసాగారు. ఆమె తన వ్యూహం ఏదో మెల్లగా వివరంగా వాళ్లకు చెబుతోందని తెలుస్తోంది కాని అవతల యుద్ధారావాలు.. గుర్రాల సకిలింపులు, మహామత్తగజాల ఘీంకారాలు, కత్తుల కణకణల మధ్య పూర్తిగా తెలియడం లేదు. కాని ఆమె ఏదో చాలా పెద్ద వ్యూహం రచించి అమలు చేయ బోతోందని రుద్రమ గుర్తించింది.

ఓరగా తలుపుల చాటుగా ఆమెను పరీక్షగా చూసింది. సందేహం లేదు ఆమె.. ఆనాడు ఆ గోల్లెనలో తన తండ్రిని ఏదేదో దూషిస్తూ.. చురుకైన చేతులతో ఆయన ముఖంపై కొట్టి కొట్టి ఏడ్చిన మహిళ.. బాలకవ్వల!!

తను చూసినప్పటి కంటే కొంచెం ముదురుగా కనిపిస్తోంది కాని మరింత చురుగ్గా మరింత వేగంగా కదలుతోంది. బాగా పదును పెట్టిన చురకత్తిలా తోచింది రుద్రమకు. అతి పెద్ద అంతిమ యుద్ధానికి పూర్తిగా సిద్ధమైనట్లు కనిపిస్తోందామే.

శత్రువు బలమైనదే అనుకున్నది రుద్రమ.

అప్పుడు చూసింది అనలు ఆ భవంతి ఏవిటోనన్నట్లు. అదొక కోష్టాగారంలా కనిపించింది. నిజానికి అదొక పాడుబడిన భవంతి కాని దానినొక యుద్ధ కోష్టాగారంలా ఉపయోగిస్తున్నారు. అందుకే

మత్తి భానుమూర్తి

"అమ్మో.. ఆమె ఆడది కాదు. ఆడ పిశాచి.. ఆడ దెయ్యం.. ఎంత పొగరు. మహా మండలేశ్వరులనే చెంపలు వాయించి కింద పడేసి ఈడ్చుకు పోయింది. అడ్డొచ్చిన నన్ను కొట్టి పడేశారు ఆమెతో వచ్చిన ఆమె అంగరక్షకులు. అవతల మూడు యుద్ధాలలో మనమే ముందంజలో ఉన్నామని వార్తలు వస్తున్నాయి. సాధారణ ప్రజలు.. తెలుగు గ్రామీణులు.. స్వచ్ఛందంగా వచ్చి మన సైన్యానికి సహకరిస్తున్నారట. అది తెలిసి తండ్రిగారు, నేనూ సంతోషిస్తుంటే ఈ నీచురాలు వచ్చిపడింది. ఎప్పుడో ఎవ్వరో ఆమె అక్కను చంపారట. అందుకని మహానేత అని కూడా చూడకుండా మహామండ లేశ్వరునిపై విరుచుకుపడుతుందా.. హమ్మో.."

ఆమె దీనిని కూడా స్కంధావారంలో కలిపిందని రుద్రమ గుర్తించింది.

మళ్లీ సందేహం వచ్చి ఆ మందిరాన్ని వివరంగా చూసింది. లోపలి గదులన్నీ ఆయుధాలతో నిండిపోయి ఉన్నాయి. కాని ఆ బృందమున్న మందిరం మాత్రం ఏదో దుస్తుల మందిరంలా..

రుద్రమ బుర్రలో ఏదో తళుక్కున మెరిసింది.

శరీరమంతా వణికింది. ఆమె దుష్టపన్నాగం అర్థం అయ్యేసరికి కళ్లు తిరిగి పడిపోయేలా తూలిపోయింది.

లెంక వేగంగా వచ్చి ఆమెను పట్టుకున్నాడు.

రుద్రమకు ఆనాడు తమ అంతఃపురంలో తండ్రి తల్లికి మధ్య జరిగిన సంభాషణ, ఆ తర్వాత తల్లి తనకు చెప్పిన అంశాలు గుర్తుకొచ్చాయి.

ఆనాడు గణపతిదేవుడు, పెద్దకవ్వల దేవగిరి కోటలో దాగున్నది ఓ దుస్తుల కోష్టాగారంలో. అక్కడే కవ్వలను ఎవరో చంపేశారు. కాబట్టి గణపతిదేవుని ఇక్కడ.. ఈ యుద్ధంలో ఓడించి బంధించి, కోష్టాగారంలో ఆనాడు ఆమె అక్కను చంపినట్లే గణపతిదేవుని మట్టుపెట్టాలన్నది ఆమె వ్యూహం. అందుకే ఈ శిథిల భవంతిని కూడా దుస్తుల కోష్టాగారంలా మార్పించింది. అక్కడ నిర్వహించ వలసిన తతంగం ఏదో తన ముఖ్య అనుచరులకు వివరిస్తోంది.

పూర్తిగా అర్థమై ఒళ్లు జలదరించింది రుద్రమకు.

కర్తవ్యం గుర్తొచ్చింది. వేగంగా కదిలింది. చిరుతలా బయటకు పరిగెత్తింది. లెంకలను హెచ్చరించింది. వాయువేగ మనోవేగాలతో కాకతీయ స్కంధావారానికి వచ్చి పడింది.

కాని అప్పటికే జరగరాని ఘోరం జరిగి పోయింది.

గణపతిదేవుడు లేడు. ఆయన అంగరక్షకులు కొందరు చచ్చిపడి ఉన్నారు. ఆయనను బంధించి తీసుకుపోయారు. ఒళ్లంతా దెబ్బలతో ఓ చోట పడి ఉన్నాడు తిక్కనామాత్యుడు.

ఆయనకు ప్రథమచికిత్స చేసి కూర్చోబెట్టారు లెంకలు.

"అమ్మో.. ఆమె ఆడది కాదు. ఆడ పిశాచి.. ఆడ దెయ్యం.. ఎంత పొగరు. మహా మండలేశ్వరులనే చెంపలు వాయించి కింద పడేసి ఈడ్చుకు పోయింది. అడ్డొచ్చిన నన్ను కొట్టి పడేశారు ఆమెతో వచ్చిన ఆమె అంగరక్షకులు. అవతల మూడు యుద్ధాలలో మనమే ముందంజలో ఉన్నామని వార్తలు వస్తున్నాయి. సాధారణ ప్రజలు.. తెలుగు గ్రామీణులు.. స్వచ్ఛందంగా వచ్చి మన సైన్యానికి సహకరిస్తున్నారట. అది తెలిసి తండ్రిగారు, నేనూ సంతోషిస్తుంటే ఈ నీచురాలు వచ్చిపడింది. ఎప్పుడో ఎవ్వరో ఆమె అక్కను చంపారట. అందుకని మహానేత అని కూడా చూడకుండా మహామండ లేశ్వరునిపై విరుచుకుపడుతుందా.. హమ్మో.."

జరిగింది అర్థమైంది రుద్రమకు.

మొదటి దశలో విజయం సాధించింది బాలకవ్వల.

రుద్రమ తప్పకుండా ఆమెను వెదుక్కుంటూ వస్తుందని ఊహించి, ఆమె కదలికలన్నీ తెలుసు కుంటూనే ఉంది. రుద్రమ ఆ భవంతి వద్దకు వచ్చాక లోపలికి వెళ్లడాన్ని గమనిస్తూనే భవంతి లోపలికి మరింతగా రానిచ్చి రుద్రమ ఇక్కడ కొన్నిగంటలు ఉండేలా చేసి అక్కడ గోల్లెనపై దాడిచేసి అంగరక్షకు లను చంపి తండ్రిగారిని పట్టి బంధించి తీసుకు పోయింది.

గుండె పట్టేసినట్లయ్యింది రుద్రమకు.

అద్భుతంగా ప్రణాళిక రచించి మరింత పకడ్బందీ అమలు చేసి విజయవంతంగా తన లక్ష్యమైన కాకతీయ మహామండలేశ్వరుని తన గుప్పిట్లో బంధించింది ఆ నీచురాలు కవ్వల.

తక్షణ కర్తవ్యం??

సైన్యమంతా యుద్ధభూమిలో ఉంది. ఇప్పుడు గణపతిదేవుని అదృశ్యం చెబితే అంతా రసాభాస అవుతుంది.

వీరులంతా గందరగోళమైపోతారు. యుద్ధం గాడి తప్పుతుంది.

తానిప్పుడు ఒంటరి!

ఓ దళాన్ని గాని, ఓ పటాలాన్ని గాని అడిగితే గణపతిదేవుని అదృశ్యం చెప్పాల్సి ఉంటుంది. ఎవ్వరికి చెప్పలేని పరిస్థితి. అదేదో తనొక్కతే తేల్చుకోవాలి. అంగరక్షకుల వంక చూసింది. వాళ్లకు అంతా అర్థమయ్యింది.

ఆ పాతికమంది లెంకలకు నాయకుడైన పశు పతి లెంక అన్నాడు.

"యువరాణీ. ఇది మన శక్తియుక్తులకు పరీక్ష. ఇక్కడ ఇప్పుడు యుద్ధం గందరగోళం అవుతుంది. మనం వెంటనే వెళ్లకపోతే మహామండలేశ్వరులను మనం దక్కించుకోలేం. పదండి పదండి.."

బలిష్టులైన పాతికమంది లెంకలే తన మహాసైన్యంగా భావించి తిరిగి ఆ శత్రు భవంతి వైపు వేగంగా వెళ్లింది రుద్రమ. భవంతి వెనుక నుండి ప్రవేశించడాన్ని అడ్డుకున్న కాపలాభటులను సంహరించి లోపలికి ప్రవేశించారు. కానీ లోపల ఎవ్వరూ కనిపించలేదు. ముందు చూసిన మందిరం చిందర వందరగా ఉంది. మరింత వివరంగా చూస్తే అక్కడ గణపతిదేవుని అంగరక్షకులైన ముగ్గురు లెంకలు శవాలై పడి ఉన్నారు. అంటే ఆయనను బంధించి తీసుకువస్తున్నప్పుడు మరికొందరు ఆయన అంగరక్షకులు వెంబడించి ఉంటారు. ఇక్కడ ఆయన్ను బంధించగా విడిపించడానికై వాళ్లు పోరాడినట్లు.. ఆ పోరాటంలో చనిపోయినట్లు స్పష్టంగా అర్థమౌతోంది.

''మనవాళ్లు తీవ్రంగా ప్రతిఘటించినట్లు కనిపిస్తోంది యువరాణీ! మళ్లీ మనం దాడిచేస్తామని గుర్తించి ఆమె మరో చోటుకి మార్చినట్లుంది.." అన్నాడు పశుపతి లెంక.

క్షణక్షణానికి రుద్రమలో అలజడి పెరిగిపోతోంది.

కాకతీయ ప్రభువు గణపతిదేవుని బంధించి తీసుకుపోవడమంటే చిన్న విషయం కాదు. యుద్ధభూమిలో అయితే శత్రువుతో ఎదురునిలిచి పోరాడటం ఉంటుంది. కానీ ఇలా శత్రువును ఎత్తుకుపోవడం యుద్ధరీతి అసలే కాదు. ఆ కవ్వల తన వ్యక్తిగత పగతో ఇంత దారుణానికి ఒడికట్టింది.

ఓ మహాసామ్రాజ్యానికి పాలకుడు, నలభై ఏళ్లుగా ఓటమి ఎరుగని మహా యోధుడు..ముఖ్యంగా పాలనను ప్రజాపక్షం చేసి రాజ్యమంతటా.. అన్ని సామంత రాజ్యాల ప్రజలను కన్నబిడ్డల్లా సమస్త సౌకర్యాలతో కాపాడుతున్న మహామనిషిని తన పిచ్చి పగతో అపహరించి..

ఆలోచించినకొద్దీ రుద్రమలో క్రోధం పెరిగి పోతోంది.

ఏమి చెయ్యాలి?!

అంతా శూన్యం. దారి తెన్నూ తెలియడం లేదు.

ఆమెకు ఏడుపు రావడం లేదు. కన్నులనుండి నిప్పుల జ్వాల ఎగిసిపడుతోంది. మహావీరులయిన

లెంకలు చేతులు నలుపుకుంటూ ఒరల నుండి కత్తులు తీస్తూ ఏమీ చేయలేక మళ్లీ లోపల పెడుతూ ఉద్రేకంతో ఊగిపోతున్నారు.

ఏదైనా ఓ కోష్టాగారం వద్ద మాత్రమే తన తండ్రిని హింసించి చంపాలని కవ్వల ఆశయమని రుద్రమ భావన.

ఆమె సింఘణదేవుని ప్రతినిధిగా వణిజులను తన నియంత్రణలో ఉంచుకుని.. వాళ్ల ద్వారా చిన్న ప్రాంతాల రాజులను ఆడిస్తూ తన లక్ష్యాలను సాధిస్తోందని గుర్తించింది. అందుకే ఇప్పుడు కూడా యుద్ధ స్కంధావారంలో ఓ కోష్టాగారాన్ని కలుపుకుని ఏర్పాటు చేయించింది.

ఇక్కడ ఆమె ప్రణాళిక అమలు కష్టమైంది కనుక మరో చోటికి మకాం మార్చేసింది.

బహుశా బెలగావిలోని వణిజుని కోష్టాగారానికి తన తండ్రిని తరలించిందని రుద్రమకు తోచింది.

"ఇలా ఇక్కడ చేతులు పిసుక్కుంటూ నిలబడటం వల్ల ప్రయోజనం లేదు. ఏమైనా చెయ్యాలి. ఆ దుర్మార్గురాలికి యుద్ధం పట్ల ఆసక్తి ఉండదు. కేవలం నా తండ్రిని దారుణంగా హింసించి చంపడమే ఆమె లక్ష్యం. అందుకు పదేళ్లుగా చాలా దుర్భేద్యంగా సిద్ధమైంది. ఆమెను ఎదుర్కోవాలంటే మనమూ అందుకు తగ్గట్లు బలిష్టంగా బలీయంగా ఉండాలి. అందుకు నేను సిద్ధం. నా తండ్రిపై ఈగ వాలినా నా శక్తియుక్తులు, నా బ్రతుకు వృథా. కదలండి. బెలగావి ఊళ్లోకి వెళదాం పశుపతి.. కదలండి!"

తండ్రిని బందీని చేయడం రుద్రమ తట్టుకోలేకపోతోంది. లిప్త లిప్తకు ఉద్వేగంతో తల్లకిందులౌతోంది.

ఒక్క ఉదుటన గుర్రం అధిరోహించింది. ఆమెను మించి ఉద్రేకంతో నతమతమౌతున్నారు అంగరక్షకులైన లెంకలు. తాము రక్షణ వహించే ప్రధాన వ్యక్తి మరణించిన పక్షంలో ఈ లెంకలు ప్రాణత్యాగం చేస్తారు. శత్రువు తమ అధీనంలోని మహారాజును అవహరించడం భరించలేని అవమానం. అంతకంటే చావు నయం. గణపతి దేవుని లెంకలు ఆయన రక్షణలో కొందరు చనిపోయారని వీళ్లు గుర్తించారు. ఆయనను రక్షించుకోవాలి. అదే సమయంలో తమ రక్షణలోని యువరాణిని కూడా కాపాడుకోవాలి. తండ్రి కోసం ఆమె ఏ పోరాటానికయినా తెగిస్తోంది. అందుకు తగ్గ అప్రమత్తతతో ఉన్నారు వాళ్లు.

ఆమె ఎంత వేగంగా పోతుంటే అంతకంటే వేగంగా ఆమెకు ముందు.. వెనుకగా.. ఆ పాతికమంది..

రుద్రమ బృందం పోతూండగా ఓ గ్రామం వద్ద కాబోలు చాలామంది జనం గుమికూడి ఉన్నారు. వాళ్లు రుద్రమ బృందాన్ని ఆపలేదు కాని జనం వల్ల రుద్రమకు ముందున్న లెంకలు నెమ్మదించారు.

ఆ జనంలో ముందున్న వారిని అడిగాడు పశుపతిలెంక.

"ఏమైంది.. ఎందుకు మీరంతా బయట గుమికూడారు?"

అతడు తెలుగులో అడగడంతో వాళ్లంతా ఉత్సాహంగా అతని గుర్రం వద్దకు పరుగున వచ్చారు.

"మేమంతా తెలుగువాళ్లమే." అన్నారు వాళ్లు పరిచయం చేసుకుంటున్నట్లు.

"తెలుగు రాజ్యం కోసం యుద్ధాలు జరుగుతున్నాయి కదా. అదంతా మా కోసమే కదా.. అదే ఆనందం.." అన్నారు మరికొందరు.

ఒకరిద్దరు ఆ గుర్రం మీద ఉన్నది యుద్ధ దుస్తుల్లో ఉన్న మహిళ అని గుర్తించారు.

"అమ్మా.. తమరు ఎవరు? గణపతిదేవుని కుమార్తె యుద్ధం చేస్తుందని విన్నాం.. తమరు??"

"అదిసరే గాని.. ఇటుగా ఎవరైనా మహారాజు గారిని బంధించి తీసుకుపోవడం మీరు చూశారా??" అంది ఆమె. రెండు లిప్తల కాలం అయోమయంతో వెర్రి చూపులు చూశారు. ఆనక హఠాత్తుగా అన్నారు.

"మన తెలుగు మహారాజు గారిని ఎవరో ఎత్తుకుపోతున్నారా! ఎవరు వాళ్లు? మేమంతా వాళ్లను చంపేస్తాం." అంటూ ఒకరిద్దరు రెచ్చిపోయి గొంతు పెంచి అందరికి వినిపించేలా అన్నారు.

"ఒరే..మన తెలుగు మహారాజుగారిని ఎవరో పల్లకిలో ఎత్తుకుపోతున్నారంట. మన మహారాజు గారికి రక్షించుకోవాలి మనం. లగెత్తండోహో.." అంటూ గోలగోలగా అరుస్తూ రుద్రమ బృందానికి ముందు వెనగ్గా ప్రవాహమై పరుగులు పెట్టసాగారు.

"పదండి పదండి.."

గుర్రాల ముందు వెనకా జనం పరుగులు పెడుతున్నారు. చెప్పినా వినే పరిస్థితి లేదు.

జన ప్రవాహానికి మధ్యగా రుద్రమ, లెంకలు కదిలారు. గుర్రాలు పోతున్నాయి. గుర్రాలకు ముందూ వెనగ్గా పరుగులు పెడుతూ జనం. తెలుగు జనం.. ఒక చిన్న ఊరు దాటాక మరో ఊరు అలా అలా....జనం పెరిగిపోతున్నారు. పోయి పోయి నానప్పశెట్టి కోష్టాగారం వద్ద ఆగారు. పెద్ద కోలాహలం.

తన తండ్రి ప్రాణాపాయస్థితిలో ఉన్న సంగతి ఆమెను అతలాకుతలం చేస్తోంది. అదే సమయంలో తెలుగుప్రజలు ఏకమై దేనికైనా సిద్ధం అన్నట్లు తమను వెన్నంటి రావడం బావుంది కాని ఈ జనప్రవాహం తనకు అనుకూలమో, ప్రతికూలమో తెలియడం లేదు.

"మన మహారాజును ఇక్కడే బంధించారా మహారాణీ?" అన్నారెవరో జనాంతికంగా.

ఏమీ చెప్పకుండానే గుర్రం దిగి పరుగున వెళ్లి కోష్టాగారం తలుపు వద్ద ఆగింది. లెంకలు వేగంగా ఆమెను సమీపించారు. మెల్లగా తలుపులు తడుతూ.. కిటికీలగుండా లోపలికి చూడడానికి యత్నిస్తున్నారు. జనం రాను రానూ నిగ్రహం తప్పిపోతున్నారు. ఉద్రేకం తప్ప ఏవి జరుగుతోందో వాళ్లకు అర్థం కావడం లేదు.

"తలుపులు బద్దలు కొట్టండ్రా.." అరిచారెవరో.

ఈ హడావిడికి ఆ పిచ్చి బాలకవ్వల తన తండ్రికి ఏమి కీడు చేస్తుందోనని రుద్రమ చిరాకుపడుతోంది.

"ఆగండి..ఆగండి.." పిచ్చెక్కినట్లు అరిచింది రుద్రమ. కానీ అప్పటికే పరిస్థితి కట్టు తప్పింది.

జనం కోష్టాగారం పైబడి కర్రలతో కత్తులతో బరిసెలు పుచ్చుకుని తలుపులు, కిటికీలు బద్దలు కొట్టసాగారు.

నిమిషాల వ్యవధిలో కోష్టాగారం తలుపులన్నీ విరిగిపోయాయి. గోడలు పడిపోయాయి. జనం లోపలికి పరుగులు పెట్టారు. రుద్రమ, లెంకలు కూడా లోపలికి పోయి అన్నివైపులా వెదకసాగారు.

వ్యర్థం!! ఎవ్వరూ లేరు. **(సశేషం)**

జీ7 సదస్సుతో భారత్‌కు వ్యూ

ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లెస్-బైన్స్‌లో జూన్ 17న ముగిసిన 2026, జీ7 శిఖరాగ్ర సమావేశంలో అంతర్జాతీయ భద్రత, ఆర్థిక భాగస్వామ్యాలు, ప్రపంచ ఆరోగ్యంపై ప్రధాన ఒప్పందాలు కుదిరాయి. ఉక్రెయిన్‌కు మద్దతును బలోపేతం చేయడం, కీలకమైన సరఫరా గొలుసులను బలోపేతం చేసే కార్యక్రమాలు, కృత్రిమ మేధ (ఏఐ)ను పరిష్కరించే వ్యూహాలు, వివిధ దేశాలలో ఆరోగ్య సంక్షోభాలను అధిగమించేందుకు నిధుల కేటాయింపు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వైమానిక రక్షణ వ్యవస్థలు, ఇంటర్ సెప్టర్‌ల వంటి సైనిక మద్దతును పెంచడానికి, రష్యా చమురు, గ్యాస్‌పై కఠినమైన ఆంక్షలు విధించడానికి అంగీకరించడం ద్వారా ఉక్రెయిన్ సార్వభౌమాధికారం పట్ల జీ7 నాయకులు నిబద్ధతను పునరుద్ఘాటించారు. ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఒత్తిడిని తగ్గించడానికి హార్ముజ్ జలసంధిని తక్షణమే తిరిగి తెరవడానికి నాయకులు మద్దతు తెలిపారు. హిజ్బుల్లా నిరాయుధీకరణను నిర్ధారించడానికి, ప్రాదేశిక సమగ్రతను కాపాడడానికి లెబనాన్‌లో తక్షణ కాల్పుల విరమణకు కూడా పిలుపునిచ్చారు. అసమ తుల్యతలను తగ్గించడానికి, విదేశీ కీలక ఖనిజాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, సంరక్షణావాద వాణిజ్య యుద్ధాలను నివారించడానికి, ఆర్థిక విధానాలను సమన్వయం చేసుకోవడానికి సభ్యులు అంగీకరించారు. సమాచారాన్ని పంచుకోవడానికి, పిల్లల క్యాన్సర్ల నిరోధక శక్తిని మెరుగుపరచడానికి, సమన్వయ వ్యూహాలకు కట్టుబడి ఉంటామంటూ, ఇందుకోసం ఒక బిలియన్ డాలర్లకు పైగా కేటాయించడానికి అంగీకరించారు.

జీ7 (గ్రూప్ ఆఫ్ సెవెన్) ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల కూటమి.ఏటా ఒక సభ్య దేశం ఈ సదస్సుకు అధ్యక్షత వహిస్తుంది. ఈ ఏడాది 52వ జీ7 సదస్సుకు ఫ్రాన్స్ (ఎవియాన్-లెస్-బైన్స్) ఆతిథ్యం ఇచ్చింది. అభివృద్ధి చెందుతున్న దేశాల (గ్లోబల్ సౌత్) తరపున తన వాణిని వినిపించేందుకు ప్రత్యేక భారతదేశం ఆహ్వానం పొందింది.

"కొత్త భాగస్వామ్యాల ఏర్పాటు,అంతర్జాతీయ సంఘీభావ పునర్నిర్మాణం" అనేది ఈ సదస్సు ఇతివృత్తం. గ్లోబల్ ఎనర్జీ మార్కెట్లను సురక్షితం చేయడానికి 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను వెంటనే తిరిగి తెరవడానికి, ఇరాన్ చమురు ఎగుమతులపై ఆంక్షలను సడలించడానికి ఒక ముసాయిదా అంగీకారానికి వచ్చాయి. ఉక్రెయిన్ సార్వభౌమాధికారానికి జీ7 దేశాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. రష్యాపై కఠినమైన ఆంక్షలతో పాటు, ఉక్రెయిన్‌కు తక్షణమే వైమానిక రక్షణ వ్యవస్థలు(ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్) అందించడానికి అంగీకరించాయి. లెబనాన్‌లో తక్షణ కాల్పుల విరమణ జరగాలని, హిజ్బుల్లా ఆయుధాలను వీడాలని, లెబనాన్ ప్రాంతీయ సమగ్రతను రక్షించాలని నాయకులు పిలుపునిచ్చారు. పిల్లలు, యువకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఏఐ, చాట్‌బాట్‌ల వాడకంపై కఠినమైన నిబంధనలు, మార్గదర్శకాలను రూపొందించారు. చిన్నపిల్లల్లో వచ్చే కాన్సర్ చికిత్స సమాచారాన్ని పరస్పరం పంచుకోవడానికి అంగీకరించారు. కీలకమైన ఖనిజాల సరఫరా కోసం కేవలం ఒకే దేశంపై ఆధారపడకుండా, సరఫరా గొలుసును బలోపేతం చేయాలని నిర్ణయించారు.

జీ7 సదస్సులో భారత్ పాత్ర

భారతదేశం జీ7లో శాశ్వత సభ్యురాలు కాకపోయినప్పటికీ, వరుసగా ఈ సదస్సులకు ప్రత్యేక ఆహ్వానిత దేశంగా హాజరైంది. ప్రధాని నరేంద్ర మోదీ, భారతదేశపు యూపీఐ, డిజిటల్ గుర్తింపు వ్యవస్థల విజయాలను ప్రపంచ దేశాలకు వివరించారు. అంతరాలను తగ్గించడానికి డిజిటల్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొనే తీరును సూచించింది. చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, కీలకమైన ఖనిజాలు సెమీకండక్టర్ల తయారీలో భారతదేశాన్ని ఒక నమ్మకమైన భాగస్వామిగా జీ7 దేశాలు గుర్తించాయి. అంతర్జాతీయ సహాయాలు కేవలం 'దాత-గ్రహీత' ధోరణిలో కాకుండా, సమానత్వ భాగస్వామ్యం ప్రాతిపదికన జరగాలని భారత్ ప్రతిపాదించడాన్ని జీ7 దేశాలు అంగీకరించాయి. భారతదేశానికి చెందిన యూపీఐ, ఆధార్ వంటి డిజిటల్ టెక్నాలజీ నమూనాలను ప్రపంచ దేశాలకు ప్రత్యామ్నాయ మార్గాలుగా భారత్ ఈ వేదికపై ప్రదర్శించింది. ఏఐ నియంత్రణ, సాంకేతిక ప్రమాణాల రూపకల్పనలో భారత్ ప్రమేయం లేకుండా ప్రపంచ దేశాలు ముందుకెళ్ల లేవనే విషయాన్ని ఈ సదస్సు స్పష్టం చేసింది.

దేశానికి వ్యూహాత్మక ప్రయోజనాలు

జీ7 సదస్సు ద్వారా భారతదేశానికి వ్యూహాత్మక, ఆర్థిక, సాంకేతిక ప్రయోజనాలు పెద్ద ఎత్తున చేకూరాయి. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండియా-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జులై 15, 2026 నుండి అమలులోకి రానున్నట్లు బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్‌తో జరిపిన చర్చల్లో అధికారికంగా ప్రకటించారు. దీనివల్ల భారతీయ ఎగుమతులకు బ్రిటన్ మార్కెట్లో భారీగా అవకాశాలు లభిస్తాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ జరిపిన చర్చలలో 'ఇండియా-యూఎస్ కాంపాక్ట్' పురోగతిని సమీక్షించారు. రక్షణ రంగం, వ్యూహాత్మక సాంకేతికతలు, ఇంధన రంగాలలో సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్‌తో రక్షణ పారిశ్రామిక సహకార రోడ్‌మ్యాప్‌తోపాటు వీసా మినహాయింపులపై పురోగతి సాధించగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీతో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై కీలక చర్చలు జరిగాయి. ప్రపంచ దేశాలు చైనాపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించడానికి, సప్లై చైన్ నెట్‌వర్క్‌లను వికేంద్రీకరించడానికి సదస్సు తీసుకొన్న నిర్ణయం భారత్‌కు వరంగా మారింది. సెమీకండక్టర్లు, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారడానికి భారతదేశ ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాలకు విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశం పెరిగింది. చైనాతో సంబంధం లేకుండా లిథియం, గ్రాఫైట్, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల సరఫరాను పెంచేందుకు జీ7 చేసిన తీర్మానానికి భారత్ మద్దతు తెలిపింది. దీనివల్ల జమ్మూ-కశ్మీర్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బయటపడిన లిథియం నిక్షేపాలకు వాణిజ్యవరంగా అంతర్జాతీయ డిమాండ్‌తో పాటు సాంకేతిక సహకారం లభిస్తుంది.

హాత్మక ప్రయోజనాలు!

ఇది భారతదేశ ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి ఎంతో కీలకం.

16 నెలల తర్వాత భేటీ - ఒప్పందాలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 16 నెలల తర్వాత ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక సెషన్‌లో 'కొత్త భాగస్వామ్యాల ఏర్పాటు, అంతర్జాతీయ సంఘీ భావం' అనే అంశంపై చర్చ జరిగిన జరిగిన చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అధునాతన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, ఉమ్మడి సైనిక విన్యాసాలు, హిందూ-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవడంపై చర్చించారు. వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడం, పరస్పర పెట్టుబడులను పెంచడం, వీసా ప్రక్రియలను మరింత సులభతరం చేయడంపై దృష్టి పెట్టారు. భారత్‌లో సెమీకండక్టర్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు అమెరికా సాంకేతిక మద్దతును అందించడంపై ఒప్పందం కుదిరింది. భారత్‌పై ఎవరైనా దాడి చేస్తే అమెరికా అండగా ఉంటుందని అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేయడం గమనార్హం. ఈ వ్యాఖ్యను సాధారణ హామీగా కాకుండా, అంతర్జాతీయ దౌత్యం, భౌగోళిక రాజకీయాల కోణంలో విశ్లేషించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ దౌత్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ట్రంప్ వ్యాఖ్యలు నేరుగా చైనాను ఉద్దేశించినవే. లద్దాఖ్ సరిహద్దుల్లో (ఎల్ఏసీ) భారత్-చైనాల మధ్య ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో, భారత్‌కు అమెరికా పూర్తి సైనిక, వ్యూహాత్మక మద్దతు ఇస్తుందని చెప్పడం ద్వారా చైనా దూకుడుకు బ్రేక్ వేయడం ట్రంప్ వ్యూహం. అంతేకాని ఈ ప్రకటన కేవలం భారత్‌పై ప్రేమతో చేసినది కాదు. చైనా అగ్రరాజ్యంగా ఎదగకుండా అడ్డుకోవడమే అమెరికా ప్రధాన లక్ష్యం. అందుకు దానికి భారత్ కంటే బలమైన భాగస్వామి మరొకరు లేరు. అందువల్ల భారత్ రక్షణ బాధ్యతను తమదిగా ప్రకటించుకోవడం ద్వారా ఈ ప్రాంతంలో అమెరికా తన పట్టును నిలుపుకోవాలని చూస్తోంది. 'మేము మీకు అండగా ఉంటాం' అనడం ద్వారా, భారత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందని ట్రంప్ ప్రపంచానికి చాటిచెప్పారు.

ప్రస్తుతం లిథియం, కోబాల్ట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి కీలక ఖనిజాల సరఫరాలో చైనాదే ఏకఛత్రాధి పత్యం. దీనిని తగ్గించడానికి జీ7 దేశాలతో కలిసి భారత్ ఈ ఒప్పందంలో భాగస్వామి అయింది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) బ్యాటరీలు, క్లీన్ ఎనర్జీ పరికరాల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు నిరంతరాయంగా లభించేలా ఇరు దేశాలు ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేశాయి.ఆఫ్రికా, ఆస్ట్రేలియా, లాటిన్ అమెరికా దేశాలలో ఉన్న ఖనిజ వనరులను వెలికితీయడంలో మరియు వాటిని శుద్ధి చేయడంలో అమెరికా, భారత్ కలిసి పెట్టుబడులు పెట్టనున్నాయి.

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో హార్ముజ్ జలసంధిలో గల్ఫ్ ప్రాంతంలో భారత నావికుల భద్రత అత్యంత ప్రాధాన్యమని మోదీ ట్రంప్ దృష్టికి తీసుకెళ్లడం ఇక్కడ కీలకం. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని, వాణిజ్యపరంగా భారత్ అత్యంత గట్టిగా, సమర్థవంతంగా చర్చలు జరుపుతోందని ట్రంప్ ప్రశంసించారు. జీ7 సదస్సులో డొనాల్డ్ ట్రంప్ వైఖరిని గమనిస్తే, ఇటీవల ఇరుదేశాల మధ్య కొన్ని తీవ్రమైన అపార్థాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పటికీ, భారతదేశం పట్ల అమెరికా తన సానుకూల వైఖరిని స్పష్టం చేస్తోందని అర్థం చేసుకోవచ్చు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో చైనా ఎదుగుదలను నిరోధించడానికి అమెరికాకు భారతదేశం అత్యంత కీలకమైన భాగస్వామి. ఇరుదేశాల మధ్య కుదిరిన 'మాస్టర్ డిఫెన్స్ పార్టనర్‌షిప్ (ఎండీపీ)',క్వాడ్ కూటమి ద్వారా సైనిక, రక్షణ సంబంధాలు మరింత బలపడుతున్నాయి. గతంలో రష్యా నుండి భారత్ ముడిచమురు కొనుగోలు చేయడంపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసి, భారతీయ ఉత్పత్తులపై దాదాపు 50% వరకు పన్నులు విధించింది.అయితే ఇటీవల కుదిరిన తాత్కాలిక ఒప్పందంలో భాగంగా ఆ పన్నులను 18 శాతానికి తగ్గించడం, రాబోయే రోజుల్లో 500 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యానికి ఇరుదేశాలు సిద్ధమవడం అమెరికా మారిన ఆర్థిక వ్యూహానికి నిదర్శనం. ఇటీవల హార్ముజ్ జలసంధిలో అమెరికా జరిపిన సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించడం ఇరుదేశాల మధ్య తీవ్ర దౌత్యపరమైన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ పరిణామంపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేయగా, ఈ భేటీలో ట్రంప్ ఈ ఉద్రిక్తతలను పక్కనపెట్టి "మన మధ్య అత్యంత బలమైన సంబంధాలు ఉన్నాయి" అని ప్రకటించడం ఇరుదేశాల బలీయమైన బంధాన్ని చూపిస్తుంది. అమెరిక విదేశాంగ విధానం ఎప్పుడూ "లావాదేవీల రూపంలో" ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశాన్ని పూర్తిగా దూరం చేసుకోవడం అమెరికాకు నష్టదాయకం కాబట్టి, తాత్కాలిక విభేదాలు ఉన్నప్పటికీ భారత్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక, ఆర్థిక బంధాన్ని కొనసాగించడానికే యూఎస్ మొగ్గు చూపుతోందని స్పష్టమవుతోంది.

అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ కూటమి సైనిక పరంగా మరింత బలోపేతం కాబోతోందని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. భవిష్యత్తులో ఆసియా ప్రాంతంలో ఎలాంటి రక్షణ సంక్షోభం ఎదురైనా అమెరికా చురుకైన పాత్ర పోషిస్తుందనడానికి సూచన. అమెరికా విదేశాంగ విధానంలో ఏ దేశానికీ 'ఉచితంగా లేదా శాశ్వతంగా' రక్షణ కల్పించరు. ట్రంప్ చేసిన ఈ ప్రకటన భారత్‌కు దౌత్యపరంగా పెద్ద విజయమే అయినప్పటికీ, దీని వెనుక అమెరికా తన గ్లోబల్ వ్యూహాలను, ప్రయోజనాలను కూడా ముడిపెట్టిందని మనం అర్థం చేసుకోవాలి.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

జూలై 29 గురు పౌర్ణమి సందర్భంగా

సంఘానికి

హిందూ సమాజంలో అనాదిగా గురుపూజ పద్ధతి ఆచరిస్తూ వస్తున్నారు. గురుపూజ రోజున గురువును దర్శించుకొని ఆశీర్వచనాలు పొందిన ఒక నమ్మకంతో జీవితాన్ని సాగించడం అనేది మన సంస్కృతిలో విడదీయరాని భాగమైంది. తన జీవితంలో ఒడుదొడుకులను తట్టుకొనేలా వ్యక్తిని నడిపించేది ఈ గురు మార్గ దర్శనమే. దీనికి కులంతో సంబంధం లేదు. పేద, ధనిక అందరూ గురువు ముందర సమానమే.

అయితే ఈ గురువు ఎవరు? చీకటిని పారద్రోలేవాడు గురువు. అనగా మనలో జ్ఞానమనే జ్యోతిని వెలిగించేవాడు. ఒక ఉపనిషత్‌లో ఒకడు నేను 22 మంది గురువులను కలిగి ఉన్నాను అంటారు. అంతమంది ఎవరు అంటే పలానా జంతువు నుండి నేను ఓర్పును నేర్చుకున్నాను. కనుక అది నా గురువు. ఫలానా పక్షి నా గురువు ఎలాగంటే సుదూరంగా ఉన్న వస్తువును చూడటం దాని నుండి నేర్చుకొన్నాను. ఈ విధంగా 22 గుణాలను పశు పక్ష్యాదుల నుండి నేర్చుకున్నానని అంటారు. మనిషి / పక్షి / జంతువు ఇలా ఏదైనా సరే జ్ఞానాన్ని ఇచ్చేది గురువు. గురువు లేకుండా ఎలాంటి సకారాత్మక పనిని ప్రారంభించలేమనేది మన హిందువుల విశ్వాసం. కనుక అన్ని కులాల్లో, అన్ని పంథాలలో, అన్ని మతాలలో వారి వారి గురువులు ఉన్నారు. ఈ విధంగా సంస్థగా/ కుల/మతపరంగా/వ్యక్తిగతంగా కావచ్చు, గురుపరంపర అనేది కొనసాగుతూ వస్తున్నది.

ఆర్ఎస్ఎస్ ప్రారంభించాక గురువుగా ఎవరినైనా తీసుకోవాలని డాక్టర్జీ ఆలోచించారు.. సంఘం ప్రారంభించిన 1925 విజయదశమి రోజున గురువు గురించి ఆలోచించలేదు. రెండు సంవత్సరాల తర్వాత 1927లో ఒక రోజు శాఖ చివరలో డాక్టర్జీ సూచన ఇస్తూ రేపు గురుపూజ కనుక మన సంప్రదాయం ప్రకారం గురుదక్షిణ ఇవ్వడం ఆచారం. కనుక, గురువుకు సమర్పించేందుకు ఎంత పెద్ద మొత్తమైనా, చిన్న మొత్తమైనా పర్వాలేదు. కానీ, అందుకు సిద్ధమై రేపు రండి. ఇక అదనపు సూచనలు ఏమీ ఉండవు అని అన్నారు. శాఖకు అనేక నెలల నుండి వస్తున్న స్వయంసేవకులు డాక్టర్జీ చెప్పిన విషయాలను చర్చించుకోవడం మొదలుపెట్టారు. డాక్టర్జీ రేపు గురుపూజ అని చెప్పారు. కానీ, ఇంతకీ గురువు ఎవరు? మనం ఎవరిని గౌరవించి, పూజించాలి? సంఘానికి గురువుగా ఎవరుంటారని చర్చించుకున్నారు. డాక్టర్జీ సంఘాన్ని స్థాపించారు. ఆయనే మన ఇంటికి వస్తారు. మన బాగోగులు చూసుకుంటారు.తల్లిదండ్రుల తర్వాత ఆయనే మనల్ని ప్రేమిస్తారు. కాబట్టి, ఆయన మనకు గురువు. ఈ వాదన పట్ల వ్యతిరేకత వ్యక్తం కాలేదు. మెజారిటీ స్వయంసేవకులు డాక్టర్జీని గురువుగా పూజించాలనే నిర్ణయానికి వచ్చారు. ఆర్యసమాజంలో దయానంద సరస్వతిని పూజిస్తారు. రామకృష్ణ మిషన్‌లో రామకృష్ణ పరమహంసను ఆరాధిస్తారు. అలాగే, ఎన్నో సంస్థలు ఇదే చేస్తాయి. కనుక, సంఘం డాక్టర్జీని పూజించడంలో తప్పు లేదు, సహజం కూడా.

మరుసటిరోజు స్వయంసేవకులందరూ శాఖలో కలిసారు. శాఖలో ప్రతిరోజూ భగవాధ్వజాన్ని ఎగురవేసే వారు. కానీ, అదే గురువు అని వారికి ఎవరూ చెప్పలేదు. అందువల్ల వారు ముందు రోజులానే ఆ రోజున కూడా భగవాధ్వజాన్ని ఎగురవేశారు. ప్రాథమిక వ్యాయామాల తర్వాత వారంతా వరుసల్లో కూర్చున్నారు. అప్పుడు డాక్టర్జీ స్వయంసేవకుల ముందుకు వచ్చి గురుపూజ గురించి వివరించారు. అది చాలా క్లుప్తమైన ఉపన్యాసం. ''ఈ భగవాధ్వజం గురువుగా సంఘం ఆమోదించింది'' ఇది ఆనాటి వారి ఉపన్యాసంలోని సారాంశం. నేను మొదటగా గురుపూజ చేస్తాను. తర్వాత మీరంతా ఒకరి తర్వాత ఒకరిగా వచ్చి పూజించండి అని చెప్పారు. తొలి గురుపూజను సంఘ వ్యవస్థాపకులు డాక్టర్జీ చేశారు. తర్వాతే ఇతరులు ఆయనను అనుసరించారు. తన చర్యల ద్వారా, గురువు ఎవరో వెల్లడించడంతో, డాక్టర్జీ గురువు కాదని, సంఘ సంస్థాపకునితో సహా అందరికీ భగవాధ్వజమే గురువు అని నాటి స్వయంసేవకులకు అర్థమైంది. ఈ రకంగా సంఘంలో గురుపూజ ఉనికిలోకి వచ్చింది.

డాక్టర్జీ భగవాధ్వజాన్ని గురువుగా ఎందుకు ఎంచుకున్నారు? ఏ వ్యక్తీ కూడా పరిపూర్ణుడు కాడు. కానీ, మనందరం ఆయనను గురువుగా భావించాం. ఆ రోజుల్లో సంఘ స్వయంసేవకులెవరికి ఆయనలో లోపాలు కనిపించలేదు. ఆయన పరిపూర్ణుడు, ఆయన గురువు అయితే, ఎవ్వరికీ అభ్యంతరం లేదు. కాని, దానిని డాక్టర్జీ ఆమోదించలేదు. ఎందుకంటే, వ్యవస్థ అంతా కూడా నిరపేక్షంగా ఉండాలని, వ్యక్తి ఆరాధనగా మారకూడదని మనసారా కోరుకున్నారు. దీని వెనుక రహస్యం ఏమిటి? ఆర్ఎస్ఎస్ భారత్‌లో ఒక ఉద్యమంగా ఉండాలన్నదే లక్ష్యం. హిందూసమాజ పునరుజ్జీవనమే లక్ష్యం. హిందూ సమాజం క్షీణించి, నిరాశతో, శిథిలమై, పరాజయం పాలై, దిగజారి అంతిమంగా విదేశీ శక్తులపై ఆధారపడుతూ, పరాధీనగా మారింది. ఇలాంటి సమాజాన్ని పునరుజ్జీవింప చేయాలి. దానికి ముందు వరుసలో ఉండవలసిన దూతలు ఎవరంటే, మనమే. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (స్వయంసేవకులం). కనుక, సంఘం ఒక ఉద్యమంగా, ఒక సంస్థగా ఉండాలే తప్ప వ్యవస్థ కాకూడదు. ఎందుకంటే, వ్యవస్థ ఎప్పుడూ పరిమితమైందే. నిర్మాణం అనేది అపరిమితమైంది, నిత్యం ఎదిగేది. ప్రజలు పెరిగే కొద్దీ పెరిగేదీ, సమస్యలను పరిష్కరిస్తూ ఎదిగేది. సంఘాన్ని ఒక ఉద్యమంగా, ఒక నిర్మాణంగా భావించారు. ఇంతటి సృజనాత్మక నిర్మాణానికి ఒకే వ్యక్తి గురువుగా ఉండలేడు. ఎందుకంటే, వారి జీవితకాలం పరిమితం. తర్వాత మరొకరిని గురువుగా భావించవచ్చు. కానీ. అంతిమంగా ఆ వ్యక్తుల ఇష్టాయిష్టాలతో మనం ప్రభావితం అవుతాం. అందుకే, డాక్టర్జీ ముందు చూపుతో, ఆర్ఎస్ఎస్‌కు ఒక వ్యక్తి గురువుగా ఉండకూడదని నిర్ణయించారు. అతడు పరిపూర్ణుడే అయి వుండవచ్చు, కానీ గురువు నిరపేక్షంగా ఉండాలి. ఈ గురువును ఎలా ఎంపిక చేసుకోవాలి అని ఆలోచిస్తున్నప్పుడు, సంఘ ఆదర్శమే గురువు కావాలని భావించారు. ఎందుకంటే, ఆదర్శం నిరపేక్షంగా ఉంటుంది. మనం సాహిత్యాన్ని చదివో, ఉపన్యాసాలకు ప్రభావిత మయ్యో, దాని ఆదర్శాల పట్ల ఆకర్షితమయ్యో సంఘంలో చేరాం. ఒక వ్యక్తి మీకు ప్రేరణను ఇవ్వవచ్చు, మార్గదర్శిగా ఉండవచ్చు కానీ సిద్ధాంతపరంగా చూసినప్పుడు ఆదర్శమే గురువు తప్ప వ్యక్తి కాదు. కనుక, మనకు మార్గదర్శనం చేసే సంఘ ఆదర్శాలే మనకు గురువు అని డాక్టర్జీ నిర్ణయించారు. మొదటగా సంఘానికి ఆదర్శమే గురువు. కానీ, ఆచరణాత్మకంగా, భౌతిక స్థాయిలో చూసినప్పుడు ఆదర్శానికి ఒక రూపం ఉండదు. రసాయన శాస్త్రపరంగా చెప్పాలంటే, దానికి రంగు, బరువు ఉండదు. అది వాయువు కాదు, ఘనం కాదు, ద్రవం కాదు. కనుక, ఆదర్శమనేది నిరాకారమైనది. దానికి మనకు మార్గదర్శనం చేసే, ప్రేరేపించే శక్తి ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే, అది ఆత్మ వంటిది. మనం ఆత్మను చూడం, దాని బరువు ఎంతో మనకు తెలియదు. దాని రంగు, వాసన మనకు తెలియదు. కానీ, అది ఉనికిలో ఉంటుంది. అలాగే, ఆదర్శం కూడా ఉనికిలో ఉంటుంది. అది నిరాకారమైనా,

ఆదర్శమే గురువు

రంగు, వాసన ఏమీ లేనిదైనా. ఆ ఆదర్శమే మన గురువు. కానీ, ఒక ఆచరణాత్మక వ్యక్తికి శూన్యంలోకి చూసే ఆ నిరాకార ఆదర్శం సరిపోదు. అతడికి ఆదర్శానికి సంబంధించిన ఒక భౌతికమైన వస్తువు కావాలి. అది తాను చూడగలిగే, దృష్టిపెట్టగలిగే, ఏకాగ్రతతో ఉండగలిగే ఒక వస్తువై ఉండాలి. కనుక, ఆదర్శాన్ని భౌతికంగా చూపాలి. నిరాకారమైన ఆదర్శాన్ని, సాకారంగా మార్చాలి. దీనితో, డాక్టర్‌జీ మన ఆదర్శానికి ప్రాతినిధ్యం వహించగలిగినది ఎవరు అని ఆలోచించారు. శాశ్వతమైన ఆదర్శానికి ప్రాతినిధ్యం వహించగల శాశ్వతమైన వస్తువు ఏమిటి?ఆ దృష్టికోణంలో ఆయన ఆలోచించారు. విగ్రహంలోకి సాక్షాత్తు భగవంతుడే ప్రవేశించినట్టు. ఆ భగవంతుడిని మనం సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడని అంటాం. కాని అత్యంత ఉన్నతమైన, గొప్ప ఆత్మలు మాత్రమే ఆ ఉత్కృష్టమైన స్థాయికి చేరగలవు. మనం మానవులం, కొన్ని పరిమితులు ఉంటాయి. అందుకే, విజ్ఞత కలిగిన వ్యక్తి అనంతమైన దానికి ప్రాతినిధ్యం వహించేందుకు విగ్రహాలను తయారు చేశాడు. అనంతమైన దానికి ప్రాతినిధ్యం వహించే పరిమితమైన వ్యక్తీకరణ– మూర్తి. ఈ మూర్తి పూజ ద్వారానే మనం ఈశ్వరపూజ చేయగలం. అలాగే, ఆర్ఎస్ఎస్ ఆదర్శం నిరాకారమై నప్పటికీ, దానిని సాకారం చేయవలసి వచ్చింది. అప్పుడు డాక్టర్‌జీ భగవాధ్వజం ఆదర్శంగా ఉండగలదని ప్రతిపాదించారు.

ఈ రకంగా ఆయన భగవాధ్వజాన్ని ఎంపిక చేశారు. కానీ, భగవాధ్వజమే ఎందుకు? దానికి చారిత్రికమైనవి, సాంస్కృతమైన అనేక కారణాలున్నాయి. కాషాయం అంటే భగవా. ఇది వేదాలలో ప్రస్తావనకు రావడమే కాదు, అగ్నికి ప్రత్యామ్నాయంగా భావిస్తారు. హిందూ సంస్కృతిలో అగ్ని అనేది చాలా ముఖ్యం. ప్రపంచంలోనే తొలి ధార్మిక సాహిత్యమైన వేదాలలోని 'అగ్నిమీళే పురోహితం' అని చెప్పబడింది. ఆ అగ్ని రంగు భగవాధ్వజం రంగే. కనుక, ఈ ధ్వజం మన యజ్ఞానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. త్యాగానికి ప్రతినిధి. అలాగే ఉదయించే సూర్యుడి రంగు కాషాయమే. అస్తమించే సూర్యుడి రంగు కూడా. కనుక, సూర్యుడు, అగ్ని మనకు వెలుతురు ఇస్తాయి. అటు అగ్ని, ఇటు సూర్యుడికి కూడా కాషాయ రంగే ప్రాతినిధ్యం వహిస్తుంది. మనం వెలుగును ఒక రూపంగా ఆరాధించినప్పుడు, ఆదర్శంగా తీసుకున్న క్రమంలో భగవాధ్వజం ఆలోచన వచ్చింది. కనుక, భగవాధ్వజం అగ్ని దేవుడికి, సూర్యదేవుడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. సంస్కృతంలో అగ్ని వ్యుత్పత్తి ఏమిటి? దాని అర్థం పైకి చూస్తూ, పైకి ఎగిసి పడేదే అగ్ని. మనం అగ్నిజ్వాలలను చూసినప్పుడు, అది పైకి వెళ్తుంది తప్ప కిందకు వెళ్లదు. ఒక కాగడాను వెలిగించి, దానిని కిందకు తిప్పి ఉంచినా, దాని జ్వాలలు పైకే వెడతాయి. ఎప్పుడూ పైకే చూస్తుంది. అగ్నిఅనగా ముందుకు నడిపించేది అని అర్థం. మనం ఎప్పుడూ ముందు చూపుతో ఉండేవాళ్లం, ఉన్నతత్వాన్ని చూసేవాళ్లం. పునరుత్థానం చెందాలని కోరుకునే పతనమైన సమాజానికి ఇది ఒక మంచి చిహ్నం. సూర్యుడినే తీసుకుందాం, విజయం సాధించిన సమయంలోనూ, పరాజయం పాలైనప్పుడు కూడా అతడు ఆశను కోల్పోడు. విజయంలో ఏ రంగులో ఉంటాడో, ఓటమిలోనూ అదే రంగులో ఉంటాడు. కనుక, కృష్ణ భగవానుని ప్రకారం **'సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ'** జయాపజయాల్లోనూ, సుఖదుఃఖా ల్లోనూ సమచిత్తం, సమభావంతో ఉండాలి. అటువంటి సమభావం సూర్యుడిలో ఉంది. కనుక, ఆయన ఉదయించినప్పుడు ఎలా ఉంటాడో, అస్తమించే సమయంలోనూ అలాగే కనిపిస్తాడు. కనుక, యుద్ధ సమయంలోనూ, శాంతి కాలంలోనూ సమభావన ఉండాలి. ఆ సమభావనకు ఈ కాషాయ

మనకు అంకితభావమనే గుణం ఉండాలి. త్యాగం చేసే స్వభావముండాలి. దాని నుంచి సంతృప్తి వస్తుంది. స్వయంసేవకులందరిలో ఈ లక్షణాలన్నీ పొందుపరచాలన్నది డాక్టర్‌జీ లక్ష్యం.

రంగు ప్రాతినిధ్యం వహిస్తుంది. మరొక విషయం ఏమిటంటే, అగ్నిని పావక అని కూడా అంటారు. హిందీలోనూ, సంస్కృతంలోనూ పావక అంటే దేనినైనా పవిత్రం చేసేది అని అర్థం. మీరు అగ్నిలో ఏమి వేసినా, అది శుద్ధి అవుతుంది. అంటే, అగ్ని శుద్ధి చేసే స్వభావం కలిగినది. మనలోని అజ్ఞానాన్ని, అంధకారాన్ని తొలగించి, మన జీవితాన్ని పవిత్రం చేసే గురువు మనకు కావాలి. గతంలో అనేక పాపాలు చేసి ఉండవచ్చు, తప్పు మార్గంలో నడిచి ఉండవచ్చు. వాటిని శుద్ధి చేసే మార్గదర్శి మనకు ఉండాలి. అగ్ని అనేది శాశ్వతంగా శుద్ధీకరణ చేసేది. అదే భగవారంగు. కనుక, ఈ భగవా జెండా మన సంస్కృతికి సంబంధించిన విలువలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

యజ్ఞం అంటే ఏమిటి? మనం ఆహుతి ఇవ్వాలి. అంటే, మనం తర్పణం ఇవ్వాలి. తర్పణం అంటే అర్పణ. అర్పణ అంటే సమర్పణ. సమర్పణ అంటే సంపూర్ణ అంకితభావం. షరతులు లేని అంకిత భావం. దీనినే సమర్పణ అంటారు. అదే యజ్ఞం. జీవితమే ఒక యజ్ఞం కావాలంటే, మనకు అంకితభావమనే గుణం ఉండాలి. త్యాగం చేసే స్వభావముండాలి. దాని నుంచి సంతృప్తి వస్తుంది. స్వయంసేవకులందరిలో ఈ లక్షణాలన్నీ పొందుపరచాలన్నది డాక్టర్‌జీ లక్ష్యం. అంకితభావం లేకుండా సంఘం ఎదుగలేదు. ఆధునిక కాలపు సుఖాలను త్యాగం చేయకుండా సంఘం పెరగలేదు. కనుక, మనం మన జీవితాలను అంకితం చేయాలి, అవసరం లేని వాటిని త్యాగం చేయాలి. ఈ అంకితభావపు రంగు భగవా అనే అగ్ని రంగు. కనుక, డాక్టర్‌జీ ఈ భగవాధ్వజాన్ని మన గురువుగా ఎంపిక చేశారు. ఇదే చారిత్రిక, సాంస్కృతిక, ధార్మిక కారణం. అగ్ని, సూర్యుని విలువలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కనుక, మన ధ్వజంపై ఒక పదం కానీ, ఒక గుర్తు కానీ ఉండదు. ఎందుకంటే, గుర్తు అనేది ఇతరుల నుంచి వేరుచేసే ఒక ప్రత్యేక అస్తిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఉదాహరణకు, ఒక సంకేతంపై భగవా ముద్ర వేస్తే, అది ఆ ప్రత్యేక సంస్థకు చెందుతుంది. రామకృష్ణ మిషన్‌ను తీసుకుంటే దాని భగవాధ్వజం దానికే చెందింది. అలాగే, చిన్మయ మిషన్ విషయమూ అంతే. భవిష్యత్తులో మొత్తం వ్యవస్థీకృత సమాజం ఉండాలనేది డాక్టర్‌జీ భావన. అందుకే సంఘానికి చెందిన భగవాధ్వజంపై ఎటువంటి గుర్తు ఉండాలని డాక్టర్‌జీ కోరుకోలేదు.

చరిత్రలోకి వెళితే, ప్రతి భగవద్గీత పుస్తకంలో ముద్రించే అర్జునుడి రథంపై ఉన్న జెండా రంగు ఏమిటి? ఆ జెండా రంగు కాషాయం/భగవా. అలాగే, గీతాప్రెస్ ముద్రించిన వాల్మీకి రామాయణం చిత్రాలు ఉన్నాయి. వాటిని సంఘం చొప్పించలేదు. వాల్మీకి రామయణంలో దాని రంగు భగవానే. అలాగే, బ్రిటిష్ వారు మన దేశంలోకి వచ్చేవరకూ ప్రతి రాజు తాలూకు, అది మైసూరు రాజు కావచ్చు, మరొకరు కావచ్చు. కానీ రంగు ఒకటే, అది భగవా. కనుక, ఈ భూమిపై ఉన్న రాజులందరూ ఈ భగవాజెండాను కలిగి ఉన్నారు. అయితే, వారి మధ్య ఉన్న తేడాలను గుర్తించేందుకు, వాటిపై వివిధ సంకేతాలను ముద్రించుకున్నారు. అర్జునుడు తన జెండాపై కపి అంటే హనుమను కలిగి ఉన్నాడు. అందుకే, ఆయన జెండాను కపి ధ్వజం అన్నారు. మరొక రాజు జెండాపై మొసలి ఉన్నది, కనుక దానిని మకర ధ్వజమన్నారు. రంగు ఒకటే కానీ సంకేతం భిన్నమైంది, దానితో వారిని గుర్తించేవారు. చారిత్రకంగా, ఈ రాజులందరూ ఈ భగవారంగును ఉపయోగించారు. అలాగే, సన్యాసులందరూ ఏ ప్రాంతంవారైనా ఒకటే రంగు ధరిస్తారు. భాష ఏదైనా, ప్రాంతం ఏదైనా ఒక్కసారి వారు సన్యాసాన్ని

స్వీకరించిన తర్వాత ప్రతి రంగునూ విసర్జించి, అందరూ భగవాను ధరించారు. ఇది మన ఆధ్యాత్మికతకు ప్రాతినిధ్యం వహించే రంగు. అది త్యాగానికి, నిస్వార్థతకు రంగు, దైవత్వంవైపు పయనించే వారి రంగు, ఇది మొత్తం సమాజాన్ని వసుధైక కుటుంబంగా భావించి పని చేసే వారి రంగు. ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ఆ రంగు ప్రాధాన్యాత అది. క్లుప్తంగా, ఈ భగవారంగు మన భూమి క్షత్రియత్వానికి, బ్రహ్మత్వానికీ, భారత శాశ్వత కర్తవ్యానికీ ప్రతినిధి. కనుక, డాక్టర్జీ మన జెండా రంగు ఇదే ఉండాలని సరిగా ఎంపిక చేసి, ఎగురవేశారు. ఆయన ఎంత లోతుగా ఆలోచించి ఉండవచ్చు. అందరినీ కలుపుకుపోయే గుణం ఆ రంగుకు ఉంది. అది భౌగోళిక, మతపరమైన, తాత్విక భేదాలన్నింటినీ అధిగమిస్తుంది. ఇది అన్నింటికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ అన్నింటినీ కలుపుకుపోయే తత్వం అన్నది గొప్ప గుణం. వ్యక్తిగతం కానిది, ఆపేక్ష లేనిది నిరంతరం ప్రవహిస్తుంది. ఈ నిత్యత్వం ఎలా వస్తుంది, ఎక్కడి నుంచి వస్తుంది? వ్యక్తి మరణిస్తాడు కానీ ఆదర్శం మరణించదు. భగవా ఒక ఆదర్శానికి ప్రాతినిధ్యం వహిస్తుంటే, అది తరాలు మారుతున్నా కొనసాగుతుంది. వ్యక్తులు రావచ్చు, పోవచ్చు, కానీ భగవా నిరంతరం కొనసాగుతుంది.

క్రీడలకు చెందిన ఒక ఉదాహరణను పరిశీలిద్దాం. ఫోర్ ఇంటు ఫోర్ హండ్రెడ్ మీటర్స్ రేస్ జరుగుతోంది. దాని ట్రాక్‌లను వృత్తాకారంలో వేశారు. నాలుగు లేదా ఐదు ట్రాకులతో ఒక పెద్ద సర్కిల్ క్రీడాకారులు పరుగు తీసేందుకు ఏర్పాటు చేశారు. జట్టులో నలుగురుంటారు. ఆ సర్కిల్‌లో నలుగురు వ్యక్తులు సమానదూరంలో ఉంటారు. వారి చేతిలో బాటెన్ ఉంటుంది. వారు వేగంగా పరుగుతీస్తారు. పావు వంతు సర్కిల్‌ను పూర్తి చేసిన తర్వాత, అక్కడ నిలబడి ఉన్న తమ జట్టు సభ్యుడికి ఆ బాటెన్‌ను అందచేసి, పరుగు ఆపేస్తారు. బాటెన్ అందుకున్న వ్యక్తి పరుగులు తీయడం ప్రారంభిస్తాడు. ఆ వ్యక్తి సగం దాకా వెళ్ళినప్పుడు రెండవ జట్టుని ఆపి, వారి నుంచి బాటెన్‌ను అందుకుని, పరుగు ప్రారంభిస్తుంది. ఇప్పుడు మొత్తం ఆ సర్కిల్‌లో పరుగులు తీసిందెవరు. అది నలుగురు సభ్యులున్న జట్టు. వీరిలో ఏ ఒక్కరూ మొత్తం ఆ వృత్తంలో పరుగెత్త లేదు. వారి బాటెన్ చేతులు మారి, పరుగు పూర్తి చేసింది. కాని, క్రీడాకారులు పావు వంతు మాత్రమే పరుగుతీశారు. ఇక్కడ వ్యక్తికిగల పరిమితిని చూడవచ్చు, బాటెన్‌కున్న శాశ్వతత్వాన్ని చూడవచ్చు. ఆ బాటెన్ భగవా వంటిది. దీనిని శ్రీరాముడు, శ్రీకృష్ణుడికి అందించగా, శ్రీకృష్ణుడు తర్వాతి తరానికి అందచేశాడు. అలా తదుపరి తరాలకు అది అందుతూ వచ్చింది. మహారాణా ప్రతాప్ తరం నుంచి శివాజీ తరం వరకు, శివాజీ తరం నుంచి తర్వాతి తరానికి, దాని నుంచి డాక్టర్జీ వరకు అదే బాటెన్ అందింది. భగవాన్ శ్రీరాముడి చేతిలో ఉన్న ఆ బాటెనే, నేటి డాక్టర్జీ చేతులకు అందింది. అలా తరతరాలుగా అందచేసిన ఆ బాటెనే భగవాధ్వజం. ఈ రకంగా, వ్యక్తి శాశ్వతం కాకపోయినప్పటికీ, భగవా శాశ్వతంగా నిలిచింది. ఈ భగవాను ఆర్ఎస్ఎస్ స్వీకరించింది. ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్ నుంచి ఎటువంటి గుణాలను ఆశిస్తుంది? జాతీయంగా, సాంస్కృతికంగా జాగృతం కాకుండా, ఎవరుపడితే వారు స్వయంసేవకులు కాలేరు. తమకున్న దురలవాట్లను మానుకొని, శీలవంతులు కానంత వరకూ ఎవరూ స్వయంసేవకులు కాలేరు. నిస్వార్థమైన, స్వీయ ప్రేరిత, జాతీయ భావాలు కలిగి,



జాతికి అంకితమై, శీలవంతులై, అద్భుతమైన పనితీరు ప్రదర్శించేవారు మాత్రమే కాగలరు.

అందుకే, స్వయంసేవకులు కావడం అంత తేలిక కాదు. స్వయంసేవకుడు అయ్యేందుకు, ఆర్ఎస్ఎస్ అనే ఈ శక్తివంతమైన సంస్థ చేపట్టిన ఉద్యమంలో తాను కూడా భాగమయ్యేందుకు అనుగుణంగా తన జీవితాన్ని మార్చుకోవాలి. ఆ మార్పును తీసుకువచ్చేందుకు మనకు ప్రేరణను ఇచ్చేదే ఈ భగవాధ్వజం. మీ జీవితాన్ని అంకితం చేయాలని భగవాధ్వజం పిలుపునిస్తున్నది. ఈ పని కోసం ఎక్కువ సమయం కేటాయించాలి, నిస్వార్థంగా ఉండాలి. మీరు మీ గురించి మాత్రమే ఆలోచించుకోకూడదు. బహిర్గతంగా మనిషి రెండు కాళ్లు, రెండు చేతులు, రెండు కళ్లు, రెండు చెవులు, ముక్కు, నోరు వంటి అవయవాల రూపంలో ఉంటాడు. ఇలా వ్యక్తి పురుషుడు కావచ్చు, స్త్రీ కావచ్చు. అంతర్గతంగా, వ్యక్తి ఈ అవయవాలు అన్నీ ఉన్నప్పటికీ, తన గురించి మినహా ఇతరుల గురించి ఆలోచించకపోతే అతడిని వ్యక్తిగత మనిషి అంటారు. అదే మనిషి, తన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుని, దానిని తాను నివసించే గ్రామానికి, సమాజానికి విస్తరింపచేస్తే అతడిని సామాజిక మనిషి అంటారు. అలాగే, అతడు తన వ్యక్తిత్వాన్ని జాతీయ సరిహద్దుల వరకు విస్తరింపచేసే అతడిని జాతీయ వ్యక్తి అనవచ్చు. కనుక, మహాత్మాగాంధీ జాతీయ మనిషి (నేషనల్ మ్యాన్) అని అనవచ్చు. డాక్టర్జీ జాతీయ మనిషి. మన గ్రామాల్లో కూడా సమాజం కోసం నిస్వార్థంగా పనిచేసే మంచి వ్యక్తులు ఉంటారు. వారు సామాజిక మనుషులు. కేవలం తన గురించి, తన కుటుంబం గురించి మాత్రమే పట్టించుకునే వ్యక్తి ఉండవచ్చు. అతడిని సామాజిక మనిషి అనలేం కానీ, కుటుంబీకుడు అనవచ్చు. కుటుంబంలో భాగమైనప్పటికీ, భార్య, పిల్లల గురించి ఆలోచించకుండా కేవలం తన గురించి మాత్రమే ఆలోచించుకునే వ్యక్తిని స్వార్థపరుడు అనవచ్చు.

అవయవాలన్నీ ఒకేరకంగా ఉన్నప్పటికీ, అంతర్గతంగా వేరువేరు భావాలు ఉన్నందున స్వార్థపరుడు, వ్యక్తిగత మనిషి, సామాజిక మనిషి, జాతీయ మనిషి, విశ్వవ్యక్తి అని భిన్నపద్ధతులలో పిలుస్తారు. ఆర్ఎస్ఎస్‌లో వ్యక్తిగత మనిషిగా సంఘానికి పరిచయమై క్రమంగా జాతీయభావాలతో నిండిన మనిషిగా విస్తరించగలడు. ఆ జాతీయ వ్యక్తిని స్వయంసేవకుడంటారు. వ్యక్తిగత మనిషి నుంచి జాతీయభావాలతో నిండిన మనిషిగా మారే క్రమంలో – సంఘంలో చేరే ముందు మంచి శీలవంతుడైన అతడు వ్యక్తిగత మనిషే. అతడు స్వార్థపరుడు కాకపోవచ్చు కాని అతడు తన కులం గురించి ఆలోచించవచ్చు. అపుడు అతడు జాతీయ వ్యక్తి కాలేడు. కాని అతడు తన కుల అస్తిత్వాన్ని, కుటుంబ గుర్తింపును వదిలి అతని భావాలను దేశంవరకూ విస్తరింప చేస్తే, అప్పుడు అతడు జాతీయ భావాలతో నిండిన వ్యక్తి అవుతాడు. చైనా మన ఉత్తర సరిహద్దులపై దాడి చేసినప్పుడు అతడు ఇక్కడ ప్రశాంతంగా పడుకోలేడు. వాస్తవంగా చైనా ఆతడి ఊరి సరిహద్దుల్లో ఒక్క అంగుళంపై కూడా దాడి చేసి ఉండకపోవచ్చు, అయినా అతడికి నిద్రపట్టదు. చైనా మన దేశంలోకి ప్రవేశించిందను కుంటాడు తప్ప తన గ్రామం, తన ఆవరణ గురించి ఆలోచించడు. ఆ విధంగా జాతీయభావాలను కలిగించ గల శక్తి ఈ భగవారంగుకే ఉంది. మనం దేశంలో ఏ ప్రాంతానికి చెందినవారమైనా కావచ్చు. ఇది పూర్తిగా అందరినీ కలుపుకుపోతుంది. కనుక, భగవాధ్వజం (రంగు) మనకు జాతీయ గుర్తింపును ఇస్తుంది. గురుపూజోత్సవం సందర్భంగా దానిని పూజించడమనేది భగవంతుడు మనకిచ్చిన ఒక గొప్ప వరం. ఈ రోజున, మనం గురువుగా స్వీకరించిన భగవాధ్వజాన్ని పూజిస్తాం. ★

భాగం-42



వైయక్తిక స్వాతంత్ర్యం

స్టువర్ట్ మిల్ రచించిన స్వాతంత్ర్యం (లిబర్టీ, 1859) అనే పుస్తకం వ్యక్తిగత స్వాతంత్ర్యానికి మద్దతునిస్తుంది. వ్యక్తి స్వాతంత్ర్యానికి – వ్యక్తిత్వ వికాసానికి వ్యక్తివాదం అవసరమని మిల్ అభిప్రాయపడ్డాడు. ఆయన బోధించిన వైయక్తిక స్వాతంత్ర్యంపై శ్రీకరపాత్రీ స్వామి వివరణ ఇది....

'మానవ ప్రగతికి మత స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం ఆవశ్యకాలు' అని స్టువర్ట్ మిల్ చెప్పాడు. విపరీత ధోరణులు కలిగిన వ్యక్తులకు సైతం స్వాతంత్ర్యం ఉండాలని అతడు వాదించాడు. మిల్ తత్త్వసిద్ధాంతం ప్రకారం స్వతంత్రత లేకుండా పోవడం అనేది ప్రగతికి ఆటంకం అవుతుంది. 'ఒకానొక సమయంలో ఒక తత్త్వసిద్ధాంతం లోకంలో ప్రచలితంగా ఉన్నంత మాత్రాన దానినే సత్యమని నమ్మరాదు. ఒకవేళ అట్టి విచారధార సత్యమైతే కావచ్చు. మత, వాక్ స్వాతంత్ర్యాల ద్వారా ఎవరికైనా సరే తమ ప్రచారం చేసుకునే అవకాశం ఉండాలి. ఏసుక్రీస్తు, సోక్రటీసులు చెప్పిన తత్త్వసిద్ధాంతాలు అప్పటి విచారధారల((భావజాలాల)తో ఏకీభవించక విరుద్ధంగా రూపొందాయి. ప్రభుత్వ అధికారులు వారిద్దరినీ అణచివేసేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. ఇద్దరికీ మరణదండన విధించారు. కానీ ప్రపంచం వారిద్దరూ విపరీత ధోరణులు కలిగినవారు కాదనీ మహా పురుషులనీ విశ్వసించింది' అందువల్లనే, 'నేడు మనం విచిత్రంగా ప్రవర్తించేవారని ఎవరినైతే అంటామో... ఎవరి విచార ధారను ఉపేక్ష చేస్తుంటామో... వారే భవిష్యత్తులో అసాధారణ బుద్ధిశాలులుగా నిరూపితం కావచ్చు' అని అతడు చెబుతాడు.

'అణచివేతతో సత్యాన్ని దాచిపెట్టలేం. సత్యం దృఢత్వాన్ని సంతరించుకోవడానికి అణిచివేత అనే కఠిన పరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది అంతే' అని జాన్సన్ చెప్పాడు. కానీ స్టువర్ట్‌మిల్ 'అణచివేతను ప్రగతికి అవరోధం'గా చెప్పాడు. మార్టిన్ లూథర్‌కింగ్ (1483-1546) కంటే ముందుగా మత సంస్కరణలు ఇరవైసార్లు ప్రారంభమయ్యాయి. ప్రతిసారీ అణిచివేతలతో నిలిచిపోయాయి. అలా జరగకపోతే 16వ శతాబ్దం కంటే ముందుగానే యూరప్‌లో మతసంస్కరణ ప్రారంభం అయి ఉండేది.

లూథర్ ప్రవేశపెట్టిన మతసంస్కరణల ఫలితంగా అనేక మహత్త్వపూర్ణ విచారధారలకు బీజారోపణ జరిగింది. ఒకవేళ అతడికంటే ముందుగా వచ్చిన భావజాలాలను అణచివేయకపోతే ఇంతకన్నా ఎక్కువ ప్రగతి సాధ్యమై ఉండేది. నిజానికి సత్యం అమరం. దానిని అణిచివేతతో అంతం చేయలేం. కానీ అణచివేతతో దానికి ప్రచారం కలగకుండా ఆలస్యం చేయవచ్చు. ఇట్టి విలంబం సమాజానికి హానికరం. అందువల్ల మత,వాక్ స్వాతంత్ర్యాలు అందరికీ పూర్తిస్థాయిలో ఉండాలి.

మిల్ అభిప్రాయం ప్రకారం, 'సత్యానికి అనేక కోణాలుంటాయి. అవి ఒకదానికి మరొకటి అడ్డంకిగా మారవు. పైగా ఒకదానికొకటి సహకరించుకుంటాయి. అందువల్ల ఒక పక్షానికి అనుయాయులుగా ఉన్నవారు వేరొక పక్షం వారిని సత్యవిరోధులుగా భావించడం జ్ఞానవృద్ధికి ఆటంకంగా మారుతుంది. సత్యం ఎప్పుడూ ఏదో ఒక పక్షాన్ని మాత్రమే సమర్థించదు. ఇతర విచారధారలలోనూ సత్యం ఉండి ఉండవచ్చు. అందువల్ల మతవిశ్వాసాన్ని కలిగివుండడం, దానిని ప్రచారం చేయడం వ్యక్తుల ఇష్టం ప్రకారం జరగాలి. అటువంటి వాతావరణంలోనే నిశ్చితమైన సత్యాన్ని గ్రహించడం సాధ్యమవుతుంది. తర్కం ద్వారా ఏర్పడిన సంఘర్షణలతో సత్యం బలపడి విజయం సాధిస్తుంది. దీనివల్ల అంధవిశ్వాసాలు ప్రబలవు.' ఈ విధంగా మిల్ మతవిశ్వాసాలకు, తర్కాలకు పూర్తి స్వాతంత్ర్యం కల్పించడమే తన మతంగా ప్రకటించాడు.

' తార్కిక సంఘర్షణల ద్వారా బలపడే విచారమే సత్యసిద్ధమైనది. అందువల్ల ప్రభుత్వం వ్యక్తులకు మాట్లాడడానికి, రాయడానికి, ఆలోచనలు పంచుకోవడానికి, తర్కానికి పూర్తి స్వాతంత్ర్యం ఇవ్వాలి' అని మిల్ అభిప్రాయ పడ్డాడు. అతడి అభిప్రాయం ప్రకారం, 'సమాజంపై ప్రభావం చూపే దొంగతనం, కలహాల వంటి వాటి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. కానీ వ్యక్తిగత కార్యాలలో జోక్యం తగదు.

ఉదాహరణకు, ఒకడు తన ఇంటిలోనే ఉండి రాత్రంతా చదువుకోవచ్చు లేదా మద్యపానం చేయచ్చు. దానికి అతడికి స్వాతంత్ర్యం ఉండాలి. కానీ రాత్రిపూట తన ఇంటిలోనే ఉండి బిగ్గరగా పాడడం వల్ల ఇతరుల ప్రశాంతతకు భంగం వాటిల్లవచ్చు. అందువల్ల సమాజానికి ప్రతికూలమైన వ్యక్తిగత చర్యలను నిరోధించడం అవసరం. సమాజంలో ప్రశాంతతకు భంగం కలిగించని చర్యలకు స్వాతంత్ర్యం ఉండడం అవసరం.

ఒక మద్యపానీయుడు తన అనుభవం ద్వారా మద్యపానం హానికరమని గ్రహించగలిగితే ఆ అలవాటును అతడు మానుకోగలడు. ఒకవేళ ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధిస్తే కూడా మానవచ్చు. కానీ దానిలో చరిత్రాత్మక బలం ఉండదు. స్వీయ అనుభవం ద్వారా తీసుకున్న నిర్ణయమే దృఢమైనది అవుతుంది. ప్రభుత్వం నిషేధించడం వల్ల దొంగతనంగా మద్యపానం చేయడానికి ప్రజలు అలవాటు పడవచ్చు.'

ఇదేవిధంగా, జూదం ఆడడం విషయంలో కూడా చట్టాల ద్వారా నిరోధించడం సరైన పద్ధతి కాదని అర్థమవుతుంది. ఈ పనులన్నీ చెడ్డవి అనేది నిజమే కానీ, వాటిని ఆత్మసంఘర్షణ ద్వారా విడిచిపెట్టేయడం వల్ల ఆత్మబలం వృద్ధి పొందుతుంది. సామాజిక సంప్రదాయాలు – ఆచారాలనే బంధనాలను కూడా అతడు పురోగతికి అడ్డంకులుగా భావించాడు. అయితే సామాజిక నియంత్రణల ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని సాధించడం కుదరదు.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

నేటి వేగవంతమైన, సాంకేతిక విప్లవ కాలంలో గురుశిష్యుల సంబంధం కేవలం 'బోధన-అభ్యాసన'కు మాత్రమే పరిమితం కాకూడదు. శిష్యుడు గురువు అనుభవాన్ని, గురువు శిష్యుడి ఆలోచనలను, సందేహాలను గౌరవించాలి. అప్పుడే ఆరోగ్యకరమైన చర్చకు తావుంటుంది.



భారతీయ సంస్కృతికి

విద్యావ్యవస్థలో గురుశిష్యుల బంధం ఆదర్శవంతంగా లేకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మారుతున్న సామాజిక పోకడలు, ఆర్థికపరమైన మార్పులు ఈ పవిత్రమైన బంధాన్ని ప్రభావితం చేస్తున్నాయి. చాలా విద్యాసంస్థలు కేవలం లాభాపేక్షతో నడుస్తున్నాయి. గురువు ఒక 'ఉద్యోగి'గా, శిష్యుడు ఒక 'కస్టమర్'గా మారిపోతున్నారు. ఫీజులు చెల్లిస్తున్నాం కాబట్టి మాకు కావలసింది లభించాలి అనే ధోరణి విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో పెరుగుతోంది. దీనివల్ల గురువు పట్ల ఉండాల్సిన భక్తిశ్రద్ధలు తగ్గుతున్నాయి. విద్యావ్యవస్థ కేవలం ర్యాంకుల చుట్టూ తిరుగుతోంది. సిలబస్ పూర్తి చేయడం, మంచి ఫలితాలు రాబట్టడంపైనే గురువు దృష్టి పెడుతున్నారు. విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే సమయం వారికి దొరకడం లేదు. విద్యార్థులు కూడా మార్కుల కోసం పడే ఆరాటంలో గురువు నుండి నేర్చుకోవాల్సిన 'జీవన నైపుణ్యాలను' విస్మరిస్తున్నారు.

స్నేహపూర్వక మార్గదర్శనం

గురువు కేవలం పుస్తకాల్లోని పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు, ఒక దిక్సూచిగా ఉండాలి. విద్యార్థి మానసిక స్థితిని అర్థం చేసుకుని, వారిలోని సృజనాత్మకతను వెలికితీయాలి. గురువును ఒక స్నేహితుడిగా భావిస్తూనే, శిష్యుడు క్రమశిక్షణను విస్మరించకూడదు. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ, జ్ఞానం అపరిమితంగా అందుబాటులో ఉంది. గురువు తాను కూడా నిరంతరం నేర్చుకుంటూ కొత్త విషయాలను విద్యార్థులకు పరిచయం చేయాలి. శిష్యుడు కేవలం మార్కుల కోసం కాకుండా, విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవాలనే జిజ్ఞాస కలిగి ఉండాలి. భారతీయ సంస్కృతిలో గురుశిష్యుల బంధం ఎంత పవిత్రమైనదో వివరించడానికి ఎన్నో అద్భుతమైన పురాణ పాత్రల ఉదాహరణలు ఉన్నాయి. వారిలోని నిబద్ధత, త్యాగం, నేర్చుకోవాలనే తపన నేటికీ మనకు ఆదర్శం.

తిరిగాప్పుల వివిల్లెన్ మూర్తి
8008577834

విశ్వామిత్రుడు - శ్రీరాముడు
(ఆజ్ఞాపాలనకు నిదర్శనం)

విశ్వామిత్రుడు తన యాగ సంరక్షణ కోసం దశరథుడి అనుమతి తీసుకుని రాముడిని తీసుకువెళ్తాడు. దారి పొడవునా విశ్వామిత్రుడు చెప్పే కథలను వింటూ, ఆయన నేర్పిన అస్త్రశస్త్ర విద్యలను నేర్చుకుంటూ రాముడు గొప్ప శిష్యుడిగా మెలిగాడు. గురువు ఆజ్ఞ మేరకు తాటకను సంహరించడం, యాగ రక్షణ చేయడం ద్వారా శిష్యుడికి ఉండాల్సిన బాధ్యతను రాముడు చాటిచెప్పాడు.

శ్రీకృష్ణుడు - సాందీపని మహర్షి
(వినయానికి నిదర్శనం)

సాక్షాత్తు భగవంతుడైన శ్రీకృష్ణుడు సకల విద్యలు తెలిసినవాడైనా, సాధారణ మానవుడిలా సాందీపని ఆశ్రమంలో విద్యాభ్యాసం చేశాడు. ఎంతటి గొప్ప వారైనా గురువు ముందు వినయంగా ఉండాలని, గురుసేవ చేయడం ద్వారానే విద్య సంపూర్ణమవుతుందని ఈ ఉదాహరణ నేర్పుతుంది. గురువు అడిగిన 'గురుదక్షిణ' (మరణించిన గురుపుత్రుడిని తిరిగి తీసుకురావడం) కోసం కృష్ణుడు ఎంతటి సాహసానికైనా సిద్ధపడతాడు.

ద్రోణాచార్యుడు - అర్జునుడు - ద్రుపదుడు

ద్రోణాచార్యుడికి అర్జునుడంటే అమితమైన ప్రేమ. అర్జునుడి ఏకాగ్రతను చూసి, అతడిని ప్రపంచంలోనే "అజేయ విలుకాడు"గా చేస్తానని ద్రోణుడు మాట ఇస్తాడు. విలువిద్య పూర్తి కావచ్చాక, ద్రోణుడు పాండవులను గురుదక్షిణగా 'పాంచాల రాజు ద్రుపదుడిని బంధించి తీసుకురమ్మని' కోరతాడు. ద్రుపదుడిని ఓడించడం కౌరవుల వల్ల కాదు. కానీ అర్జునుడు తన యుద్ధ నైపుణ్యంతో ద్రుపదుడిని బంధించి ద్రోణుడి పాదాల చెంత నిలబెడతాడు. ద్రోణుడు ద్రుపదుడిని అవమానించకుండా, తన పాత స్నేహాన్ని గుర్తు చేస్తూ.. ద్రుపదుడి రాజ్యంలో సగాన్ని (దక్షిణ పాంచాలం) తాను తీసుకుని, మిగిలిన సగాన్ని ద్రుపదుడికి తిరిగి ఇస్తాడు. ఈ అవమానాన్ని భరించలేని ద్రుపదుడు, ద్రోణుడిని చంపే కుమారుడు, అర్జునుడిని వివాహం చేసుకునే కుమార్తె కోసం 'పుత్రకామేష్టి' యజ్ఞం చేస్తాడు. అలా దృష్టద్యుమ్నుడు, ద్రౌపది జన్మిస్తారు. కురుక్షేత్ర సంగ్రామంలో ధర్మరాజు అబద్ధం (అశ్వత్థామ హతః) చెప్పిన సందర్భంలో ద్రోణుడు ఆయుధాలు త్యజించగా, దృష్టద్యుమ్నుడు ద్రోణుడి తలనరికి చంపుతాడు. ఒకరి అవమానం మరొకరికి పగగా, ఆ పగ శిష్యుడి ద్వారా ప్రతీకారంగా మారి.. చివరికి వంశాల వినాశనానికి దారితీసిన ఘట్టం ఇది.

ద్రోణాచార్యుడు - ఏకలవ్యుడు
(గురుభక్తికి నిదర్శనం)

ఏకలవ్యుడు ప్రత్యక్షంగా ద్రోణాచార్యుడి దగ్గర విద్యను అభ్యసించకపోయినా, ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించుకుని విద్యను నేర్చుకున్నాడు. గురువు పట్ల అచంచలమైన విశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఏకలవ్యుడు నిరూపించాడు. ద్రోణుడు, గురుదక్షిణగా ఆతని కుడిచేతి బొటనవేలును అడిగినా ఏ మాత్రం సంకోచించకుండా సమర్పించడం అతని నిస్వార్థ గురుభక్తికి నిదర్శనం.

పరశురాముడు- కర్ణుడు
(విద్య పట్ల తపనకు నిదర్శనం)

కర్ణుడు అబద్ధం చెప్పి విద్యను నేర్చుకున్నప్పటికీ, గురువు పట్ల అతను చూపిన సహనం అమోఘం. గురువు (పరశురాముడు) తన తొడపై తలపెట్టుకుని నిద్రిస్తున్నప్పుడు, ఒక కీటకం కర్ణుడి తొడను తొలుస్తున్నా గురువు నిద్ర చెడకూడదని ఆ నొప్పిని భరించిన ధీశాలి కర్ణుడు. ఇది గురువు పట్ల శిష్యుడికి

దిక్సూచి – గురుశిష్యుల బంధం

ఉండే సహనాన్ని, భక్తిని సూచిస్తుంది.

శుక్రాచార్యుడు- కచుడు

శుక్రాచార్యుడు–కచుడి కథ కేవలం గురుశిష్యుల బంధమే కాదు, అది వారి ధర్మనిరతికి నిలువుటద్దం. శుక్రాచార్యుడు రాక్షస గురువు. కచుడు తన శత్రువులైన దేవతల పక్షానికి చెందినవాడని, 'మృతసంజీవని' విద్యను తెలివిగా నేర్చుకోవడానికి వచ్చాడని తెలిసినా, ధర్మాన్ని అనుసరించి, కచుని శిష్యునిగా స్వీకరించాడు. ఆతని కులం లేదా జాతిని చూడకుండా విద్యాదానం చేయడం ఆయనలోని నిష్పాక్షిక ధర్మానికి నిదర్శనం. మృతసంజీవని విద్యను సాధించిన మొట్టమొదటి వ్యక్తి శుక్రాచార్యుడు (భృగు మహర్షి కుమారుడు). పరమశివుడిని మెప్పించి, ఘోరమైన తపస్సు చేసి ఈ విద్యను వరంగా పొందాడు. యుద్ధంలో మరణించే రాక్షసులను ఆయన ఈ విద్యతో తిరిగి బతికించేవాడు. దేవతలకు విజయం లభించడం కష్టమయ్యేది. శుక్రాచార్యుడు ఈ విద్యను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు, పరమశివుడు కొన్ని కఠిన నిబంధనలను కూడా విధించాడని పురాణాలు చెబుతాయి. ఇది కేవలం ధర్మబద్ధంగా, గురువు ద్వారా మాత్రమే నేర్చుకోవాలి. శరీరం పూర్తిగా నశించిపోకముందే (అంటే ఆత్మ శాశ్వతంగా విడిచిపోకముందే) ఈ మంత్రాన్ని ప్రయోగించాలి. కచుడు తన గురువు కడుపులో ఉండి కూడా ఈ మంత్రాన్ని గ్రహించడం ఒక విశేషం.

'మృతసంజీవని' అంటే కేవలం చనిపోయిన శరీరాన్ని బ్రతికించడం మాత్రమే కాదు. అజ్ఞానంలో ఉన్న మనిషిని జ్ఞానంతో చైతన్యవంతుడిని చేయడం, అంటే "మృత్యోర్మా అమృతంగమయ" (మృత్యువు నుండి అమరత్వానికి) నడిపించే విద్య అని కూడా అర్థం. కచుడు ఏళ్లపాటు ఎంతో నిష్టతో, వినయంతో గురుసేవ చేశాడు. శుక్రాచార్యుడు అతడిని తన సొంత కొడుకులా ప్రేమించి విద్యను బోధించాడు. కచుడు సంజీవని విద్య నేర్చుకుంటే తమకు ప్రమాదమని గ్రహించిన రాక్షసులు అతడిని చంపడానికి ప్రయత్నించారు. మొదటిసారి కచుడిని చంపి అడవిలో పడేశారు. శుక్రాచార్యుడు తన విద్యతో బ్రతికించాడు. రెండోసారి కచుడిని చంపి, కాల్చి, ఆ బూడిదను సముద్రంలో కలిపారు. శుక్రాచార్యుడు మళ్లీ బ్రతికించాడు. మూడోసారి రాక్షసులు అత్యంత క్రూరంగా ఆలోచించి, కచుడిని చంపి, కాల్చి, ఆ బూడిదను శుక్రాచార్యుడు తాగే 'సుర'లో కలిపారు. శుక్రాచార్యుడు తన జ్ఞాననేత్రంతో కచుడు తన కడుపులోనే ఉన్నాడని గ్రహించాడు. ఈ ధర్మసంకటంలో శుక్రాచార్యుడు ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నాడు. తన కడుపులో ఉన్న కచుడికి మృతసంజీవని మంత్రాన్ని ఉపదేశించాడు. గురువుగా విద్యను అతడికి ఉపదేశించి, తాను మరణించడానికి సిద్ధపడ్డాడు. శిష్యుడిని బతికించాలంటే గురువు చనిపోవాలి. తన ప్రాణం కంటే శిష్యుడికి ఇచ్చిన మాట (విద్య నేర్పడం) ముఖ్యం అని భావించాడు. కచుడు గురువు కడుపు చీల్చుకుని బయటకువచ్చి,తిరిగి అదే మంత్రంతో శుక్రాచార్యుని బతికించాడు.

కచుడు రెండు సందర్భాల్లో గొప్ప ధర్మనిరతిని కనబరిచాడు. విద్య నేర్చుకుని వెళ్లిపోకుండా, తనకు జన్మనిచ్చిన (గురువు కడుపులోంచి వచ్చాడు కాబట్టి) తండ్రిని కాపాడుకోవడం ద్వారా శిష్య ధర్మాన్ని నెరవేర్చాడు. విద్య పూర్తయ్యాక కచుడు వెనుతిరుగుతుంటే, శుక్రాచార్యుని కుమార్తె దేవయాని తనను వివాహం చేసుకోమని కోరుతుంది. 'గురువు కడుపులో పుట్టాను, కాబట్టి నువ్వు నాకు సోదరివి అవుతావు' అనడం అతని ధర్మనిరతికి పరాకాష్ఠ. అందుకే వీరిద్దరూ ఆదర్శ గురుశిష్యులుగా నిలిచిపోయారు.

సాంకేతికత ఎంత పెరిగినా మనిషికి సంస్కారం ముఖ్యం. గురువు తన ప్రవర్తన ద్వారా శిష్యుడికి ఆదర్శంగా నిలవాలి. శిష్యుడు కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండాలి. తాను నేర్చుకున్న విద్యను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగిస్తూ గురువు మార్గం చూపిస్తే, శిష్యుడు ఆ మార్గంలో పయనిస్తూ కొత్త శిఖరాలను అధిరోహించాలి. వీరిద్దరి మధ్య ఉండే నమ్మకమే రేపటి సమాజానికి పునాది.

సాంకేతికత - సమాచార విస్ఫోటనం

ఒకప్పుడు జ్ఞానానికి గురువే ఏకైక మూలం. కానీ నేడు గూగుల్, యూట్యూబ్ తదితర సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ' అన్నీ తెలుసు, గురువు అవసరం లేద'నే భావం శిష్యులలో పెరుగుతోంది.సమాచారం లభిస్తోంది కానీ, ఆ సమాచారాన్ని జ్ఞానంగా (Wisdom) మార్చుకునే పద్ధతిని నేర్పే గురువు విలువను విద్యార్థులు గుర్తించలేక పోతున్నారు. గురువులు విద్యార్థులను మందలించడానికి భయపడే పరిస్థితి ఉంది.

ఈ పరిస్థితి మారాలంటే...

కేవలం వ్యవస్థను నిందిస్తే సరిపోదు. మార్పు రెండు వైపుల నుండి రావాలి. పరీక్షల ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, బయట ప్రభావాలు – ఇవన్నీ పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపుతున్నాయి. అందుకే గురువులు విద్యార్థులతో కేవలం పాఠాలకే పరిమితం కాకుండా, వారి భావోద్వేగాలను అర్థం చేసుకునే మార్గదర్శకుగా మారాలి. గూగుల్ సమాచారాన్ని ఇస్తుంది కానీ, అనుభవాన్ని ఇవ్వదని శిష్యులు గ్రహించి గురువుకు తగిన గౌరవం ఇవ్వాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పనితీరులో అతిగా జోక్యం చేసుకోకుండా, గురుశిష్యుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధం ఏర్పడేలా సహకరించాలి. యాప్‌లు, ర్యాంకులు మాత్రమే కాకుండా, ప్రశాంత వాతావరణం కూడా ముఖ్యం. ★



మురికి ప్రజ లండన్‌వాసులా,

ఇంగ్లీషు సాహిత్య చరిత్రలో విక్టోరియన్ యుగానికి (1837-1901) ఓ ప్రత్యేకత ఉంది. పారిశ్రామిక విప్లవం, నగరాభివృద్ధి శాస్త్రం పురోగతి (డార్విన్ సిద్ధాంతం) సామాజిక సంస్కరణ, సామ్రాజ్యవాద విస్తరణ, వాస్తవికతావాదం (రియలిజమ్) ఈ యుగం ప్రత్యేకత. బ్రోంటే సోదరీమణులు షెర్లాట్, ఎమిలీ, చార్లెస్ డికెన్స్, జార్జ్ ఎలియట్, థామస్ హార్డీ, ఆల్ఫ్రెడ్ టెన్నిసన్, బ్రౌనింగ్ వంటి కవులు ఈ కాలంలోనే జన్మించారు. డార్విన్ మానవ పరిణామ సిద్ధాంతం ఈ యుగం ప్రత్యేకత. అయితే నగరీకరణ, అధిక జనాభా, మురికివాడలు, అసమానతలు, వ్యసనాలు, వ్యాధులు, (కలరా, మశూచి) అంటువ్యాధులు, వైద్య సదుపాయం కొరత, అకాల మరణాలు, అధిక సంతానం ఇలా ఎన్నో సమస్యలు ప్రజలను పీడించాయి. ముఖ్యంగా రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం దీనికి మినహాయింపు కాదు.

ఇంగ్లండ్ రాజధాని లండన్ నగరం గుండా ప్రవహించే పొడవైన(346 కిలో మీటర్లు) నది థేమ్స్. చారిత్రాత్మక లండన్ నగరాన్ని విభజిస్తూ ఉత్తర సముద్రంలో కలిసే ఈ నదిపై టవర్ బ్రిడ్జ్, వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్ వంటి అనేక చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయి. అయితే 1858లో (గ్రేట్ స్టింక్) అది గొప్ప దుర్వాసనలు వెదజల్లుతూ మురికి నీటి కాలువగా మారింది. ఆ దుర్గంధం భరించరానిదిగా ఉండడంతో, బ్రిటిష్ పార్లమెంటునే మూసివేయాలనే పరిస్థితి వచ్చింది. 1858 వేసవిలో మానవ మల విసర్జితాలు, పారిశ్రామికవ్యర్థాలు, చచ్చిన జంతువులు, గుర్రాలు వేసిన పేడ, నూనెలు నేరుగా నదిలో కలవడంతో, వేడి వాతావరణం కారణంగా అవి కుళ్లిపోయి, దుర్వాసనకు దారితీసింది. నది దగ్గరగా వెళితే ప్రజలు వాంతులు చేసుకునేవారు. గంటల్లోనే మరణించేవారు. 1848లో ఇంగ్లాండులో కలరా వ్యాధి 53,000 మంది ప్రాణాలను బలిగొంది దానిలో 14,137 మంది లండన్‌లోనే మరణించారు.

పార్లమెంటు సభ్యులు హాంకీలు పట్టుకొని పార్లమెంటులో తమ వాదనలు వినిపిస్తూ, అందరూ కలిసి విక్టోరియన్ మురిగినీటి వ్యవస్థకు నాంది పలికారు. దీనిపై ఎంతో సాహిత్యం వచ్చింది. లండన్‌వాసులు ఇప్పటికీ మురికిగా వున్న థేమ్స్‌నది నీటిని తాగడానికి, బట్టలు ఉతకడానికి ఉపయోగిస్తున్నారు.

కొత్త మురుగు నీటి కాలువకు నిధులు సమకూర్చేందుకు బెంజిమిన్ డిస్రేలీ ప్రతిపాదించిన బిల్లును ప్రభుత్వం హడావిడిగా ఆమోదించింది. ఈ బిల్లు కేవలం 18 రోజుల్లోనే చట్టంగా మారింది. "పట్టణం నడి బొడ్డున ఒక ప్రాణాంతకమైన మురుగు కాలువ మంచి తాజా నది స్థానంలో ప్రవహిస్తున్నది. ఫ్లషింగ్ టాయిలెట్ వాడకం బాగా ప్రాచుర్యం పొందడంతో పరిస్థితులు మరింత దిగజారి పోయాయి, సంపన్న కుటుంబాలవారు తమ మలం నేరుగా నదిలోనికి వదిలేసేవారు" అని చార్లెస్ డికెన్స్ 1850లో తన నవల "లిటిల్ డోరిట్"లో ఈ పరిస్థితిని వర్ణించాడు. గాలిలోని దుర్వాసన కలరా వంటి వ్యాధులు వ్యాప్తికి కారణమని ఆ సమయంలో చాలామంది విశ్వసించారు. ఈ నమ్మకాన్ని 'మియాస్మా సిద్ధాంతం' అని పిలుస్తారు. దాని సారాంశాన్ని ప్రొఫెసర్ బూత్ 1844లో "గొడ్డు మాంసం" వాసన పీల్చడం ద్వారా ఊబకాయం వస్తుందని, అలా ఒక కసాయి వాని భార్యకు వచ్చిందని రాశారు. ఇది శాస్త్రీయమైనది కాకపోయినా ప్రజలు నమ్మేవారు.

స్టిఫెన్ హాలిడే రాసిన "ది గ్రేట్ స్టింక్ ఆఫ్ లండన్"లో థేమ్స్ నదిలో పేరుకు పోయిన మురుగు నీరు, తద్వారా ఏర్పడి దుర్వాసన, ఆ సంక్షోభాన్ని పరిష్కరించడానికి చేసిన కృషిని ఇంజనీర్ జోసఫ్ బాజాల్గెట్ కథ వివరిస్తుంది. ఈ చారిత్రక సంఘటనను శానిటేషన్ విప్లవంగా వర్ణిస్తారు. కోలీన్ పేప్ రచించిన "ది గ్రేట్ స్టింక్" అనే పుస్తకంలో 9 అధ్యాయాలున్నాయి. ది గోల్డెన్ డస్ట్ మేన్, ఇన్‌గ్లోరియస్ మడ్, నైట్ సాయల్, రిమూవబుల్ కాజెస్, వైల్ బాడీస్, ది గ్రేట్ అన్‌వాష్, ది పబ్లిక్ కన్వీనియన్స్, రెచ్చడ్ హౌసేస్, ది వీల్ ఆఫ్ సూట్ అనే భాగాలుగా విభజించాడు.

1899లో ఇంగ్లండ్ వచ్చిన చైనా రాయబారిని 'లండన్ ఎలా ఉంది' అని ఒక జర్నలిస్ట్ ప్రశ్నించగా, "too dirty" అనడంతో ఈ నవల మొదలవుతుంది. మానవ మలాన్ని రాత్రిపూట సేకరించేవారు కాబట్టి దీనిని 'నైట్ సాయిల్' అని పిలుస్తారు. దీనిని వ్యవసాయంలో సేంద్రియ ఎరువుగా వాడేవారు. దీనిని సభ్యోక్తిగా చెప్పేవారు.

చాలావరకు వ్యాధులు కుళ్లిపోయిన వృక్ష సంపద, కుళ్లిన శవాలు, మురుగునీరు కారణంగా లండన్‌లో కలరా వ్యాధి సోకినట్లు ప్రొ॥ హెచ్.బూత్ 1844 జూలైలో ది బిల్డర్‌లో రాశారు. దీనిపై ఓ సుదీర్ఘ చర్చ జరిగింది. ఎడ్విన్ చాడ్విక్ 'రిపోర్టు ఆన్ ది శానిటరీ కండీషన్ ఆఫ్ ది లేబరింగ్ పాపులేషన్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్' (1800-1890)లో ఆవాసాల నుండి వచ్చే హానికరమైన వాసనలను తొలగించడానికి ఇంటి డ్రైనేజ్‌ని మెరుగువరచాలని వాదించాడు. చాడ్విక్, 'తాగునీటిని శుద్ధి చేయడం కంటే నివాసాల నుండి దుర్వాసనలను తొలగించడం చాలా ముఖ్యం' అని పార్లమెంటరీ కమిటీకి వివరించాడు. లండన్ వ్యర్థాల తొలగింపుకే ప్రాధాన్యం ఇచ్చాడు.

ప్రముఖ వైద్యుడు నీల్ ఆర్నాట్ (1788-1874) రాయల్ కమీషన్ ఫర్ ఎంక్వైరింగ్ ఇన్‌స్టేట్ ఆఫ్ లార్డ్స్‌లో మాట్లాడుతూ "ఆహారానికి ఉపయోగించే పదార్థాల కుళ్లిపోతున్న అవశేషాలు, మానవ శరీరాల నుండి వచ్చే మలినాలు ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా తయారవుతున్నాయని అన్నాడు. మురుగునీటి కాలువలపై నిర్మించిన ఇళ్ళున్న ప్రాంతాలలోనే ఈ వ్యాధులు ఎక్కువగా సోకుతున్నట్లు వివరించారు.

1858 వేసవిలో థేమ్స్ నదిని, దాని మురుగు నీటి సరుకును "గొప్ప దుర్వాసన" అని పిలిచే స్థితికి చేరుకుంది. జూన్ 18, 1858న వార్తాపత్రికలో

ఎవరు? భారతీయులా?

వచ్చిన "తీవ్రమైన వేడి మన శాసనసభ్యులను, నదికి ఎదురుగా గల వారి భవనాల నుండి తరిమికొట్టింది. కొంతమంది సభ్యులు ఈ విషయాన్ని దాని లోతుల వరకూ పరిశోధించడానికి మొగ్గుచూపారు. లైబ్రరీలోకి ప్రవేశించారు. కాని, వారు తక్షణమే వెనక్కి తగ్గారు. ప్రతీ ఒక్కరు ముక్కుకు రుమాలు కట్టుకున్నారు" అని వార్త రాశారు.

భారతీయులను అపరిశుభ్రమైన ప్రజలు (Dirty People) లేదా మృగతుల్యమైనవారు (Beastly people) అని వ్యాఖ్యానించిన ప్రముఖ బ్రిటిష్ ప్రధాని విన్సటన్ చర్చిల్ (I hate Indians they are with slit eyes and pig tails, they are beastly people with a beastly religion) నేను భారతీయులను అసహ్యించుకుంటాను. వారిది మృగతుల్యమైన మతం.. వారు మృగతుల్యమైన ప్రజలు. 1943లో బెంగాల్‌లో కరువు వచ్చిన సందర్భంలో సాయం కోసం అర్థించగా "భారతీయులు– కుందేళ్లులా పిల్లలను కంటున్నారు" (Breeding like rabbits) అని ఈసడించుకుని భారత్‌కు ఆహార సహాయాన్ని నిలిపివేశాడు. "భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తే అధికారం" తక్కువ స్థాయి వ్యక్తులు, పనికి రానివారి (Rascals, rogues and men of straw) చేతుల్లోనికి వెళ్తుందని కూడా విమర్శించారు. అలాగే నల్ల జాతివారు, తెల్లజాతి వారంతటి సమర్థులు, పనిమంతులు కాదు (the black people were not as capable or as efficient as white people) అని అభిప్రాయపడ్డాడు.

వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన బ్రిటిష్ ఈస్టు ఇండియా కంపెనీ ఇక్కడి సంస్థానాల అనైక్యతను, పాలకుల కలహాలను స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంది. ఆధునిక ఆయుధ పాటవంతోపాటు సంస్థానాలను ఒక్కొక్కటిగా జయిస్తూ సామ్రాజ్యాన్ని విస్తరించింది. బ్రిటిష్ పాలనలోని మూడు వ్యవస్థలు– సివిల్ సర్వీసు, సైన్యం, పోలీసు శాఖలలో కీలకమైన పదవులకు భారతీయులకు అవకాశం ఇవ్వలేదు, తద్వారా వలస దోపిడీలు నిరాటంకంగా కొనసాగించారు.

ఇండియన్ సివిల్ సర్వీసు చట్టం ద్వారా సివిల్ సర్వీసుల్లో భారతీయులను ప్రవేశించకుండా ఆంగ్లేయులు ఆ పోటీ పరీక్షలను ఇంగ్లండులో నిర్వహించడం, పరీక్షలకు వయోపరిమితిలో తరచూ హెచ్చుతగ్గులు చేయడంలాంటి అనేక అవరోధాలు సృష్టించారు. సైన్యం విషయంలో భారతీయ రాష్ట్రాలను మార్షల్, నాన్ మార్షల్ రాష్ట్రాలుగా విభజించి సైనిక ఉద్యోగాలకు ఆ రాష్ట్రాలవారినే ఎంపిక చేసేవారు. పైగా భారతీయులను సిపాయిలని, యూరోపియన్లను సోల్జర్స్ అని పిలిచేవారు. దానితోపాటు జీతభత్యాల వ్యత్యాసం ఉండేది.

ముఖ్యంగా పోలీసు విధులు జమీందారుల నిర్వహణ నుండి కారన్‌వాలీసు లాగేసుకున్నాడు. తద్వారా రెగ్యులర్ పోలీసు వ్యవస్థకు నాంది పలికి గ్రామాలకు ఠాణాలను, ఠాణాకు దరోగా (పోలీసు అధికారిని) అనే అధికారిని నియమించాడు. పోలీసు వ్యవస్థ బ్రిటిష్ సామ్రాజ్యాధికారులకు కొమ్ము కాస్తూ ఎక్కువగా భారతీయులను పీడించడమే పనిగా పెట్టుకుంది. స్వాతంత్ర్యోద్యమకారులను, స్వాతంత్ర్యోద్యమాన్ని కఠినంగా అణచి వేసేందుకు పోలీసు వ్యవస్థను ఒక పావుగా వాడుకుంది. బ్రిటిష్ ఇండియా చరిత్రలో పాలనావ్యవస్థకు మూల స్తంభాలైన సివిల్ సర్వీసు, పోలీసు, సైన్యం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలస విధానానికి అనుగుణంగా పనిచేశాయి.

భారత ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పారిశుద్ధ్య ఉద్యమాన్ని2014 అక్టోబరు 2న (గాంధీ జయంతినాడు) ప్రారంభించారు. 2019 నాటికి బహిరంగ మలవిసర్జన రహిత (Open defecation free ODF) భారత్‌ను చూడటం కోసం 12 కోట్ల కంటే ఎక్కువ మరుగు దొడ్ల నిర్మాణంతో దేశంలోని ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు పని ప్రారంభించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. స్వచ్ఛతా హి సేవా (పరిశుభ్రతే సేవ) అనే నినాదంతో ఈ కార్యక్రమం ముందుకెళ్తున్నది.

ప్రతీరోజు స్నానం చేయడం, చేతులు కడుక్కోవడం ప్రాచీన భారతదేశం, శాస్త్రాలలో నొక్కి చెప్పిన విషయాలు. శౌచ్యము అంటే వ్యర్థాల నిర్వహణ. దీని గురించి కౌటిల్యుని అర్థశాస్త్రం పేర్కొన్నది. భగవత్ గీత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఇది ఒక దైవిక గుణంగానూ, తపస్సు రూపంగానూ కనిపిస్తుంది. "శౌచం స్థైర్యమాత్మ వినిగ్రహః" (13.8 నుండి) శుచిత్వమునకు గీతాచార్యుడు ఎక్కువ ప్రాముఖ్యత నొసంగుచున్నాడు. బాహ్యాభ్యంతర శౌచము ముముక్షువుల కత్యావశ్య కము. బయట గల మురికి, లోపల (చిత్తమును) గల మురికి రెండింటిని కడిగి వేయవలెను.

ఆరోగ్యకరమైన జీవనశైలికి వ్యక్తిగత పరిశుభ్రత మొదటిమెట్టు. స్నానం చేయడం, వళ్లు తోముకోవడం, చేతులు కడుక్కోవడం, శుభ్రమైన బట్టలు వేసుకోవడం వంటి రోజువారీ అలవాట్లు అనారోగ్యాలను, ఇన్‌ఫెక్షన్‌లను నివారిస్తాయి. మనం శుభ్రంగా ఉన్నప్పుడు మనలో ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ , గౌరవం ఏర్పడతాయి.

మన పరిసరాలను, అంటే ఇళ్లు, పాఠశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యం. శుభ్రమైన వాతావరణం కీటకాలు, వ్యాధులను నివారించి ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది, కాబట్టే పరిశుభ్రతను దైవత్వంతో సమానమని శాస్త్రాలు చెపుతున్నాయి. భారతదేశం దీనిని సనాతన కాలం నుండి అనుసరిస్తూ ఆరోగ్య భారతాన్ని ఇచ్చింది.

హరప్పా (సింధులోయ) నాగరికతలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు ప్రాధాన్యం ఇచ్చారు. సుమారు 4000 సంవత్సరాల నాడే పరిశుభ్రతకు పట్టణ ప్రణాళికలు ఎంతటి ప్రాముఖ్యత ఇచ్చాయో ఇది తెలియజేస్తుంది. కాలువలను శుభ్రం చేయడానికి మేన్‌హోల్స్‌ను కట్టారు. ఈ డ్రైనేజీకి కాల్చిన ఇటుకలు, జిప్సం వాడారు. ప్రతీ ఇంటి కాలువను వీధిలోని ప్రధాన కాలువకు అనుసంధానించారు. ఇళ్లలో చిన్న సంపులుండి ఘనవ్యర్థాలు అక్కడే నిలిచిపోయి, నీళ్లు మాత్రమే కాలువల్లో వెళ్లేలాగా ఏర్పాటు చేశారు. ఈ డ్రైనేజీ వ్యవస్థ హరప్పా ప్రజలకు పరిశుభ్రత పట్ల ఉన్న అవగాహనను, వారి ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని తెలియజేస్తుంది.

డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

జోజీలాతో కశ్మీర్‌కు

జమ్ము-కశ్మీర్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలను పునరుద్ధరించడం, ఉగ్రవాదులను ఏరివేయడం, శాంతిభద్రతలను నెలకొల్పడంతో పాటు, యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. కశ్మీర్ అభివృద్ధికి ముఖ్యంగా విద్యుత్తు, తాగునీరు, రోడ్లు, భవనాల నిర్మాణాల వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంది. ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులకు సుమారు రూ. లక్ష కోట్లు కేటాయించిందంటే కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. చలికాలంలో మంచు పడడం, వర్షాకాలంలో మట్టిపెళ్లలు, కొండ చరియలు విరిగిపడడం వల్ల కశ్మీర్, లద్దాక్, కార్గిల్ ప్రాంతాలకు మధ్య రోడ్డు మార్గం పూర్తిగా స్తంభించిపోతుండటంతో రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో కేంద్రం పర్వతశ్రేణుల మధ్య 31 సొరంగాల నిర్మాణానికి నడుం బిగించింది. ఇప్పటికే సోనేమార్గ్ సహా అనేక సొరంగ నిర్మాణాలు పూర్తి కాగా, జోజీలా సహా మరిన్ని సొరంగ నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన,అతి పెద్ద బహుళ రహదారులతో నిర్మిస్తున్న జోజీలా సొరంగ (కనుమ) మార్గం అతి త్వరలో పూర్తికానుంది. నిజానికి ఇది కొద్ది కాలం క్రితమే వినియోగంలోకి వచ్చింది. జమ్ము-కశ్మీర్‌లోని గందర్బల్ జిల్లాలోని సోనేమార్గ్-లద్దాక్‌లోని కార్గిల్ జిల్లాలోని డ్రాస్ ప్రాంతాల మధ్య ఈ సొరంగ మార్గం నిర్మిత మవుతోంది. హైదరాబాద్ నగరానికి చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎం.ఇ.ఐ.ఎల్) ఇంజనీరింగ్ కంపెనీ దీని నిర్మాణం చేపట్టింది. ఈ సొరంగ మార్గం వెడల్పు 9.5 మీటర్లు కాగా, 7.57 మీటర్ల ఎత్తులో ఉంటుంది. గుర్రపు డెక్క ఆకారంలో సుమారు 14 కిలోమీటర్ల పొడవున్న ఈ సొరంగం సముద్ర మట్టానికి 11, 578 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ మార్గంలో అతి తేలికగా రాకపోకలు సాగించడానికి వీలుగా రెండు రోడ్లు వేశారు.

దీని పక్కనే జెడ్-మోర్ సొరంగ మార్గం కూడా నిర్మాణమవుతోంది. ఈ రెండు సొరంగాల నిర్మాణం పూర్తయ్యే పక్షంలో ఎటువంటి వాతావరణంలోనైనా లద్దాక్, బైతాల్‌ల మధ్య తేలికగా రాకపోకలు సాగించ వచ్చు. ఇది శ్రీనగర్-లహ్ జాతీయ రహదారి మీద ఉంది. అమర్నాథ్ గుహ వరకు సురక్షితంగా ప్రయాణించేందుకు కూడా వీలుంటుంది. లద్దాక్, అమర్నాథ్ గుహ మధ్య ప్రయాణానికి పట్టే గంటన్నర సమయం, పదిహేను నిమిషాలకు తగ్గిపోయింది. పర్యాటక రంగం మరింత పురోగతి సాధించడానికి మార్గం సుగమం అయింది. లద్దాక్ ఆర్థిక వ్యవస్థ కూడా బాగా మెరుగుపడుతుంది. అంతే కాదు, ఇది చైనా, పాకిస్థాన్ దేశాలకు సరిహద్దు ప్రాంతమైనందువల్ల భారత సైనికులు, సైనిక శకటాలు తేలికగా రాకపోకలు సాగించడానికి కూడా అవకాశం కలిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2018 మేలో ఈ నిర్మాణ కార్యక్రమానికి భూమి పూజ చేశారు. ఏడేళ్లలో పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ మధ్యలో కోవిడ్ కారణంగా ఇక్కడి నిర్మాణ కార్యక్రమాలకు బ్రేక్ పడింది.

జి.రాజశేఖ
సీనియర్ జర్నలిస్ట్

సొరంగం ఉపయోగాలు

ఈ జోజీలా సొరంగ నిర్మాణం పూర్తయితే, శ్రీనగర్, లద్దాక్‌ల మధ్య ప్రయాణ సమయం బాగా తగ్గుతుంది. సురక్షితంగా ప్రయాణం సాగించడానికి కూడా అవకాశం ఉంటుంది. ఎటువంటి వాతావరణంలోనైనా ప్రయాణం చేయడానికి వీలు కలుగుతుంది. సోనేమార్గ్, మీనామార్గ్‌ల మధ్య ప్రయాణ సమయం కూడా నాలుగు గంటల నుంచి నలభై నిమిషాలకు తగ్గిపోతుందని భావిస్తున్నారు. శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిలో సుమారు 12 వేల అడుగుల ఎత్తున గల జోజీలా కనుమ నవంబర్-మధ్యకాలంలో (ఏడాదిలో ఏడు నెలలు) మూతపడి ఉండేది. ఈ మార్గంలో హిమపాతం, కొండ చరియలు విరిగిపడడం కారణంగా మూసేయడంతో కొన్ని ప్రాంతాలకు మిగిలిన ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడం వంటివి జరుగుతుండేవి. జోజీలా సొరంగ నిర్మాణంతో ఇప్పుడు ఈ సమస్యలన్నీ తొలగిపోతాయి. ఏడాది పొడవునా, ఎలాంటి వాతా వరణంలోనైనా ఇక్కడ రాకపోకలు సాగించడానికి అవకాశం కలిగింది. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 8,038 కోట్ల రూపాయలు ఖర్చు కాగలదని అంచనా వేసింది. 2028 ఫిబ్రవరి నాటికి ఈ సొరంగ నిర్మాణం పూర్తి స్థాయిలో వినియోగం లోకి వచ్చే అవకాశం ఉంది.

ఈ జోజీలా కనుమ ప్రాంతం వాస్తవాధీన రేఖకు దగ్గరగా ఉండడం, జాతీయ భద్రతకు ముప్పు కలిగే అవకాశం ఉన్నందువల్ల ఈ సొరంగ మార్గ నిర్మాణం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. సైనికులు తిరగడానికి, ప్రజలు తమ రోజువారీ కార్యకలాపాలు సురక్షితంగా, సౌకర్యవంతంగా సాగించడానికి ఇది చక్కటి అవకాశం కల్పిస్తుంది. సుమారు 1948 ప్రాంతంలో దీన్ని పాకిస్థాన్ సైనికుల నుంచి కాపాడుకోవాల్సి వచ్చింది. కార్గిల్ ప్రాంతానికి ఆహార పదార్థాలను, ఆయుధాలను సరఫరా చేయడానికి, సైనికులు రాకపోకలు సాగించడానికి ఇదివరకు ఏడాదిలో ఎక్కువ కాలం అవకాశం ఉండేది కాదు.

కార్గిల్ ప్రాంతానికి కొత్త దశ

సరిహద్దు ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోంది. సరిహద్దుల్లో మారుమూల ప్రాంతాల్లో ఉన్న పట్టణాలు, గ్రామాలను మిగిలిన భారత దేశంతో అనుసంధానం చేసి, సంస్కృతిని, నాగరికతను ప్రోత్సహించాలని కేంద్రం భావిస్తోంది. ఇటీవలే ప్రారంభోత్సవం జరిగిన సోనేమార్గ్, నిర్మాణంలో ఉన్న జోజీలా సొరంగ నిర్మాణాల వల్ల లద్దాక్, సోనేమార్గ్, మీనామార్గ్ వంటి ప్రాంతాలు ఆర్థికంగా



కొత్త జోష్!

బాగా అభివృద్ధి చెందే అవకాశం కూడా ఉంది. సరిహద్దులో రక్షణ వ్యవస్థలు మరింత మెరుగుపడడానికి కూడా అవకాశం ఉంది. ఒక్క వేసవి కాలంలో తప్ప శీతకాలం, వర్షాకాలాల్లో ఈ ప్రాంతాలకు వెళ్లడం చాలా కష్టమైన వ్యవహారం. ఈ ప్రాంతంతో కమ్యూనికేషన్ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతోంది. నిర్మాణ సమయంలో కూడా కొండ చరియలు విరిగిపడడం, మంచు కురవడం వంటివి ఎదురవుతున్నా, సిబ్బంది ప్రాణాలకు లెక్క చేయకుండా ఈ నిర్మాణ పనులను కొనసాగిస్తోంది. సుమారు ఎనభై శాతం నిర్మాణం పూర్తయినందువల్ల ఈ సొరంగ మార్గంలో రాకపోకలు ప్రారంభం అయ్యాయి.

లద్దాక్, కార్గిల్, సోనేమార్గ్, మీనామార్గ్, బైతాల్ ప్రాంత ప్రజలు వాతావరణంలో చోటు చేసుకుంటున్న ఒడుదొడుకులు, హెచ్చుతగ్గుల వల్ల నానా అవస్థలూ పడుతున్నారు. ఏడాదిలో సుమారు ఏడు నెలల పాటు ఆహార ధాన్యాల సరఫరాకు అవకాశం ఉండదు. పేదరికం వల్ల, సరైన వసతి సౌకర్యం లేకపోవడం వల్ల ఆహార ధాన్యాలను నిల్వ చేసుకోవడం వారికి సాధ్యపడడం లేదు. జోజీలా, జెడ్–మోర్ సొరంగాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఏడాది పొడవునా ఆహార ధాన్యాలు సరఫరా అయ్యే అవకాశం ఉంది. ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి వివిధ రకాల వాహనాల సౌకర్యం ఏర్పడుతుంది. అంతేకాదు, ప్రభుత్వం వీరికి నిత్యావసర వస్తువుల సరఫరాను పెద్ద ఎత్తున చేపట్టబోతోంది. ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది.

కాగా, ఈ జోజిలా సొరంగ మార్గాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులు, పర్యాటకులు ఒక ఇంజనీరింగ్ అద్భుతంగా అభివర్ణిస్తున్నారు. పర్వత సానువుల్లో, సముద్ర మట్టానికి ఎంతో ఎత్తులో, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో, మిగిలిన భారతదేశంతో సంబంధం లేకుండా ఉన్న ఈ సొరంగ నిర్మాణాన్ని అతి తక్కువ కాలంలో నిర్మించడం ఆషామాషీ వ్యవహారం కాదని ఆ ప్రాంతాన్ని సందర్శించిన వారెవరికైనా తేలికగా అర్థమైపోతుంది. దేశానికి ఒక రక్షణ కవచంగా పని చేయడమే కాక, ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఈ సొరంగం జమ్మూ–కాశ్మీర్, లద్దాక్‌ల ఆర్థిక, పర్యాటక ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది. నిజానికి, కార్గిల్ జిల్లాలో ఇప్పటికే పండుగ వాతావరణం నెలకొని ఉంది. ★

వలసవాద జ్ఞాపకాలకు స్వస్తి

మన దేశంలోని వలసవాద పాలన కాలపు జ్ఞాపకాలను తొలగించే జాతీయ కార్యాచరణలో భాగంగా మన దేశ సార్వభౌమాధికారం కోసం ప్రాణాలు అర్పించిన జాతీయ నాయకులు, దేశ గమనాన్ని మార్చిన మహనీయులు, వీర జవాన్ల పేర్లను పలు మార్గాలకు పెడుతూ వివిధ రాష్ట్రాలలో తీసుకుంటున్న నిర్ణయాలు ఆహ్వానించదగినవి. ఇప్పటివరకూ, తప్పుడు చరిత్రను చదువుతూ, నిజమైన దేశభక్తులను, నాయకులను, జవాన్లను విస్మరించాం. ఈ రకంగా అయినా మన అసలైన చరిత్ర తెలుసుకునే అవకాశం నేటి, రానున్న తరాలకు లభిస్తుంది.

కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ నగరంలోని సుహ్రావర్ది పేరుతో ఉన్న మార్గం పేరు మార్చి డైరెక్ట్ యాక్షన్ డేలో వేలాది హిందువులను ఒంటిచేత్తో కాపాడిన గోపాల్ ముఖర్జీ పేరుపెడుతున్నట్టుగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇక, కంటోన్మెంట్ పరిధిలో ఉన్న బ్రిటిష్ కాలం నాటి 21 రోడ్లు, నాలుగు బజార్ల పేర్లను మారుస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు (రాజధీ) తీసుకున్న నిర్ణయానికి బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారిక ఆమోదం లభించింది.

వీర జవాన్ల స్మృత్యర్థం మారిన మార్గాల పేర్లు

దేశ రక్షణ కోసం అత్యున్నత త్యాగాలు చేసిన అమరవీరుల గౌరవార్థం కీలక రోడ్ల పేర్లను మార్చారు. కార్గిల్ యుద్ధ వీరుడు కెప్టెన్ విక్రమ్ బాత్రా పేరును పూర్వపు 'వెల్లింగ్టన్ రోడ్డు'కు (విక్రమ్ బాత్రా మార్గ్) పెట్టారు. గల్వాన్ లోయ ఘర్షణలో వీరమరణం పొందిన తెలంగాణ అధికారి కల్నల్ సంతోష్ బాబు పేరును 'బర్టన్ రోడ్డు'కు (సంతోష్ బాబు రోడ్డు) ఖరారు చేశారు. ఇక ముంబై ఉగ్రవాద దాడుల్లో అమరుడైన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ పేరును 'రిచర్డ్‌సన్ రోడ్డు'కు (ఉన్నికృష్ణన్ మార్గ్) నామకరణం చేశారు. భారత సైన్యంలో మొదటి పరమవీర చక్ర గ్రహీత మేజర్ సోమనాథ్ శర్మ పేరును 'గఫ్ రోడ్డు'కు (సోమనాథ్ శర్మ మార్గ్) కేటాయించారు.

జాతీయ నాయకులు, మహనీయుల పేరిట మార్గాలు

వలస పాలకుల పేర్ల స్థానంలో భారత గమనాన్ని మార్చిన అమరవీరులు, జాతీయ చిహ్నాలు, ప్రముఖ వ్యక్తుల పేర్లను బోర్డు ఖరారు చేసింది. 'బోల్టన్ రోడ్డు'ను మాజీ ప్రధానమంత్రి గౌరవార్థం అటల్ బిహారీ వాజ్‌పేయి రోడ్డుగా మార్చారు. 'నోబెల్ రోడ్డు'కు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డు అని పేరు పెట్టారు. 'లిట్టన్ రోడ్డు' ఇకపై నేతాజీ సుభాష్ చంద్రబోస్ రోడ్డుగా, 'కార్న్‌వాలిస్ రోడ్డు' రూపాంతరం చెంది స్వామి వివేకానంద మార్గ్‌గా ఇకపై చెలామణిలోకి రానున్నాయి. 'బైమ్ రోడ్డు'ను పరమహంస మార్గ్‌గాను, 'ఎంప్రెస్ రోడ్డు'ను వీరనారుల గౌరవార్థం "వీరనారి" మార్గ్‌గా మార్చారు.

సైనిక వారసత్వం ప్రతిబింబించేలా బజార్ల పేర్లు

రోడ్లతో పాటు కంటోన్మెంట్ పరిధిలోని నాలుగు బజార్ ప్రాంతాల పేర్లను కూడా సైనిక వైభవాన్ని, స్థానిక గుర్తింపును ప్రతిబింబించేలా మార్చారు. ఇక '108 బజార్'ను ఇకపై ఇన్‌ఫాంట్రీ బజార్‌గా పిలుస్తారు.'ఆర్ఏ పెన్షనర్స్ లైన్స్' పేరును ఆర్టిలరీ పెన్షనర్స్ లైన్స్‌గా మార్చారు. 'బేరర్స్ లైన్స్' ప్రాంతానికి కర్తవ్య మార్గ్ అని, 'హేర్ రోడ్డు'కు తాడ్‌బండ్ టెంపుల్ రోడ్డు అని మార్చారు. కొత్త పేర్లతో కూడిన బోర్డులను నెల రోజుల్లోగా ఏర్పాటు చేయనున్నారు.

విలక్షణమైన వ్యక్తిత్వం

ఉదయం నిద్రలేచిన తర్వాత ప్రాతఃవిధులు, ఏకాత్మతాస్తోత్రము, సమావేశాలు, కార్యకర్తలతో మాట్లాడుట, మధ్యాహ్న భోజనము అయిన తర్వాత సోమయ్యగారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేవారు. ఆ సమయంలో తప్ప జీవితంలో ఏ రోజు వారు నడుము వాల్చలేదు. ఎవరైనా కాలాంశము మధ్యలో నడుముువాలిస్తే అది అత్యంత దరిద్ర గుణము అని చెప్పేవారు. నడుము నిటారుగా ఉండేది. సంఘ శిక్షావర్గలో, అన్ని సమావేశాలలో వారు కిందనే కూర్చునేవారు.

చాలామందికి సోమయ్యగారంటే గంభీరంగా ఉంటారని కొద్దిగా భయంగా ఉండేది. కారణం, వారు నిక్కచ్చిగ ఉండేవారు. అనుశాసన పాలనలో చాలా గట్టిగా ఉండేవారు. కానీ వారి మనస్సు వెన్నలాంటిది. ఇది నా జీవితాంతము అనుభవము వారితో. పరిస్థితిని గురించి కార్యక్షేత్రము గురించి కార్యకర్తల గురించి వారు చాలా ప్రశాంతంగా ఓపికగా వినేవారు. శ్రద్ధగా వినేవారు. అది వారి ప్రత్యేకత. మనం మాట్లాడుతుంటే మధ్యలో తాను ఎన్నడూ మాట్లాడేవారు కాదు. అందువల్ల వారి దగ్గర పూర్తి సమాచారం ఉండేది.

సమావేశాలు – కార్యకర్తలకు మార్గదర్శనం

శాఖల విస్తరణ విషయంలో కార్యకర్తలు సంఖ్య ఉత్సాహంగా చెప్పేవారు. తర్వాత సోమయ్యగారు అడిగేవారు; ఈ లక్ష్యము ఎలా సాధిస్తారు? ఇప్పుడు 30 శాఖలు 50 చేస్తామని చెప్పేవారు; ఎలా ఆధార మేమిటి? అని అడిగేవారు సోమయ్యగారు. అప్పుడు వారు చెప్పు, "మీ దగ్గర ఎంతమంది పనిచేసే కార్యకర్తలున్నారు? వారి సామర్థ్యమెంత? వారు ఎంత సమయం ఇవ్వగలుగుతారు? కష్టపడే గుణము ఉందా? అందరితో వ్యక్తిగతంగా మాట్లాడారా? అన్ని కలిపి ఆలోచించి లక్ష్యం నిర్ణయం చేస్తే సాధారణంగా చేరుకోగలుగుతారు అని వివరించేవారు.

ఆ రోజులలో యువ కార్యకర్తలతో రెండు రోజులపాటు సోమయ్యగారు ప్రశాంతంగా గడిపేవారు. ఆ రెండు రోజులు ఎంతో లోతుగా సకారాత్మకముగా, సిద్ధాంతపరంగా, కార్యపద్ధతి పరంగా చర్చలు జరిగేవి. ఆవేశానికి లోనుకాకుండా చాలా ప్రబోధాత్మకంగా జరిగేవి. స్వయంసేవకత్వం కార్యకర్త గుణగణములు, జీవితానికి లక్ష్య నిర్ణయం, అన్ని ఆలోచించి నిర్ణయించుకోవాలని మార్గదర్శనం లభించేది. మూఢనమ్మకాలు ఉండగూడదు కదా అని ఒక కార్యకర్త ప్రశ్న అడిగితే సోమయ్యగారు, మూఢనమ్మకం మంచిది కాదు కానీ సరియైన దాని మీద నమ్మకము లేకపోతే ప్రమాదమే అన్నారు అంతే. బాగా ప్రభావము చూపింది. ఖాళీ సమయంలో యువ కార్యకర్తలతో వారు తీరిగ్గా మాట్లాడేవారు. అందువల్ల ఆనాటి యువ కార్యకర్తలలో మంచి అవగాహన ఏర్పడేది.

ప్రముఖులపై ప్రభావం

విశాఖపట్నంలో ఊటి హోటల్‌లో పెద్దల సమావేశం జరిగినది. ప్రపంచ ప్రఖ్యాతులైన డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు, డాక్టర్ బ్రహ్మయ్య శాస్త్రి లాంటి పెద్దలు అందులో పాల్గొన్నారు.

సంఘ జాతీయతా సంస్కృతి ఆధారముగా సమాజ సంఘటన చేస్తున్నదని సోమయ్యగారు వివరంగా చెప్పారు. అందరు ప్రభావితులయ్యారు. ప్రొఫెసర్ బ్రహ్మయ్య శాస్త్రి గాంధీజీ విషయంలో సంఘ దృష్టికోణం అడుగుతూ మొత్తము మీద సంఘం గాంధీజీని సరిగ్గా గౌరవించదేమో అని ప్రశ్నించారు. సోమయ్యగారు సమాధానం చెప్పూ, పూజ్యులు గాంధీజీ శ్రేష్ఠమైన హిందువు. సత్యము, అహింసా వ్రతమును జీవితాంతము పాటించినవారు, మద్యపాన నిషేధము కావాలన్నారు, గోవధ నిషేధము చట్టము చేయాలన్నారు. హింద్ స్వరాజ్య పుస్తకములో మన దేశము వ్యవసాయము ఆధారంగా గ్రామములు కేంద్రముగా అభివృద్ధి జరగాలన్నారు. స్వదేశీ చింతన కలవారు. వారు మనందరికీ ఆదర్శం అని సంఘం భావిస్తోంది. రాజకీయ ఆలోచనలలో వారి దృష్టి– దానివలన కలిగిన, కలుగబోయే ఫలితాలకు చరిత్రయే సాక్ష్యం. రాజకీయ ఆలోచనల్లో అభిప్రాయభేదమున్నంత మాత్రాన మహాపురుషుల విషయములో శ్రద్ధ తగ్గరాదు. అందువల్లనే సంఘము పూజ్యులు గాంధీజీ పేరు ప్రాతఃస్మరణలో ఉంచింది. ప్రతిరోజు స్వయంసేవకులు స్మరిస్తుంటారు. స్వరాజ్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్‌ని రద్దుచేయ మన్నారు గాంధీజీ. స్వరాజ్యము కొరకు అందరు పనిచేశారు. కాంగ్రెస్‌ని రద్దుచేసి తమకిష్టమైన రాజకీయ పక్షము ఏర్పాటు చేసుకొని ఎన్నికలలో పోటీ చేయవచ్చని గాంధీజీ సూచించారు. కాంగ్రెస్‌వారు వినలేదు. అది వేరే సంగతి అని సమాధానము చెప్పగానే పెద్దలందరూ పూర్తిగా ప్రభావితులయ్యారు.

ఆ తర్వాత డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు వివేకానంద మెడికల్ ట్రస్ట్‌కి అధ్యక్షులయ్యారు. వారు జీవితాంతము సంఘ కార్యక్రమాలలో పాల్గొన్నారు. మిగతా పెద్దలంతా కూడా అలానే సంఘానికి దగ్గరయ్యారు.

విజయవాడలో శిబిరం నమారోవ్‌లో సోమయ్యగారు మాట్లాడారు. అనేకమంది ప్రొఫెసర్లు, పెద్దలు వచ్చారు. సోమయ్యగారు ఏ యూనివర్సిటీలో ప్రొఫెసర్ అని అడిగారు పెద్దలంతా. ఎందుకంటే సోమయ్యగారు దేశ చరిత్ర, హిందూ సంఘటన విషయమై మాట్లాడారు.

వారు నిలబడి మాట్లాడుతుంటే గంగా ప్రవాహమే. చేతులు ఊపుట, హావభావాలు ఏమి ఉండవు. ప్రశాంతంగా మాట్లాడేవారు. ఒక్కొక్క శబ్దము తూచి తూచి వాడేవారు. పూర్తిగా తెలుగులోనే మాట్లాడేవారు. మనము ఆంగ్ల భాషకు వ్యతిరేకం కాదు కానీ ఆంగ్లభాషకు బానిసలం కాకూడదు అని చెప్పేవారు. వారు స్వయంగా మామూలుగా మాట్లాడే సందర్భములోను ఉపన్యాసములోను స్వచ్ఛమైన తెలుగులోనే మాట్లాడిన మహాసాధకులు వారు.

దూరదృష్టి– వివిధ సంస్థల నిర్మాణం

1970లో అప్జల్‌గంజ్ కార్యాలయములో మండల కార్యవాహల సమావేశము వారు తీసుకున్నారు. రాబోయే 20సంవత్సరాలలో సంఘ కార్యానికి సమాజము పూర్తి మద్దతు ఇస్తుంది. అందరూ సంఘ కార్యకర్తలు కావాలని అడుగుతారు. మంచి హెడ్మాస్టర్, మంచి డాక్టర్, యోగ్యమైన ప్రాజెక్ట్ మేనేజర్ కావాలంటారు. అప్పుడు మనము ఇవ్వ గలగాలి. అందుకని కార్యకర్తల నిర్మాణము జరగాలి అన్నారు. 1990 తర్వాత అదే పరిస్థితి వచ్చింది కదా!

1971లో విశాఖ భారతీయ విద్యా కేంద్రములో జూనియర్ కళాశాల ప్రారంభమునకై చర్చ జరిగినది. ప్రభుత్వము వారే మన సంస్థ వారిని పిలిచి కాలేజీ పెట్టమన్నారు. మన సంఘ పెద్దలు పెట్టాలా వద్దా అని సంకోచిస్తున్న సమయంలో సోమయ్యగారు పెడితేనే బాగుంటుందని సలహా ఇచ్చారు. ఇప్పుడది పిజి కోర్స్ కూడా నిర్వహిస్తోంది.

విశాఖలో వివేకానంద మెడికల్ ట్రస్ట్ వైద్యశాల కూడా వారి అనుమతి, ప్రోత్సాహముతోనే ప్రారంభమై ఈ రోజు ఒక ఉన్నతమైన ఆసుపత్రిగా సేవలందిస్తున్నది.

అత్యవసర పరిస్థితి తర్వాత ఒక ఆవాస విద్యాలయం ప్రారంభిస్తే బాగుంటుందని విశాఖలోని

పిళ్లారామారావు, శివప్రసాద్‌రావు సోమయ్య గారితో ప్రస్తావించారు. తప్పకుండా ప్రారంభించాలని చాలా వివరంగా సోమయ్యగారు చర్చించారు.

ప్రతిభాసంపన్నులు

గణితం, వాస్తు నిర్మాణం, వ్యవస్థా, తెలుగుభాష, చరిత్రలలో వారు ఎంతో ప్రతిభ గలవారు. ప్రాంతంలోని విభాగ్ ప్రచారకులకు సంవత్సరానికి ఒకసారి సంఘ జమా ఖర్చుల విషయంలో రెండు సమావేశములు జరిగేవి. సోమయ్యగారు పూర్తిగా ఉండేవారు. ఒక్కొక్క విభాగ్ ప్రచారకుని పిలిచి పత్రములు చూసేవారు. నేను కూడా లెక్కలలో బియస్సీ చదివానని పిసరంత అహంకారము నాకు ఉండేది. సోమయ్యగారి పెన్సిల్‌తో కూడికలు సరి చూసేవారు. 5 ని.లలో 10 చోట్ల తప్పులు గమనించి పెన్సిల్‌తో సున్నా పెట్టేవారు. నవ్వుతూ స్నానము చేసారా అని అడిగేవారు. ఇంకా లేదండి అంటే స్నానము చేసి మళ్లీ కూడికలు పూర్తి చేయ్యమనేవారు. ప్రశాంతంగా శ్రద్ధతో పూర్తి చేయమని చెప్పేవారు. తర్వాత ఏ తప్పులు లేకుండా పూర్తి చేసేవారము.

ఒక స్థలము నుండి ఇంకొక స్థలమునకు ఎంత సమయము పడుతుంది అని అడిగేవారు. అరగంట లేదా గంట అని చెప్పగానే దూరం ఎంత అని అడిగేవారు. మాకు ఖచ్చితంగా తెలిసేది కాదు. దూరము మైళ్లలో లేదా కిలోమీటర్లలో ఖచ్చితంగా తెలుసుకోవాలని నేర్పారు. ఒకసారి సమయం విషయంలో చెప్పిన విధంగా జరుగకపోతే వారికి చాలా బాధ వేసేది.

వారి తల్లిగారు తెనాలిలో ఒక్కరే నివసిస్తూ ఉండేవారు. అమ్మ ఒక కర్రల అడితి నడిపేవారు. అమ్మ చాలా స్వాభిమానం కలవారు. మమ్మల్ని ఎంతో ప్రేమతో చూసేవారు. సంవత్సరంలో ఒక్కసారి సోమయ్యగారు విజయవాడ నుండి వెళ్లివచ్చేవారు. అన్నవరపు మాణిక్యాలరావు, సోమయ్యగారి సహాధ్యాయి. సంఘ స్వయంసేవక్. అమ్మ వ్యవహారాలు చూస్తుండేవారు. అమ్మ జలోదరము వ్యాధితో చాలా బాధపడ్డారు. చివరికి అంతిమశ్వాస విడిచేముందు సోమయ్యగారికి మాణిక్యాలరావు ద్వారా తాను కూడబెట్టిన కొంత డబ్బుని ఇమ్మని చెప్పినది. ఒక లక్ష రూపాయలు సోమయ్యగారు నూతక్కి స్కూల్‌కి సమర్పించారు. జీవితాంతము వారి ప్రేమని, ఆత్మీయతను పొందడం నా అదృష్టము.

అడుగడుగునా కార్యము, కార్య పద్ధతి, కార్య విస్తరణ ఎన్నో ప్రాజెక్టులలో పనిచేయడము వారు చూపిన దారియే. అనకాపల్లి వరదల సమయంలో, దివి సీమలో వారు సహాయ కార్యక్రమాల్లో మునిగిపోయి ఉన్నారు. అయినా అనాకపల్లి శ్రీరాంనగర్‌లో 110 ఇండ్ల నిర్మాణం, దానిలో సంపాదించిన అనుభవము వారి నిర్ణయ ఫలితమే.

1986లో గోదావరి వరదల్లో బలహీనవర్గాల ప్రజలకు కట్టే ఇల్లు బలహీనంగా ఉండకూడదు అని విజయసారథి చెప్పి ఎక్కువ ఖర్చయినా దృఢమైన ఇళ్లు నిర్మించేలా ప్రోత్సహించారు.

ఆంధ్రప్రదేశ్ విషయంలో వారు కొన్ని సమస్యలు గుర్తించి, వాటిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారు. దృష్టి పెట్టవలసిందిగా సూచించారు.

1. సాహిత్యంలో వామపక్ష ప్రభావము బాగా ఉంది. ఆ దృష్ట్యా తెలుగులో జాతీయ సాహిత్యం విషయమై వారు చాలా శ్రద్ధ వహించారు. ఈ రోజున హిందీ తర్వాత అధికంగా పుస్తకాలు తెలుగులోనే సంఘ్‌లో ముద్రణ అవుతున్నాయి. విశేష ప్రయత్నంవల్లనే మన కార్యకర్తలు ఎంతోమంది సాహిత్య రంగంలో ఉన్నత స్థానాన్ని సంపాదించారు. పోరాడారు, విజయం సాధించారు. భండారు సదాశివరావు, ముళ్లపూడి సూర్యనారాయణమూర్తి మొదలు ఎందరో కీర్తిశేషులు వారిలో కొందరు. ఈ తరములో కూడా కొందరు ఉన్నారు. వారు ఎప్పుడూ చెప్తుండేవారు, చూడండి మన ప్రాంతంలో సాహిత్య రంగానికి వనరులు కేటాయించాలి అని.

2. **నిజమైన సముద్ర తీరప్రాంతం:** ఆంధ్రప్రదేశ్ సమగ్ర తీరప్రాంతం దాదాపు 1000 కి.మీ. ఉంది. అక్కడ ఉండే మత్స్యకారులలో పని జరిగే ఆ దిశలో చాలా ప్రోత్సహించారు. వసతి గృహాల మీద దృష్టి పెట్టడంవలన ఎంతోమంది మత్స్యకార కుటుంబాల నుండి కార్యకర్తలు ప్రచారకులుగా వచ్చారు. దాని ఫలితమే నేటి మత్స్యకార సంక్షేమ సమితి.

3. సామాజిక వివక్షత వలన మన సమాజం బలహీనపడుతుంది. సేవాబస్తీలలో విశేషంగా పనికై వారు ప్రోత్సహించారు. అప్పటికి దేశములో సమరసత వేదిక ప్రారంభం కాలేదు. కానీ మన ప్రాంతంలో వారు మాననీయ యాదవరావుజీ ప్రేరణతో సామాజిక సమరసత వేదికను ఏర్పాటు చేయించారు. సమత, సమరసత శబ్దములపై చర్చకై మాననీయ యాదవరావుజీతో మమ్మల్ని కూర్చోబెట్టి చర్చింపచేసి సమరసతయే నేడు కావలసింది. సమరసత వల్లనే సమత కూడా సాధించవచ్చును అని నిర్ణయము జరిగింది.

సేంద్రియ వ్యవసాయం

ఉంగుటూరులో సేంద్రియ వ్యవసాయం. సుంకవల్లి పర్వతరావు తమ స్వంత ఊరు ఉంగుటూరులో 27 ఎకరాల వ్యవసాయ భూమిని దానముగా సమర్పించారు. దానిలో సేంద్రియ వ్యవసాయము ప్రారంభించడంలో సోమయ్యగారి మార్గదర్శనం ఉంది. ఆ క్షేత్రము ఈ రోజున దక్షిణ భారతదేశంలో ఒక ఆదర్శవంతమైన సేంద్రియ వ్యవసాయ క్షేత్రముగా నిలిచింది. మనందరికీ సేంద్రియ వ్యవసాయము లాభసాటి అని విశ్వాసము కలిగినది.

దివిసీమ ఉప్పెన సమయంలో సోమయ్యగారి మార్గదర్శనం మన ప్రాంతానికేకాక దేశము మొత్తానికి ఆదర్శముగా నిలిచింది. 1981లో దివిసీమ ఉప్పెన సేవా కార్యక్రమాలు పూర్తయిన తర్వాత అక్కడ పనిచేసిన డాక్టర్ సుబ్రహ్మణ్యశాస్త్రి తమ స్వంత ఊరికి వెళ్తున్న సమయంలో నాగాయలంకలో ఒక శాశ్వతమైన హాస్పిటల్ ప్రారంభించాలని ఆలోచించి నప్పుడు సోమయ్యగారు ఒకే మాట చెప్పారు. "చూడు నాయనా! మీ విజయవాడ టీం అంతా కలసి నిర్ణయం చేయగలిగితే, నడవగలమని విశ్వాసముంటే ముందుకెళ్లండి" అని ధైర్యము చెప్పారు. ఆ మాటలనే శిరోధార్యంగా భావించిన కార్యకర్తలు దీనదయాళ్ ఆసుపత్రిని ప్రారంభించారు.

నూతక్కి పాఠశాల

విజయవాడ అప్పటికి విభాగ్ కేంద్రమే కానీ రాకపోకల దృష్ట్యా పెద్ద కేంద్రము. అందుకని అక్కడ ఒక ఆవాస విద్యాలయము ఉండాలని, స్థలం సేకరించాలని 1988లో సోమయ్యగారు చెప్పినప్పుడు, మన విజయవాడ కార్యకర్తలకు ఆశ్చర్యం వేసింది. ఇది అయ్యే పనేనా? అని మొదట్లో అనిపించినా, వారి ప్రోత్సాహము వలన అది సాధ్యమైంది.

– వి.భాగయ్య
అఖిల భారత కార్యకారిణి సదస్యులు
('స్ఫూర్తి ప్రదాత శ్రీ సోమయ్య పుస్తకం నుండి)

కథ

రెక్కలు పుట్టాక

గోవిందరాజు చక్రధర్

రాకేశ్‌ను అమెరికా విమానం ఎక్కించి వచ్చిన ఆ తల్లిదండ్రులకు మనసు మనసులో లేదు. తమ కుటుంబంలోను దగ్గరి బంధువుల్లోనూ ఇప్పటివరకూ ఎవరూ దేశం బయట కాలు పెట్టలేదు. అలాంటిది తమ కొడుకు ఏకంగా అమెరికాలో అడుగుపెడుతున్నాడు. రంగమ్మ, రాజయ్య దంపతులకు ఒకింత గర్వంగా ఉంది.

మా అబ్బాయి పైచదువులకు అమెరికా వెళ్లాడు. ఇంకేముంది, ఇట్లా చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం సంపాదించేస్తాడు. అక్కడే స్థిరపడతాడు అని రాజయ్య మనసులోనే పొంగిపోతున్నాడు.

ఎయిర్‌పోర్ట్‌లో సెండాఫ్ చెప్పటానికి తమతో పాటు కూతురు అల్లుడు కూడా వచ్చారు. ఎయిర్‌పోర్ట్ పేరు వినటమే గానీ అక్కడ అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. చెకిన్ అయ్యాక రాకేష్ దూరం నుంచే చెయ్యి ఊపుతూ కళ్లముందు నుంచి కదిలి వెళ్తుంటే దిగాలుగా చూస్తుండిపోయారా దంపతులు.

భారంగా అడుగులు వేస్తూ వెనక్కి తిరిగారు. 'మీ అమ్మ చెయ్యి కాస్త పట్టుకుని నడిపించవే. ఈ మధ్య కళ్లు సరిగా కనిపించడంలేదు' అన్నాడు రాజయ్య కూతురు కావ్యతో.

'అది సరేగానీ, అమ్మకి కంటి ఆపరేషన్ ఎప్పుడు చేయిస్తున్నావు? శుక్లం ముదర లేదంటూ ఇంకెన్నాళ్లు కూచుంటావు? అయినా ఇప్పుడు చిటికెలో లేజర్‌తో కంటి ఆపరేషన్లు చేస్తున్నారు.' తండ్రిని మందలించింది కావ్య.

'చేయిద్దాం తల్లీ! ఇప్పటిదాకా రాకేష్ హడావిడితోనే సరిపోయింది. ఇక అంతా ఖాళీయే' రాజయ్య కూతురుకు సర్ది చెప్తున్నా, డబ్బు లేక ఆపరేషన్ వాయిదా పడుతోందన్న చేదు వాస్తవం ఆ తండ్రీ కూతుళ్లకు తెలియంది కాదు.

రాజయ్య దంపతులను ఇంటి దగ్గర దింపి వెళ్లారు కూతురు, అల్లుడు. అప్పటి నుంచి క్షణమొక యుగంలా గడుపుతూ వచ్చారు. ముప్పై గంటలు గడుస్తున్నా రాకేష్ నుంచి ఫోను రాకపోవడంతో రాజయ్యలో ఆందోళన మొదలైంది. మనసు పరిపరి విధాల పోతోంది. గాల్లోకి లేచిన విమానం క్షేమంగా అమెరికాలో దిగిందా? అనే ఆలోచన బుర్రను తొలుస్తోంది.

'చేరతాడు లేవయ్యా! నీకంతా కంగారు' అంటూ రంగమ్మ ధైర్యం చెప్తోంది.

'నాన్నా! తమ్ముడు ఫోను చేశాడా? చేయగానే నాకు చెప్పు' అంటూ కూతురు పది నిమిషాలకోసారి ఫోను చేస్తూ కంగారును మరింత పెంచుతోంది.

చివరికి వారి నిరీక్షణ ఫలించి రాకేష్ నుంచి ఫోనొచ్చింది క్షేమంగా చేరానని. రంగమ్మ, రాజయ్యల మనసు కుదుటపడింది.

రాకేష్ దాదాపు ప్రతిరోజూ ఫోను చేస్తూనే ఉన్నాడు. ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే మన తెలుగు స్టూడెంట్స్ వచ్చి తీసుకెళ్లారని, ఒకటి రెండు రోజులు వాళ్లతోనే కలిసి ఉండి వేరే ఫ్రెండ్స్‌తో రూము తీసుకున్నానని చెప్పాడు. యూనివర్సిటీలో అడ్మిషన్ పూర్తయిందని, చాలామంది తెలుగు విద్యార్థులు పరిచయం అయ్యారని మరుసటిరోజు కబురు. అమెరికా వాతావరణం, వారి మనస్తత్వం. బహిరంగ ప్రదేశాల్లో వాళ్లు పాటించే క్రమశిక్షణ గురించి కళ్లకు కట్టించాడు. అమెరికన్ల ఇంగ్లీషు అర్థం చేసుకోవడం మొదట్లో కాస్తంత కష్టమైందని, ఇప్పుడిప్పుడే బాగా అర్థమవుతోందని, తను కూడా ఇంగ్లీషును ధారాళంగా మాట్లాడగలుగుతున్నానని చెప్తుంటే, ఆపన్న హృదయాలు ఆనందించాయి.

రోజూ రాకేష్ ఫోను కోసం ఎదురు చూడటం అలవాటయిపోయింది. దుకాణంలో ఖాళీగానే ఉంటున్నాడు. ఈ మధ్య వచ్చే జనం బాగా తగ్గారు. ఇది కూడా ఒక రకంగా మంచిదే, ఏ ఆటంకాలు లేకుండా కొడుకుతో ఫోనులో మాట్లాడగలుగుతున్నానని కూడా ఆనందపడ్డాడు.

ఆ రోజు యథాప్రకారం రాకేష్ నుంచి ఫోను వచ్చింది. 'రెండేళ్లంటే ఏముంది! చిటికెలో అయిపోవూ! కోర్సు పూర్తవగానే జాబ్ చూసుకుంటా. నువ్వూ అమ్మ కూడా అమెరికాకు వచ్చి విజిటింగ్ వీసాపై ఆర్నెల్లు ఉండి వెళ్లచ్చు. కాలం కలిసొస్తే గ్రీన్‌కార్డ్‌పై మీరు కూడా నాతోపాటే అక్కడే సెటిలవ్వచ్చు. మీరు కూడా ఇప్పటిదాకా ఎక్కడికీ కదలలేదు. రాకేష్ మాటలు రాజయ్యకు సంతోషానిచ్చాయి.

నిజానికి అమెరికా చూడాలన్న ఉత్సాహమేదీ రాజయ్యకు లేదు. కొడుకు ప్రయోజకుడవుతున్నందుకు మహదానందపడ్డాడు. రాకేష్, వాళ్లమ్మతో మాట్లాడాతానంటే ఆవిడకు ఫోను ఇచ్చి దుకాణం మూసెయ్యటానికి నెమ్మదిగా లేచాడు రాజయ్య.

దుకాణం ముందు బైకు ఆగిన శబ్దం. ఈ వేళలో ఎవరా! అని తేరిపార చూశాడు. బైకు స్టాండువేసి వస్తున్న వీరాస్వామి కన్పించాడు.'ఏమండీ రాజయ్య గారూ! ఎలా ఉన్నారు? మీ వాడు ఎలా ఉన్నాడు? ఫోను చేస్తున్నాడా?' అంటూ మాటల్లోకి దింపాడు వీరాస్వామి.

'చేస్తున్నాడు స్వామీ! ఇవ్వుడే వాడితో మాట్లాడాను. అంతా బాగానే ఉంది. మమ్మల్ని కూడా అమెరికా తీసుకెళ్తాట్ట. మాకు అదొక్కటే తక్కువ' అన్నాడు సంబరంగా రాజయ్య.

'మీరూ అమెరికా చూసిరండి. అందరికీ ఈ ఛాన్స్ దొరుకుతుందా? ఇప్పుడు నేను పోవాలంటే పోగలనా చెప్పు? అక్కడ ఒక డాలరు సంపాదిస్తే మనూళ్లో వంద రూపాయలు సంపాదించినట్టేట గదా! అక్కడ వడ్డీలెట్టా ఉంటాయో?' వీరాస్వామి అటూ ఇటూ తిప్పి తన వడ్డీ వ్యాపారంవైపు దారి మళ్లించాడు.

'ఏమో స్వామీ! ఆ వడ్డీ లెక్కలూ అవీ నాకు ఎట్టా తెలుస్తాయి? నీ వడ్డి లెక్క ఒక్కటే ఎరిక. ఏమైనా నువ్వు సమయానికి ఆదుకోబట్టే మావాడు అమెరికా వెళ్లగలిగాడు' రాజయ్య కృతజ్ఞతగా అన్నాడు.

ఇదే మంచి అదనుగా తోచింది వీరాస్వామికి. చల్లకొచ్చి ముంత దాచట మెందుకనుకున్నాడు. వీరస్వామికి అసలు కంటే కొసరు ముద్దు. అసలు, గడుపులోగా ఇవ్వకున్నా భరిస్తాడు. ఏ నెలకానెల వడ్డీ చేతిలో పడకపోతే ఒంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకినట్లుంటాయి వీరాస్వామికి. ఏ నెలకానెల పోగయిన వడ్డీ డబ్బుల్ని మళ్లీ మరొకరికి అప్పుగా ఇస్తాడు. ఇలా వీరస్వామి రొటేషన్ సొమ్ము నెలనెలా పెరుగుతూ వడ్డీ వ్యాపారం మూడు అప్పులు ఆరు వడ్డీలుగా వర్ధిల్లు తోంది.

అప్పు ఇచ్చేటప్పుడే రెండు నెలల వడ్డీ మొత్తాన్ని

వీరాస్వామి మినహాయించుకున్నాడు. రెండు నెలలవరకు వెసులుబాటు ఉందిలే అని రాజయ్య ప్రశాంతంగా ఉన్నాడు. అయితే వీరాస్వామి మాత్రం అలా ఎవరినీ ప్రశాంతంగా ఉండనివ్వడు. అదే అతడి వ్యాపార విజయసూత్రం.

'వడ్డీ సంగతి గుర్తు చేసి వెళ్దామని వచ్చా రాజయ్యా! డబ్బు తీసుకుని రెండు నెలలవుతోంది' అన్నాడు సున్నితంగా హెచ్చరిస్తూ.

'రెండు నెలల వడ్డీ ముందే మినహాయించుకున్నావుగదా! మరొక నెల గడిచాక కదా, మేం వడ్డీ కట్టాల్సింది' అన్నాడు రాజయ్య నిలదీస్తున్న ధోరణిలో.

పట్టు విడుపులు వీరాస్వామికి అప్పుతో పుట్టిన విద్య. ఎప్పుడు తగ్గాలో మరెప్పుడు నెగ్గాలో అతగాడికి కొట్టిన పిండి.

'కాదని ఎవరన్నారు? అటు పోతూ ఒకసారి గుర్తుచేద్దామని ఆగా. అంత మాత్రానికే కోపం తెచ్చుకుంటే ఎట్టా?' అంటూ బైకు దగ్గరకు రెండు అడుగులు వేసినవాడు వెనక్కి వచ్చి– 'మర్చేపోయా! మాయావిడ బియ్యం తెమ్మంది. పది కిలోల సోనా మసూరి ఇవ్వు' అన్నాడు వీరాస్వామి ధాటిగా. రాజయ్య బియ్యం తూచి పాత సంచిలో పోసి మూట గట్టి ఇచ్చాడు. డబ్బులిస్తాడని ఎదురు చూస్తున్న సమయంలో 'వద్దు పద్దు రాసుకో రాజయ్యా!' అంటూ సమాధానం కోసం కూడా చూడకుండా బైకు స్టార్ట్ చేసుకుని క్షణాల్లో మాయమయ్యాడు.

* * *

రాజయ్యకు తండ్రి నుంచి నాలుగు ఎకరాల పొలం, విశాలమైన పెరడుతో పెంకుటిల్లు సంక్రమించింది. అంతంత మాత్రం వానాకాలం చదువు, వ్యవసాయం తప్ప మరో పని చేతకాని రాజయ్య విధిలేని పరిస్థితుల్లో వ్యాపారంలోకి దిగాల్సి వచ్చింది. రెండెకరాలు అమ్మి కూతురు కావ్య పెళ్లి చేశాడు. మిగిలిన రెండెకరాల్లో రాబడి అంతంత మాత్రమే. రేటు బాగా ఉందని ఒక ఏడాది మిర్చివేస్తే, తామర తెగులొచ్చి నష్టాల్లో కూరుకుపోయాడు. ఆ తర్వాత టమాటా వేసినా, రేటు పడిపోయి రోడ్డుమీద పారబోయాల్సి వచ్చింది. తెచ్చిన అప్పులు ఎట్లా తీర్చాలో, కుటుంబాన్ని ఎట్లా పోషించాలో, కొడుకు కాలేజి ఫీజులు ఎట్లా కట్టాలో అంతు చిక్కక ఆ రెండెకరాలను రెండు విడతలుగా అమ్మేశాడు.

వ్యవసాయం చేస్తూ స్వతంత్రంగా బతుకీడుస్తున్న రాజయ్యకు ఏం చేయాలో పాలుపోలేదు. అప్పుడెవరో సలహా ఇచ్చారు. మన చుట్టుపక్కల కిరాణా దుకాణం లేదు. మీ ఇంటి వసారాలో కిరాణా సరుకులు అమ్మచ్చు గదా అని. ఆ సలహా రాజయ్యకు నచ్చింది. ఇప్పటి మాదిరే సర్వస్వతంత్రంగా బతకవచ్చునను కున్నాడు. ఇంటి వసారాకు చుట్టూ గోడ కట్టించి, విశాలమైన తలుపులు చేయించాడు. రాజయ్య కిరాణా దుకాణం అని బోర్డు పెట్టించాడు. దగ్గర్లోనే ఉన్న పట్నానికి మోపెడ్‌పై వెళ్లి హోల్‌సెల్ కొట్లో సరుకులు కొనుక్కొచ్చాడు. ఏదీ లేదన్న మాట రాకూడదని పిన్నీసుల నుంచి పేస్టుల దాకా సమస్తం అందుబాటులో ఉంచాడు.

కొడుకు రాకేష్ పట్నం కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతో తీరుబడి లేకుండా ఉండేవాడు. దీంతో చేతికింద శాయిలుకు పెట్టుకున్నాడు. టెన్త్ తప్పిన శాయిలు పిలిచినప్పుడు పొలం పన్లకు వచ్చేవాడు. ఆ పరిచయంతో రాజయ్య అడగ్గానే నెల జీతం మీద కుదిరాడు. పట్నం వెళ్లి సరుకులు తేవడం, వాటిని పొట్లాలు కట్టివ్వడంలో చేదోడుగా ఉండేవాడు

శాయిలు.

దగ్గర్లో మరో దుకాణమేదీ లేకపోవడంతో కొద్దిరోజుల్లోనే వ్యాపారం పుంజుకుంది. ఉదయం ఆరింటికి దుకాణం తెరిచిన దగ్గర్నుంచీ రాత్రి పదింటికి కట్టేసేవరకూ క్షణం తీరుబడి ఉండేది కాదు. మధ్యాహ్నం వేళలో రెండు గంటలపాటు రద్దీ తగ్గేది. ఆ టైములో దుకాణం కట్టేసి, భోంచేసి కాసేపు నడుం వాల్చేవాడు. శాయిలు కూడా ఇంటికివెళ్లి తినొచ్చేవాడు. ఇల్లూ, దుకాణం ఒకటే కావడంతో అర్ధరాత్రి, అవరాత్రి అయినా తలుపు తడుతుండేవారు.

తూకం వేసి న్యూస్‌పేపర్‌లో పొట్లాలు కట్టడం మొదట్లో కష్టంగా ఉండేది. సరుకులకు డబ్బు లెక్కేసి తీసుకుని మిగిలిన చిల్లర ఇవ్వటానికి తడబడేవాడు. నెమ్మదిగా అలవాటయి ఒడుపు సాధించాడు. పొట్లాలు కట్టే బదులు, ప్లాస్టిక్ సంచులు సులువని ఎవరో చెప్తే రెండు మూడురకాల సైజుల్లో సంచులు తెచ్చి వాటిల్లో నింపి ఇచ్చేవాడు. పోటీ లేకపోవడం, వ్యక్తిగత పరిచయాలుండటంతో ఉప్పూ పప్పు కోసం ప్రతివారూ రాజయ్య దుకాణానికే వచ్చేవారు. వ్యాపారంలో కుదురుకున్నాడు. కుటుంబానికి ఏ లోటూ లేకుండా సాగుతోంది.

కాలంతోపాటు చాపకింద నీరులా మార్పు లొచ్చాయి. పట్టణం విస్తరిస్తూ గ్రామంలోకి చొరబడింది. కొత్త కాలనీలు వచ్చాయి. గ్రామం పట్టణంలో భాగమైంది. రియల్ ఎస్టేట్ యజమాని భార్య పేరుతో అక్కడ సౌభాగ్యపురం వెలిసింది. రాజయ్యకు పోటీగా పక్కనే మరో కిరాణా దుకాణం వచ్చింది. ఉత్తరాది నుంచి వచ్చిన కుటుంబం ఆ దుకాణం తెరిచింది. మొదట్లో వారికి హిందీ తప్ప తెలుగు వచ్చేది కాదు. తొందర్లోనే తెలుగు అర్థం చేసుకోగల స్థితికి వచ్చాడు సేఠ్. పొడిపొడిగా మాట్లాడటమూ నేర్చాడు. వస్తూనే సొంత ఊరి నుంచి దూరపు బంధువును పిలిపించుకున్నాడు. రేయింబవళ్లూ ఇద్దరూ దుకాణం మీదే ధ్యాస నిలిపి పనిచేసేవారు. మధ్యాహ్నం పూట కూడా దుకాణం తెరిచే ఉండేది. సేఠ్, అతని సహాయకుడు భోజనానికి వెళ్లిన ఆ కాసేపు సేఠ్ భార్య దుకాణంలో కూచునేది. దుకాణం మొదలైన రోజే 'అప్పురేపు' అని తెలుగు తెలిసినవారి చేత పలకపై రాయించి కౌంటర్‌లో వేలాడదీశాడు.

రాజయ్య కూడా మొదట్లో ఎవరికీ అప్పులు ఇచ్చే వాడు కాదు. కానీ కాలం గడిచే కొద్దీ తెలీకుండానే బాకీలు ఇవ్వాల్సి వచ్చేది. ఐదొందల రూపాయల సరుకు తీసుకుని మూడొందలు ఇచ్చి మిగతాది ఖాతాలో రాసుకోమనేవారు. ఎక్కడికి పోతారులే, ఉన్నవ్పుడిస్తారు అనే భరోసాతో కాదనలేక పోయేవాడు. వ్యాపారంలోకి దిగినా, పుట్టుకతో వచ్చిన రైతు ఉదార మనస్తత్వం రాజయ్యను

కొడుకు అమెరికా వెళ్లాడన్న సంతోషం లేకుండా చేస్తున్నాడు వీరాస్వామి. వడ్డీకోసం ప్రతి నెలా వచ్చి పీకల మీద కూచుంటున్నాడు. తప్పని పరిస్థితుల్లో అల్లుడు దగ్గర తీసుకుని ఒక నెల వడ్డీ కట్టాడు. ఇంకో నెల వరకూ ఊపిరి పీల్చుకోవచ్చునను కున్నాడు. మొదట్లో రాకేష్‌కు విషయం చెప్పకుండా దాటవేయాలని చూశాడు రాజయ్య. ఇక్కడి సమస్యలన్నీ ఏకరువు పెడుతుంటే కొడుకు చదువు ప్రశాంతంగా సాగదనుకునేవాడు. ఇక ఒత్తిడి తట్టుకోలేక, మార్గాంతరం లేక రాకేష్‌కు ఉన్న విషయం చెప్పక తప్పలేదు.

నిర్మొహమాటంగా ఉండనివ్వలేదు. ఒకరిని చూసి మరొకరు బాకీ పెట్టటం నేర్చారు. వ్యాపారం జోరుగా సాగినా గల్లాపెట్టెలో మాత్రం డబ్బుండేది కాదు. పట్నంలో సరుకులు తేవడానికి కూడా చేతిలో పైసలు ఆడేవి కావు. ఇక ఇలాగైతే లాభం లేదనుకుని పాత బాకీ తీరిస్తేనే సరుకులు ఇచ్చేదని రాజయ్య తెగేసి చెప్పేసరికి ఒక్కొక్కరూ ముఖం చాటేశారు. ఉత్తరాది సేఠ్ దుకాణం పుంజుకుంది. రాజయ్య బాకీ ఎగ్గొట్టిన వారి ఆటలు మాత్రం సేఠ్ ముందు సాగలేదు. డబ్బిచ్చి సరుకు పట్టుకెళ్లేవారు.

కొత్త కాలనీలతోపాటే పట్నం కళ వచ్చేసిందా గ్రామానికి. జనాభా పెరిగింది. దాంతోపాటే పలు రకాల దుకాణాలు పుట్టుకొచ్చాయి. నగలు, బట్టల దుకాణాలు, టూవీలర్, ఫోర్‌వీలర్ షోరూమ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కొరియర్ సర్వీసులు – ఇలా దేనికీ కొదవ లేకుండా వ్యాపారాలు విస్తరించాయి. మిగతా వాటి మాటెలా ఉన్నా కొత్తగా వచ్చిన సూపర్ మార్కెట్, రాజయ్య వ్యాపారాన్ని పూర్తిగా దెబ్బ తీసింది. జనాల అభిరుచిలో మార్పు రావడం, మార్కెట్‌ను ముంచెత్తిన పలు రకాల బ్రాండ్లు అక్కడ దొరకడంతో సూపర్ మార్కెట్ అయస్కాంతంలా ప్రజలను ఆకర్షించింది. శాయిలు కూడా రాజయ్యకు గుడ్‌బై చెప్పి, సూపర్‌బజార్‌లో సూపర్‌వైజర్‌గా చేరాడు.

రాజయ్య ఒంటరివాడయ్యాడు. ఓపికున్న రోజున పట్నం వెళ్లి సరుకులు తెచ్చేవాడు. ఉత్తరాది సేఠ్‌కి సూపర్ బజార్ తాకిడి కొంత తగలకపోలేదు. కానీ డిస్కౌంట్ ఆఫర్లతో తన ఖాతాదారుల్ని చాలావరకు నిలుపుకోగలిగాడు. మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ వచ్చిన సేఠ్, ఊరి నుంచి మరో బంధువుని పిలిపించి, హార్డ్‌వేర్, పెయింట్స్‌షాపు మొదలు పెట్టాడు. ఇళ్ల నిర్మాణాలు బాగా సాగుతుండటంతో హార్డ్‌వేర్ దుకాణానికీ గిరాకీ పెరిగింది.

ఇంజినీరింగ్ ఫైనలియర్ కొచ్చినప్పటి నుంచి రాకేష్‌కి అమెరికాపై ధ్యాస మళ్లింది. తన ఫ్రెండ్సందరూ అమెరికాలో ఎం.ఎస్. చేయాలను కుంటుంటే తానూ వెళ్లాలని సంకల్పం పూనాడు. చివరి సెమిస్టర్ నుంచే టోఫెల్, జీఆర్ఇ కోచింగ్‌లకు వెళ్లటం మొదలుపెట్టాడు. వాటిని తేలిగ్గానే క్లియర్ చేయటం కొత్త ఉత్సాహాన్నిచ్చింది. కోచింగుల కోసం డబ్బులు కావాలనేవాడు. వేరే దారి లేక రంగమ్మ ఒంటిమీద బంగారం అమ్మి కొడుకు చేతిలో పోశాడు. అమెరికా యూనివర్సిటీలకు అప్లికేషన్‌లు, ఫీజులకు, కొరియర్లకు లక్ష రూపాయలపైనే ఖర్చయింది.

రాకేష్ అదృష్టం బావుండి, ఒక యూనివర్సిటీలో సీటొచ్చింది. ఇక ఆ దిశలో వెనక్కి లాగి లాభం లేదనుకున్నాడు రాజయ్య. బ్యాంకులో ఎడ్యుకేషన్ లోన్ కూడా తేలిగ్గానే వచ్చింది. కాకుంటే విమాన టికెట్లకు, అమెరికాలో ఏడాదిపాటు నెలవారీ తిండి, వసతి ఖర్చులకు డబ్బు సమకూర్చుకోవలసి వచ్చింది. అందుకోసం వీరాస్వామిని ఆశ్రయించాల్సి వచ్చింది. రెండు రూపాయల వడ్డీకి పదిలక్షల దాకా అప్పు తీసుకున్నారు. తిన్నా తినకున్నా వడ్డీ కింద నెలనెలా ఇరవై వేల రూపాయలు కట్టాల్సి వచ్చింది.

* * *

కొడుకు అమెరికా వెళ్లాడన్న సంతోషం లేకుండా చేస్తున్నాడు వీరాస్వామి. వడ్డీకోసం ప్రతి నెలా వచ్చి పీకల మీద కూచుంటున్నాడు. తప్పని పరిస్థితుల్లో అల్లుడు దగ్గర తీసుకుని ఒక నెల వడ్డీ కట్టాడు. ఇంకో నెల వరకూ ఊపిరి పీల్చుకోవచ్చు ననుకున్నాడు.

మొదట్లో రాకేష్‌కు విషయం చెప్పకుండా దాటవేయాలని చూశాడు రాజయ్య. ఇక్కడి సమస్యలన్నీ ఏకరువు పెడుతుంటే కొడుకు చదువు ప్రశాంతంగా సాగదనుకునేవాడు. ఇక ఒత్తిడి తట్టుకోలేక, మార్గాంతరం లేక రాకేష్‌కు ఉన్న విషయం చెప్పక తప్పలేదు.

'వీరాస్వామి వడ్డీకోసం రోజూ తిరిగి పోతున్నాడురా. రెండు నెల్లు బాకీ పడ్డాం. నాకు వెసులు బాటు కావటంలేదు. రాజయ్య పళ్ల బిగువున చెప్పాడు.

రాకేష్‌కి పరిస్థితి అర్థమైంది. 'అసిస్టెన్స్‌షిప్ వచ్చేట్లుంది నాన్నా! అదొస్తే ఇక ఏ సమస్యా ఉండదు.

కొంత నా ఖర్చులకుపోయినా, మిగిలింది పంపగలను. వడ్డీ పోను మిగిలిన పైకం మీరు వాడుకోవచ్చు'. రాకేష్ మాటలతో రాజయ్యకు కొండంత భరోసా కలిగింది.

ఆ తర్వాత ఇరవై రోజులకే రాకేష్ అమెరికా నుంచి రాజయ్య బ్యాంకు అకౌంట్‌కి డబ్బు పంపాడు. రాజయ్య మనసు కుదుటపడింది. ఆ రోజే డబ్బు డ్రా చేసి, వీరాస్వామికి ఫోను చేసి మరీ పిలిచి వడ్డీ బకాయి తీర్చేశాడు.

పెరట్లో కాచిన కూరగాయలతో రంగమ్మ వంట అయిందనిపిస్తోంది. రాజయ్య కిరాణా దుకాణం మూతపడే స్థితికి వచ్చింది. ఒకరిద్దరు తప్పించి ఎవరూ దుకాణంవైపే రావట్లేదు. కొత్త సరుకు తేవటానికి డబ్బు సమకూర్చుకోలేకపోతున్నాడు. తిప్పలు పడి ఎలాగో అలా తెచ్చినా అమ్ముడు పోతుందన్న నమ్మకం కన్పించడంలేదు. ఖాళీగా కూచోవడం విసుగనిపించి, రంగమ్మకు దుకాణం అప్పగించాడు.

శుక్లాలు ముదిరి రంగమ్మకు కంటిచూపు ఆనడంలేదు. కొంతమంది ఆకతాయిలు ఇదే అదనుగా తీసుకుని దుకాణంలో అడుగుబొడుగు మిగిలిన సామానును దొంగ నోట్లిచ్చి పట్టుకెళ్లారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు, ఆ నోట్లు తీసుకుని మార్కెట్ కెళ్లిన రాజయ్యకు అసలు సంగతి బోధపడింది. ఉసూరుమంటూ ఖాళీ చేతులతో వెనక్కి రావల్సి వచ్చింది.

పళ్ల బిగువన దుకాణంలో తనే కూచుంటున్నాడు. ఎప్పుడో తెచ్చిన పప్పులకు, రవ్వలకు పురుగు పట్టింది. వాటిని తీసికెళ్లిన ఒకరిద్దరు ఎగ్గొట్టారు. రాజయ్య, దుకాణం తియ్యటం మానేశాడు. సాటి రైతు వెంకటయ్య ఆ రోజు ఇంటి తలుపు తట్టాడు.

'రాజయ్యా! ఎన్నాళ్లిలా ఖాళీగా కూచుంటావు. పొరుగూళ్లో మిర్చి కోతలకు పోతున్నా. నువ్వూ వస్తావంటే నా బండిమీదే తీసుకెళ్తా! వెంకటయ్య చెప్పింది వినగానే తటపటాయించాడు. నిన్నటిదాకా తన పొలంలో పనిచేసుకోవటంలేదు. ఇప్పుడు వేరే వాళ్ల పొలంలో కూలీకి పోవటం వేరు. గౌరవాభిమానాలు అడ్డు రాగా ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్న రాజయ్యకు వెంకటయ్య నచ్చ చెప్పాడు.

'ఎవరి పొలమైతేనేం? సొంత పొలం మనకు కూడుపెట్టిందా? కాలంతో పాటు మనమూ మారాలి. పద వెళ్దాం' అంటూ సర్ది చెప్పి, రాజయ్యను మిర్చి కోతలకు వెంటబెట్టుకెళ్లాడు వెంకటయ్య.

మొదటిరోజు కాస్తంత ఇబ్బందిగా అన్పించింది, అభిమానం అడ్డొచ్చి, సాయంత్రం అయ్యేటప్పటికి చేతిలో మూడొందలు పెట్టారు. మరో పదిరోజులు పనుందన్నారు. కళ్లు మూసుకుంటే మూడువేలు చేతిలో పడతాయి. ఇంటి ఖర్చులు వెళతాయి. కొడుకు పంపే డబ్బుని పూర్తిగా వీరాస్వామికి చెల్లు వేస్తే, వడ్డీతోపాటు కొంత అసలు కింద జమ చేసుకుంటాడు. అనుకున్నదానికంటే ముందే అప్పు తీర్చేయచ్చు.

రంగమ్మ మొదటిరోజున గుడ్ల నీరు కక్కుకుంది. 'ఈ వయసులో కూలి పనులకు పోవటమేంటయ్యా, ఖర్మ కాకపోతే' అని కుమిలిపోయింది. రాజయ్య విడమరిచి చెప్పడంతో నరేననక తప్పలేదు రంగమ్మకు.

రాజయ్య ఉదయాన్నే కూలి పనికెళ్లాడు వెంకటయ్యతో కలిసి. ముక్కుతూ మూలుగుతూ వంట మొదలెట్టింది రంగమ్మ. తలుపుకొట్టిన చప్పుడైతే వెళ్లితీసింది. ఎదురుగా రాకేష్, మరెవరినో చూసి రాకేష్ అని పొరపడ్డాననుకుంది ఒక్క క్షణం. రాకేష్ గొంతు విప్పేసరికి కన్న కొడుకేనని నిర్ధారించుకుంది.

'ఏంటిరా! మీ నాయన మీద దిగులుపడ్డావా, ఏంటి! ఇట్టా చెప్పాపెట్టకుండా వచ్చావేం?' కొడుకు వచ్చాడన్న ఆనందం ఒకవైపు, ఎందుకొచ్చాడన్న అనుమానం మరోవైపు రంగమ్మను చుట్టు ముట్టేశాయి.

అసలు విషయం చెప్పకుండా-'నాన్నేడి! సరుకులు తేవటానికి పట్నం వెళ్లాడా?' సూట్‌కేసులు లోపలి గదిలోకి చేరవేస్తూ అడిగాడు రాకేష్.

'వస్తాడులే. తెలిసిన వాళ్ల పొలంలో పనికి పిలిస్తేపోయాడు' అంది ముక్తసరిగా, కొడుకు ఎలా స్పందిస్తాడో తెలీక.

'పనికి పోవటమేమిటే! దుకాణం ఎవరు చూస్తారు?' అంటూ దుకాణంలోకి తొంగి చూశాడు. సరుకులేమీ లేక బోసిపోయి ఉండటంతో రాకేష్‌కు పరిస్థితి బోధపడింది. రాజయ్య ఫోను కూడా తీసుకెళ్లకపోవడంతో తండ్రి రాకకోసం ఎదురు చూస్తూ గడిపాడు రాకేష్. తల్లికి కూడా అసలు విషయం చెప్పకుండా దాటవేస్తూ వచ్చాడు.

పొద్దుగూకేవేళ ఇంటికి తిరిగొచ్చిన రాజయ్య, హఠాత్తుగా కళ్లముందు కొడుకు కన్పించేసరికి ఆశ్చర్యపోయాడు. అమెరికా వెళ్లి గట్టిగా ఆరునెలలు కూడా కాలేదు. రెండేళ్ల చదువు. ఆ తర్వాత అక్కడే కొలువు చూసుకుని సెటిల్ అవుతానని చెప్పినవాడు హఠాత్తుగా తిరిగొచ్చేసరికి ఏమీ అంతు చిక్కలేదు రాజయ్యకు.

తల్లిదండ్రుల దగ్గర నిజం దాచి పెట్టినందువల్ల ఏమీ ప్రయోజనం ఉండదనుకున్నాడు రాకేష్. సూటిగా విషయం చెప్పుకొచ్చాడు.

అనుకున్నట్లు రాకేష్‌కి యూనివర్సిటీలో అసిస్టెన్స్‌షిప్ రాలేదు. అది వచ్చి ఉంటే క్యాంపస్‌లో ఏ ప్రొఫెసర్ దగ్గరో, లైబ్రరీలోనో పార్ట్‌టైమ్ చేసేవాడు. ఇది లీగల్ కనుక ఏ సమస్యా ఉండేది కాదు.

కానీ దురదృష్టవశాత్తు ఆ ప్రయత్నాలేవీ కలిసి రాలేదు. వడ్డీ భారం తండ్రిని ఎలా కుంగదీస్తుందో ఆయన మాటల్నిబట్టి గ్రహించాడు రాకేష్. అమెరికాలో పరిస్థితులు మునుపటిలా లేవు. రిస్కుందని తెలిసీ మొండి ధైర్యం చేశాడు. గత్యంతరం లేక షాపింగ్ మాల్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగంలో చేరాడు. రెండు నెలలు గడిచాయో లేదో అమెరికన్ అధికారుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఇది ఇల్లీగల్ కావడంతో సంజాయిషీకి అవకాశం ఇవ్వకుండా రాకేష్‌ను నిర్దాక్షిణ్యంగా వెనక్కి తిప్పి పంపేశారు. సాటి విద్యార్థులు, ప్రొఫెసర్లు నిస్సహాయులయ్యారు.

రాజయ్య ఉదయాన్నే కూలీపనికెళ్లాడు వెంకటయ్యతో కలిసి. ముక్కుతూ మూలుగుతూ వంట మొదలెట్టింది రంగమ్మ. తలుపుకొట్టిన చప్పుడైతే వెళ్లితీసింది. ఎదురుగా రాకేష్, మరెవరినో చూసి రాకేష్ అని పొరపడ్డాననుకుంది ఒక్క క్షణం. రాకేష్ గొంతు విప్పేసరికి కన్నా కొడుకేనని నిర్ధారించుకుంది. 'ఏంటిరా! మీ నాయన మీద దిగులుపడ్డావా, ఏంటి! ఇట్టా చెప్పాపెట్టకుండా వచ్చావేం?' కొడుకు వచ్చాడన్న ఆనందం ఒకవైపు, ఎందుకొచ్చాడన్న అనుమానం మరోవైపు రంగమ్మకు చుట్టు ముట్టేశాయి.

రాకేష్ చదువు మానుకుని అమెరికా నుండి వెనక్కి వచ్చేశాడన్న ఉప్పు వీరాస్వామికి అందింది. క్షణం ఆలస్యం చేయకుండా ఇంటికొచ్చి కూచున్నాడు. అప్పటికప్పుడు వడ్డీతో సహా పూర్తిగా కక్కమన్నాడు. కాస్త గడువివ్మని రాకేష్ నచ్చచెప్పబోతే, కుదరదని భీష్మించాడు.

టైమిస్తే మాత్రం ఎలా తీరుస్తారో చెప్పుమంటూ నిలదీశాడు. దిక్కుతోచని స్థితిలో పడ్డారు తండ్రీ కొడుకులు.

రాజయ్య పెంకుటింటి ముందు 'హౌస్ ఫర్ సేల్' బోర్డు వెలిసింది. ఇల్లు అయిన కాడికి అమ్మగా వచ్చిన డబ్బుతో బ్యాంకు లోన్‌ను, వీరాస్వామి బాకీని వడ్డీతో కట్టేసి అద్దె ఇంటికి మారారు.

పూలచెట్లు, కూరగాయల పాదులతో ఒకప్పుడు పచ్చగా అల్లుకున్న రాజయ్య పొదరిల్లు కళ్లముందే కుప్పకూలిపోయింది. ఐదంతస్తు అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అక్కడ పునాదులు తవ్వుతున్నారు.

అమెరికా ఆశలు పూర్తిగా అడుగంటిపోగా హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాడు రాకేష్. ★

'శౌర్యచక్ర' గ్రహీతలు మన నౌకాదళ మహిళా ద్వయం

ఇంటిని చూసుకోవడమే కాదు.. సాహస యాత్రలు చేయడంలోనూ ఏ మాత్రం వెనుకాడేది లేదని నిరూపించి, శౌర్యచక్ర గ్రహీతలుగా గౌరవాన్ని అందుకున్నారు మన నావికాదళం లెఫ్టినెంట్ కమాండర్లుగా దేశ సేవ చేస్తున్న మహిళా ద్వయం దిల్నా కె, రూప అళగిరి స్వామి. వీరిద్దరూ గత ఏడాది చేపట్టిన చారిత్రాత్మక ప్రపంచ యాత్ర 'నావికా సాగర్ పరిక్రమ II'. ఈ యాత్ర ముసుపటి రికార్డులను అధిగమించింది. వీరిద్దరూ 21,600 నాటికల్ మైళ్ల దూరం చేసిన ప్రయాణంలో అత్యంత ప్రమాదకరమైన 'పాయింట్ నెమో'ను దాటడంతో పాటు, మూడు మహాసముద్రాలను, భూమధ్యరేఖను రెండుసార్లు దాటారు. మూడు కేప్‌లు (అంతరీపాలు), నాలుగు ఖండాల మీదుగా సాగిన ఈ ప్రయాణంలో, కేవలం వాయు శక్తిపైనే ఆధారపడిన నౌకలో సాహసోపేతమైన లక్ష్యాన్ని సాధించిన ఈ నావికులు మే 29, 2025న గోవా తీరాన్ని చేరుకున్నారు. దిల్నా, రూప గోవా తీరం నుండి ఈ నౌకలో ప్రయాణాన్ని ప్రారంభించి, ఫ్రీమాంటిల్ (ఆస్ట్రేలియా), లిటిల్టన్ (న్యూజిలాండ్), పోర్ట్ స్టాన్లీ (ఫాక్‌లాండ్ దీవులు), కేప్ టౌన్ (దక్షిణాఫ్రికా) వంటి ప్రాంతాలలో నిర్వహణ పనుల కోసం ఆగుతూ మూడు వేర్వేరు ఖండాలను సందర్శించారు. ఈ క్రమంలో వారు అనేక దౌత్యపరమైన, ప్రజా సంబంధిత కార్యక్రమాలలో పాల్గొన్నారు. వీరి అద్భుతమైన విజయాలకు గుర్తింపుగా, పశ్చిమ ఆస్ట్రేలియా పార్లమెంటులో వారిని ప్రత్యేక ఆహ్వానితులుగా సత్కరించారు. కేవలం ఇద్దరు వ్యక్తులతో కూడిన బృందం చేపట్టిన ఈ సాహసోపేతమైన ప్రపంచ యాత్ర, భారత నావికాదళ సముద్రయాన సామర్థ్యాలు, మహిళా సాధికారతలో ఒక కీలక ముందడుగును సూచిస్తుంది. 'ఆత్మనిర్భర్ భారత్' పథకం కింద స్వదేశీ వనరులపై ఆధారపడి నౌకల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూనే, ఈ యాత్ర సముద్ర, వాతావరణ, వన్యప్రాణుల పరిశోధనలకు ప్రత్యక్షంగా దోహదపడింది. అలాగే, సముద్రయాన రంగంలో లింగపరమైన అడ్డంకులను తొలగించడంలో ఈ మిషన్ సహాయపడింది. ఇది భారతీయ యువతులు సాయుధ దళాలు, నావికాదళంలో చేరేలా స్ఫూర్తినిచ్చి, బలమైన, స్ఫూర్తిదాయకమైన నావికాదళ అధికారుల తరానికి బాటలు వేసింది. సముద్రంపై 8 నెలలకు పైగా గడిపిన ఈ మహిళా నావికాదళ అధికారులకు స్వాగతం పలికిన ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. 'నావికా సాగర్ పరిక్రమ II' యాత్రను విజయవంతంగా పూర్తి చేయడంలో, అద్భుతంగా రూపొందించిన భారత నౌకాదళానికి చెందిన 'తారిణి' అనే నౌక ఆ బృందానికి ఎంతో అండగా నిలిచింది. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వీరిని శౌర్య చక్ర గ్రహీతలుగా అధికారికంగా ప్రకటించారు. జూన్ 8న న్యూఢిల్లీలో జరిగిన రక్షణ పురస్కార ప్రదానోత్సవంలో, లెఫ్టినెంట్ కమాండర్లు దిల్నా కె, రూప ఎ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'శౌర్య చక్ర' పతకాలను అందుకున్నారు.

పాఠశాలల్లో గాయత్రీ మంత్రం తప్పనిసరి

పాఠశాల విద్యార్థులకు రామాయణ, భారత, భాగవతాలు, భగవద్గీత బోధన అనే మాట వినగానే ఇది సెక్యులర్ దేశమంటూ విరుచుకుపడేందుకు వామపక్షశక్తులు, అన్యమత శక్తులు సిద్ధంగా ఉంటాయి. అయితే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మాత్రం ఇవేవీ లెక్కచేయక మరో అడుగు ముందుకేసి కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నీ తమ పని దినాన్ని నిర్దిష్ట ప్రార్థనలు, కీర్తనలు, దేశభక్తి గీతాలతో ప్రారంభించి, ముగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలు ప్రతి దినం పాటించాల్సిన మూడు దశల కార్యక్రమ ప్రణాళికను అధికారులు విడుదల చేశారు. దీని ప్రకారం ప్రతి విద్యా సంస్థలోనూ గాయత్రీ మంత్రంతో పాటు ఇతర హిందూ ప్రార్థనలు, జాతీయ గీతం, వందేమాతరం పఠనం తప్పనిసరి. పాఠశాల పనిదినాలలో విద్యార్థులు సమష్టిగా జాతీయ గీతం, వందేమాతరం పాడటంతో రోజు ప్రారంభమవుతుంది. ఆ వెంటనే దీప మంత్రం, సరస్వతీ వందనం, గురు మంత్రం పఠిస్తారు. ఉదయపు సమావేశం ఒక ప్రముఖ వ్యక్తి జీవిత చరిత్రలోని ఘట్టాన్ని చదవడంతో ముగుస్తుంది. మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థులు 'భోజన మంత్రం' పఠించాలి. పాఠశాల పని వేళలు ముగిసే సమయానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర గీతాన్ని పాడటంతో పాటు గాయత్రీ మంత్రం, శాంతి మంత్రాన్ని పఠిస్తారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు, విద్యాసంస్థలు, హిందువులు మనది హిందూ సంప్రదాయ కేంద్రమైన భారతదేశం అని గుర్తించి ఇలాంటి కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తే విశ్వకళ్యాణ కారకమైన సనాతన ధర్మ వికాసానికి అవి ఊతమై నిలుస్తాయి.

పూరి జగన్నాథ మందిర సంస్కృతికి మేధో సంపత్తి హక్కుల రక్షణ

ఒడిశాలోని చారిత్రాత్మక హైందవ పుణ్యక్షేత్రం పూరిజగన్నాథ ఆలయ పవిత్రతను, సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించే దిశగా అడుగులు వేసిన శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (SJTA) ఒక కీలక విజయాన్ని సాధించింది. ఆలయ సంప్రదాయాలతో ఐతిహాసిక బంధం ఉన్న 'ఆనంద బజార్', 'శ్రీ పతితపావన' అనే రెండు విశిష్ట పదాలతో పాటు ఆలయ అధికారిక చిహ్నానికి (లోగో) మేధో సంపత్తి హక్కుల సంస్థ (Intellectual Property India) నుండి ట్రేడ్‌మార్క్ రక్షణ లభించింది. భారతదేశంలో ఒక ఆధ్యాత్మిక క్షేత్రానికి సంబంధించిన సాంస్కృతిక చిహ్నాలకు ఈ విధంగా చట్టపరమైన రక్షణ లభించడం ఇదే మొదటిసారి. ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా కాపాడేందుకు, భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేందుకు ఈ చర్య ఎంతగానో దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ చట్టపరమైన గుర్తింపు ద్వారా జగన్నాథ సంస్కృతికి చెందిన ఈ పవిత్ర నామాలను, చిహ్నాలను ప్రైవేట్ వ్యక్తులు లేదా వ్యాపార సంస్థలు తమ స్వార్థానికి, వాణిజ్య ప్రయోజనాల కోసం అనధికారికంగా ఉపయోగించకుండా నిరోధించవచ్చు. ఎస్‌జెటిఏ (SJTA) ముఖ్య పరిపాలకుడు డాక్టర్ అరబింద కుమార్ పాఢీ ఈ పరిణామాన్ని ధ్రువీకరించారు. జగన్నాథ ఆలయ సంస్కృతి, ఆచారాలు, గుర్తింపుతో ముడిపడి ఉన్న 29 విభిన్న పదాలు, లోగోల రిజిస్ట్రేషన్ కోసం తాము దరఖాస్తు చేశామని ఆయన తెలిపారు.

భారత హాకీ 'భీమార్జునులు'!

భారత బంగారు క్రీడ హాకీలో మాజీ కెప్టెన్ మన్‌దీప్ సింగ్, ప్రస్తుత కెప్టెన్ హర్మన్ ప్రీత్‌సింగ్ తమదైన శైలిలో రాణిస్తూ రికార్డుల మోత మోగిస్తున్నారు. ఒలింపిక్స్‌లో ఇప్పటి వరకూ ఎనిమిది బంగారు పతకాలు అందించిన హాకీ క్రీడను 'డబుల్ ఇంజన్' లా ముందుండి నడిపిస్తున్నారు.

క్రీడలు ఏవైనా క్రీడాకారులు వస్తూపోతూ ఉంటారు. అయితే సంవత్సరాల తరబడి తమ జట్టుకు అమూల్యమైన సేవలు అందిస్తూ అరుదైన రికార్డులు నెలకొల్పే అవకాశం అతికొద్దిమందికి మాత్రమే దక్కుతుంది. ఆ కోవకి చెందిన ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు ప్రస్తుత భారతజట్టు జయాప జయాలలో కీలకభూమిక పోషిస్తున్నారు. ఆధునిక ఒలింపిక్స్ చరిత్రలో అత్యధికంగా భారత్‌కు ఎనిమిది బంగారు పతకాలు అందించిన ఏకైక క్రీడ హాకీ మాత్రమే. క్రికెట్ తరువాత అత్యంత జనాదరణ పొందిన క్రీడగా భారత హాకీ పతాకాన్ని రెపరెపలాడించడంలో పంజాబ్ జోడీ మన్‌దీప్ సింగ్, హర్మన్ ప్రీత్‌సింగ్ ప్రముఖపాత్ర పోషిస్తున్నారు. గత రెండు ఒలింపిక్స్‌లో భారత్ రెండు కాంస్య పతకాలు సాధించడం వెనుక ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ల కష్టం, ప్రతిభ, అంకితభావం ఎంతో ఉన్నాయి. మిడ్ ఫీల్డర్‌గా మన్‌ప్రీత్ సింగ్, పెనాల్టీకార్నర్ (డ్రాగ్ ఫ్లిక్) స్పెషలిస్ట్‌గా హర్మన్ ప్రీత్‌సింగ్ ఎనలేని సేవలు అందించడమే కాదు పలు అరుదైన ఘనతలతో తమకు తామే సాటిగా నిలిచారు.

దిలీప్ టిర్కే సరసన మన్ ప్రీత్.....

భారత హాకీ చరిత్రలో అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అరుదైన 412 మ్యాచ్‌ల రికార్డు నిన్నటి వరకూ ఆల్ టైమ్ గ్రేట్ ఆటగాడు దిలీప్ టిర్కే పేరుతోనే ఉంది. అయితే కొద్దిరోజుల క్రితమే మన్‌ప్రీత్ సింగ్ ఆ రికార్డును సమం చేయడం ద్వారా సరికొత్త రికార్డుకు ఉరకలేస్తున్నాడు. రోటర్ డ్యామ్ వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రో- లీగ్ మ్యాచ్ లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించడం ద్వారా 412 మ్యాచ్‌ల రికార్డును చేరుకోగలిగాడు.

గత పుష్కరకాలంగా జాతీయ హాకీజట్టులో సూపర్ మిడ్ ఫీల్డర్ గా రాణిస్తూ వస్తున్న మన్ ప్రీత్ నాయకత్వంలోనే భారతజట్టు నాలుగు దశాబ్దాల విరామం తరువాత ఒలింపిక్స్ హాకీ పతకం సాధించగలిగింది. 2022 టోక్యో ఒలింపిక్స్ హాకీలో భారత్ కాంస్య పతకం అందుకోవడంలో ప్రధానపాత్ర వహించాడు. భారతజట్టులో సభ్యుడిగా 15 ఏళ్లపాటు కొనసాగవచ్చునని భావించానని, అయితే 400కు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడగలనని కలనైనా అనుకోలేదని మన్ ప్రీత్ మురిసిపోతూ చెప్పాడు. రానున్న కాలంలో భారతజట్టు పాల్గొనే ప్రపంచకప్ హాకీ, ఆసియా క్రీడల కోసం మన్‌ప్రీత్ ఎదురు చూస్తున్నాడు. బెల్జియం ఆటగాడు జూన్ డోమెన్స్ పేరుతో ఉన్న 481 మ్యాచ్‌ల ప్రపంచ రికార్డును అధిగమించాలన్నదే తన లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని సాధించాలంటే ఫిట్‌నెస్ కాపాడు కోటం అత్యంత ప్రధానమని ప్రకటించాడు.

'మహాబలి' హర్మన్ ప్రీత్ సింగ్

భారతహాకీ మిడ్ ఫీల్డ్‌లో మన్‌ప్రీత్ సింగ్ తిరుగులేని మొనగాడైతే..బ్యాక్ లైన్ డిఫెన్స్‌లోను, పెనాల్టీకార్నర్లను గోల్స్‌గా మలచడంలో ప్రస్తుత కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ మహాబలిగా నిలిచాడు. ఆతని నాయకత్వంలోనే భారతజట్టు వరుసగా రెండో కాంస్య పతకం సాధించగలిగింది. భారత్ తరపున 250 మ్యాచ్‌లు ఆడిన పెనాల్టీ కార్నర్ కమ్ డ్రాగ్ ఫ్లిక్ స్పెషలిస్ట్‌గా ఇటీవలే ఓ అరుదైన రికార్డు నెలకొల్పిన హర్మన్ ప్రీత్ వచ్చే (లాస్ ఏంజెలిస్) ఒలింపిక్స్ లోనూ ఇదే జోరు కొనసాగించాలన్న పట్టుదలతో ఉన్నాడు.

2024-ఆసియా చాంపియన్స్ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లో తన ద్విశతక గోలు సాధించడం ద్వారా చరిత్ర సృష్టించిన హర్మన్ ప్రీత్‌కు వరుసగా రెండు ఒలింపిక్స్‌లో (టోక్యో, పారిస్) కాంస్య పతకాలు సాధించిన అరుదైన ఘనత ఉంది.

కేవలం హర్మన్ ప్రీత్ నైపుణ్యం కారణంగానే ప్రపంచ మేటిజట్లలో ఒకటిగా భారత్ నిలుస్తూ రాగలుగుతోంది. పారిస్ వేదికగా ముగిసిన 2024 ఒలింపిక్స్‌లో భారత్ ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ సగటున ఓ గోలు చొప్పున సాధించడం ద్వారా హర్మన్ అత్యధిక గోల్స్ సాధించిన మొనగాడుగా నిలిచాడు.

ప్రపంచ హాకీ దిగ్గజ జట్టు ఆస్ట్రేలియాపై గత నాలుగు దశాబ్దాల కాలంలో భారత్ తొలి విజయం సాధించడంలోను, కాంస్య పతకం పోరులో స్పెయిన్‌ను 2-1గోల్స్‌తో అధిగమించడంలోనూ హర్మన్ ప్రధానపాత్ర పోషించాడు.

భారత హాకీ చరిత్రలో అత్యంత విజయవంతమైన పెనాల్టీకార్నర్ స్పెషలిస్ట్‌గా, 200 గోల్స్ సాధించిన ఒకే ఒక్కడుగా హర్మన్ ప్రీత్ చరిత్ర సృష్టించాడు. ఇప్పటికే భారత్‌కు ఆసియాక్రీడల బంగారు పతకం, ఆసియా చాంపియన్స్ ట్రోఫీ, 2020 టోక్యో ఒలింపిక్స్ , 2024 పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతకాలు అందించిన హర్మన్ వచ్చే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, 2028 ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు అందించాలని కోరుకొందాం. భీమార్జునుల వంటి హర్మన్ ప్రీత్ సింగ్ , మన్ ప్రీత్ సింగ్ లేని భారత హాకీని ప్రస్తుతం ఊహించడం అసాధ్యం. రానున్నకాలంలో తమ ఫిట్‌నెస్‌ను కాపాడుకోగలిగితే హర్మన్ ప్రీత్ 300 మ్యాచ్ లు, మన్ ప్రీత్ సింగ్ 481 మ్యాచ్ ల ప్రపంచ రికార్డును చేరుకోగలగడం ఏమంత కష్టంకాదు.!

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

అమెరికా అనగానే చాలామందికి ముందుగా గుర్తుకొచ్చేది అవకాశాల దేశం. విశాలమైన రహదారులు, క్రమబద్ధమైన నగరాలు, శుభ్రమైన పరిసరాలు, ఆధునిక జీవన సౌకర్యాలు.. ఇవన్నీ భారతీయులను ఆకర్షిస్తున్నాయి. ఉద్యోగం, చదువు, భవిష్యత్తు, భద్రత అనే ఆశలతో వేలాది మంది భారతీయులు ఏటా అమెరికా బాట పడుతున్నారు.

భారతీయుల అందలం అమెరికా!

బయట నుంచి చూస్తే, అమెరికా జీవితం డాలర్ల వెలుగులతో, సౌకర్యాల మెరుపులతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ ఆ వెలుగుల వెనుక భారతీయులు ఎదుర్కొనే కష్టాలు కూడా తక్కువ కాదు. దూరదేశం, నూతన సంస్కృతి, వినూత్న చట్టాలు, వీటన్నింటికీ అలవాటు పడటం ఒక పెద్ద సవాలే. మొదట్లో ఒంటరితనం, భాషా సమస్యలు, ఉద్యోగ ఒత్తిడి, కుటుంబానికి దూరంగా ఉండాల్సిన బాధ అనేకమందిని వెంటాడుతూనే ఉంటుంది. దీనికి తోడు విదేశీ నేలపై బిక్కుబిక్కుమని బతుకుతూ, ఎన్నో కష్టాలను చవిచూస్తూ, నిష్కారణంగా ప్రాణాలను సహితం కోల్పోయిన అభాగ్యులు లేకపోలేదు.

చాలా కుటుంబాల్లో మొదట భర్త లేదా భార్య ఒక్కరే అమెరికాకు వస్తారు. తరువాత కొంతకాలానికి జీవిత భాగస్వామి చేరతారు. ఆ తర్వాత పిల్లలు పుడతారు. పిల్లల పెంపకం కోసం, మానసిక భరోసా కోసం తల్లితండ్రులు, అత్తమామలు క్రమంగా అమెరికా వస్తుంటారు. అప్పుడు ఇల్లు మళ్లీ భారతీయ వాతావరణంతో నిండుతుంది. అమ్మ చేతి వంట, నాన్న చెప్పే కథలు, అత్త మామల అనుభవాలు, ఇవన్నీ విదేశీ నేలపై స్వదేశపు సువాసనను పంచుతాయి.

అయితే కాలం గడిచే కొద్దీ మార్పులు సహజం. కొందరు భారతీయులు పుట్టిన ఊరు, స్వదేశపు అనుబంధాలను క్రమంగా మరచిపోతారు. అమెరికాలోనే ఇళ్లు కొనుగోలు చేసి, అక్కడే స్థిరపడతారు. పిల్లలకు అక్కడే చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు జరుగుతాయి. సిటిజన్‌షిప్ తీసుకుని, అమెరికానే తమ శాశ్వత నివాసంగా భావించే వారూ చాలామందే.

ఇక్కడే ఒక ఆందోళన మొదలవుతుంది. పిల్లలు ఆంగ్లభాషలోనే పెరిగి, తల్లిదండ్రుల మాతృభాషను సరిగ్గా మాట్లాడలేని పరిస్థితి కనిపిస్తోంది. తెలుగు, తమిళం, హిందీ వంటి ఇంకా ఎన్నో మన భాషలు ఇళ్లలో తగ్గిపోతున్నాయి. పండుగలు కూడా సంప్రదాయాలకన్నా సెలవు రోజుల్లా మారుతున్నాయి. మూలాలు, సంస్కృతి క్రమంగా మసక బారుతున్నాయనే భావన తల్లిదండ్రుల్లో కలుగుతోంది.

అయినా, చాలామంది భారతీయులు ఈ పరిస్థితిని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నారు. వారాంతాల్లో భాషా పాఠశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేవాలయాలు, సంఘాల ద్వారా పిల్లలకు తమ మూలాలను పరిచయం చేస్తున్నారు. 'మనం ఎక్కడ ఉన్నా మన సంస్కృతి మనతోనే ఉండాలి' అన్న భావనను పిల్లలలో నాటాలని ప్రయత్నిస్తున్నారు.

అమెరికా నేలపై మన గుళ్లు, గోపురాలు, పండుగలు, సంప్రదాయాలు భారతీయులు ఎంతో శ్రద్ధగా పాటిస్తున్నారు. పండిత, పురోహిత వర్గం వారి సంప్రదాయాలను అనుసరించి, దైవికమైన పుణ్య కార్యక్రమాలు, పితృకార్యక్రమాలలో భారతీయులకు సౌకర్యాలను కలుగచేసి, తమ వృత్తి ధర్మం నిర్వహిస్తున్నారు. భారతీయులు ఎన్నో సమాజాలుగా ఏర్పడి, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం, నాట్యం, ఇతర విషయాలలో శ్రద్ధ చూపుతూ, కళాకారులను ప్రోత్సహిస్తున్నారు.

మొత్తంగా చూస్తే, అమెరికా భారతీయులకు అవకాశాల వేదిక. అదే సమయంలో గుర్తింపు పరీక్ష కూడా. సౌకర్యాలు, స్థిరత్వం, భద్రత ఒకవైపు ఉంటే, సంస్కృతి, భాష, మూలాల్ని కాపాడుకోవడం మరోవైపు సవాల్‌గా మారింది. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించగలిగినప్పుడే అమెరికాలో జీవించే భారతీయ జీవితం నిజంగా సంపూర్ణమవుతుంది.

కొన్ని కారణాల వల్ల మన వారు అమెరికా వాస్తవ్యులు, ఇతర దేశ ప్రజలను ప్రేమించి పెళ్లిళ్లు చేసుకోవడంతో, పూర్తిగా తమ ఉనికినే కోల్పోతున్న పరిస్థితి లేకపోలేదు.

స్వధర్మం, స్వదేశం అన్న పేరుతో జరుగుతున్న తీవ్రమైన దాడులు, వాటి పరిణామాలు, ఎందరో భారతీయులను కలవరపరుస్తూ, వారి మనుగడకు సవాలుగా మారుతున్నాయి. ఉడుకు రక్తంలో తీసుకున్న నిర్ణయాలకు సంకోచం కూడా మరోవైపు తప్పటం లేదు. పిల్లల నిర్ణయాల కోసం, అలవాటు పడ్డ దేశాల నుండి తిరిగి భారత దేశం వెళ్లలేక ఎందరో భారతీయులు సతమతమవడం కూడా మరోవైపు గమనించాల్సిందే. జీవితంలో ఎన్నో నిర్ణయాలు, మనలో ఎందరినో సందిగ్ధంలో పడేయడం సహజమేకదా!!

అయినప్పటికీ, దేశానికి, తమ తల్లి తండ్రులకు, బంధువులకు తమవంతు సహాయం అందిస్తూ, అమెరికా అందాలను ఆస్వాదిస్తూ, భారతీయతను గుండెల్లో దాచుకుని ముందుకు సాగుతున్న ఈ వలస జీవులే, అమెరికాలో స్థిరపడ్డ మన భాగ్య భారతీయులు.

డా॥ జె.పి. భారతి కాజా

'ఆంధ్ర' సంచాలిక సోమేశ్వరి కన్నుమూత

గుంటూరు: విద్యతో వికసించి, సేవతో పరిమళించిన డాక్టర్ డి.సోమేశ్వరి జూన్ 21న గుంటూరులో మరణించారు. 1974 నుండి 2010 వరకు టీజేపిఎస్ కళాశాల,గుంటూరులో బాటని శాఖధిపతిగా పనిచేశారు. విద్యార్థులకు పుస్తకాలలో ఉన్న బాటనీనే కాదు బ్రతుకుబాటను నేర్పిన ఉపాధ్యాయురాలు. ఆదర్శ సమాజ సేవిక కూడా. గుంటూరులో సేవాభారతి శాఖను స్థాపించి సేవలందించిన ప్రథములలో వీరు ఒకరు. 1976 నుండి రాష్ట్ర సేవికాసమితి సేవికగా సమాజసేవలో ప్రారంభమైనది ఆమె జీవితం. 2005లో సమితి ఆంధ్ర ప్రాంత సహకార్యవాహికగా, 2010లో ప్రాంత కార్యవాహికగా బాధ్యతలు చేపట్టారు. మాతృ హృదయంతో వ్యక్తులను సంఘటితపరచడంలో ఆమె నైపుణ్యం అద్భుతం. ఇంటికే పరిమితమైన మహిళలను శాఖకు తెచ్చేవారు. 2019 నుండి ఆంధ్ర ప్రాంతసంచాలికగా తుదిశ్వాస వరకు ఉన్నారు. 74వసంతాల పరిపూర్ణ జీవితాన్ని చవిచూశారు. ఆమె చూపిన బాటలో నడవడమే ఆమెకు మనం సమర్పించే ఘనమైన నివాళి.

అనంతపురం: సక్షం స్థాపనదివస్ సందర్భంగా అనంతపురం దివ్యాంగ సేవా కేంద్రంలో జూన్21న నలుగురు దివ్యాంగులకు ట్రాలీస్, 150 మందికి యుడిఐడి కార్డులు, బస్, ట్రైన్‌పాస్‌లు ఇచ్చారు. కొత్తపట్నంలో జరిగిన కార్యక్రమంలో హియరింగ్ ఎయిడ్స్, వాకర్‌స్టాండ్, చక్రాల కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంఘటన కార్యదర్శి కృష్ణ మోహన్, రోడ్సెట్ డైరెక్టర్ కీర్తి, సీఈవో చరణ్‌నంద, ఉషా, స్పందన పాల్గొన్నారు.

కర్నూల్: జూన్ 21 అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యభారతి కర్నూలు శాఖ నిర్వహించిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్న సదస్సులో ఆరోగ్య భారతి అఖిల భారతీయ సహసంఘటనా కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ ప్రసంగించారు.

లాడియా విఠల్ ఇక లేరు

నిర్మల్: నిర్మల్ జిల్లా గాజుల నర్సాపూర్ నివాసి లాడియా విఠల్ (58) చికిత్స పొందుతూ జూన్ 17న స్వర్గస్తులయ్యారు. సంఘ పరిచయమైన రోజు నుండి నేటివరకు స్వయంసేవక్‌గా కొనసాగుతూ మండల, ఖండ స్థాయిలో సంఘ బాధ్యతలు నిర్వహించిన తరువాత ధర్మజాగరణలో వివిధ స్థాయిలలో పనిచేసి ప్రస్తుతం తెలంగాణ ప్రాంత టోలి సభ్యులుగా కొనసాగుతున్నారు. ధర్మ జాగరణలో అవిశ్రాంతంగా పనిచేస్తూ ఆదిలాబాద్ జిల్లాలోని వందలాది గిరిజన గ్రామాలలో పనిని విస్తృతపరచడం ద్వారా వనవాసుల గుండెలలో ఆశాజ్యోతిగా నిలిచారు. వీరికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉపమన్యుడి గురుభక్తి | కథ

ధౌమ్య మహర్షి ఆశ్రమంలో ఉపమన్యుడు అనే శిష్యుడు ఉండేవాడు. అతనికి గురువుపై ఎంతో భక్తి. గురువు చెప్పిన మాటను ఎప్పుడూ గౌరవంగా పాటించేవాడు.

ఒకరోజు గురువు ఉపమన్యుడిని పిలిచి, "నాయనా, ఆశ్రమంలోని ఆవులను అడవికి తీసుకెళ్లి మేత మేయించి సాయంత్రం జాగ్రత్తగా తీసుకురా" అన్నాడు. ఉపమన్యుడు నమస్కరించి ఆ పనిని ఆనందంగా స్వీకరించాడు.

ప్రతిరోజూ ఉదయం ఆవులను అడవికి తీసుకెళ్లి, సాయంత్రం తిరిగి తీసుకువచ్చేవాడు. రోజంతా అడవిలో ఉన్నా అతను బలంగానే కనిపించాడు. ఒకరోజు గురువు అడిగాడు, "ఉపమన్యా, నీవు ఏమి తింటున్నావు?" అని.

"గురుదేవా, భిక్షగా వచ్చిన ఆహారం తింటున్నాను" అన్నాడు ఉపమన్యుడు.

అప్పుడు గురువు, "శిష్యుడు భిక్షగా తెచ్చినదాన్ని ముందుగా గురువుకు సమర్పించాలి" అన్నాడు. అప్పటి నుంచి ఉపమన్యుడు తెచ్చిన భిక్షను గురువుకే ఇచ్చేవాడు.

కొద్దిరోజుల తర్వాత కూడా అతను ఆరోగ్యంగా కనిపించాడు. గురువు మళ్లీ అడిగాడు. ఉపమన్యుడు, "మొదటి భిక్ష మీకు ఇచ్చి, తర్వాత మళ్లీ భిక్షకు వెళ్లి తింటున్నాను" అన్నాడు.

గురువు, "రెండుసార్లు భిక్షకు వెళ్తే ఇతరులకు దొరకదు. ఇక అలా చేయకు" అన్నాడు. ఉపమన్యుడు వెంటనే ఆ మాటను పాటించాడు.

ఆ తర్వాత ఆకలి తట్టుకోలేక ఆవు పాలు తాగాడు. "అది దూడల హక్కు. నువ్వు తీసుకోకూడదు" అన్నారు గురువు. దాన్నీ వదిలేశాడు.

చివరికి ఆకలి తట్టుకోలేక ఒకరోజు అడవిలోని జిల్లేడు ఆకులను తిన్నాడు. ఆ విషప్రభావంతో క్షణాల్లో కంటిచూపు కోల్పోయి, దారి తెలియక ఒక పాడుబడిన బావిలో పడిపోయాడు. సాయంత్రం ఆవులు మాత్రమే ఆశ్రమానికి వచ్చాయి. ఉపమన్యుడు రాకపోవడంతో గురువు అడవిలో వెతుకుతూ పేరు పెట్టి పిలిచాడు. బావిలోనుంచి ఉపమన్యుడు సమాధానం ఇచ్చాడు.

గురువు అతని పరిస్థితి తెలుసుకొని, అశ్వినీ దేవతలను ప్రార్థించమన్నాడు. ఉపమన్యుడు భక్తితో ప్రార్థించాడు. దేవతలు ప్రత్యక్షమై ఔషధం ఇచ్చారు. కానీ ఉపమన్యుడు, "గురువు అనుమతి లేకుండా నేను తీసుకోను" అన్నాడు.

అతని గురుభక్తికి దేవతలు సంతోషించారు. గురువు ఆశీర్వాదంతో అతనికి చూపు తిరిగి వచ్చింది. ఉపమన్యుడు బయటకు వచ్చాడు.

ధౌమ్య మహర్షి అతన్ని ఆశీర్వదించి, "నీ గురుభక్తి గొప్పది. నీకు జ్ఞానం, కీర్తి కలుగుతాయి" అని దీవించాడు. ★

మంచిమాట

నిన్ను పది అడుగుల దూరంగా పెట్టాలి అనుకునేవారికి.. నువ్వే వంద అడుగుల దూరంలో ఉండాలి.

మెదడుకు మేత

రాజుగారి తోటలో రోజా పూలు. చూసేవారేగానీ, లెక్కేసేవారే లేరు..?

సమాధానం : ఉమ్మెత్త

పద్యం

దానములను సేయ ధరచేతులాడక
బహు ధనంబు గూర్చి పాతిపెట్టి
తుదను దండుగనిడి మొదలు చెడు నరుడు
విశ్వదాభరామ వినురవేమ

భావం : సంపాదించిన ధనాన్ని అవసరమైన చోట ఉపయోగించకుండా, దానం చేయకుండా దాచిపెట్టడం మంచిది కాదు.అలా చేయడం వల్ల మొదటికే మోసం వస్తుంది. మన దగ్గర ఉన్న సంపదను ఇతరులకు ఉపయోగపడినప్పుడే దానికి నిజమైన విలువ వస్తుందని భావం..

శ్లోకం

కర్మణా జాయతే భక్తిః
భక్త్యా జ్ఞానం ప్రజాయతే
జ్ఞానాత్ ప్రజాయతే ముక్తిః
ఇతి శాస్త్రార్థం సంగ్రహః

భావం : కర్మల వల్ల భక్తి కలుగుతుంది. భక్తి వలన జ్ఞానం, దాని ద్వారా మోక్షం కలుగుతుందని శాస్త్ర నిర్ణయం.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

అధ్యయనం	శాస్త్రం
విత్తనాలు	ఫిలాటెలి
ప్రాచీన శాసనాలు	ఎపిగ్రఫీ
నేరం, నేరస్తులు	కార్పోలజీ
శిలల స్వభావం	క్రిమినాలజీ
స్టాంపుల సేకరణ	లిథోలజీ

సమాధానం : అధ్యయనం-కార్పోలజీ, విత్తనాలు-ఫిలాటెలి, ప్రాచీన శాసనాలు-ఎపిగ్రఫీ, నేరం, నేరస్తులు-క్రిమినాలజీ, శిలల స్వభావం-లిథోలజీ, స్టాంపుల సేకరణ-ఫిలాటెలి

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

మాక్స్ ప్లాంక్
(1858-1947)

మాక్స్ ప్లాంక్ జర్మనీకి చెందిన ఒక గొప్ప భౌతిక శాస్త్రవేత్త. ఆధునిక భౌతికశాస్త్ర రూపురేఖలనే మార్చేసిన ఘనత ఆయనది. అందుకే ఆయనను "క్వాంటం థియరీ పితామహుడు" అని పిలుస్తారు. అప్పటివరకు ఉన్న క్లాసికల్ ఫిజిక్స్ ద్వారా వివరించలేని ఎన్నో విషయాలను ఆయన ఒక సరికొత్త ఆలోచనతో నిరూపించారు. ఎనర్జీ అనేది చిన్న చిన్న ప్యాకెట్స్ లాగా రిలీజ్ అవుతుందని ప్రపంచానికి తొలిసారిగా చాటిచెప్పాడు. ఆ ప్యాకెట్స్‌నే ఆయన క్వాంటా (Quanta) అని పిలిచారు. ఆయన ప్రతిపాదించిన ప్లాంక్స్ కాన్‌స్టెంట్ ఈ రోజుకీ ఫిజిక్స్‌లో అత్యంత కీలకమైన కాన్సెప్ట్.

జనరల్ నాలెడ్జ్

1. భూమిపై అతిపెద్ద క్షీరదం ఏది?
2. ఒక క్రికెట్ జట్టులో ఎంత మంది ప్లేయర్స్ ఉంటారు?
3. ప్రపంచంలో అత్యంత వేగవంతమైన పక్షి ఏది?

జవాబులు : 1. నీలి తిమింగలం; 2. 11; 3. పెరిగ్రిన్ ఫాల్కన్.

భక్తాగ్రేసరులు

లాలేశ్వరి



కశ్మీరీ యోగిని లాలేశ్వరి (గుణారి)సదాచార సంపన్నుడైన కశ్మీరీ పండిట్ సహజ్ కౌల్ దంపతులకు జన్మించారు. ఒకరోజు వారి గృహాన్ని సందర్శించిన ఒక యోగి, 'మీ ఇంట్లో ఒక మహాశక్తి జన్మిస్తుంది' అని ఆశీర్వదించాడట. ఆమె పేరుకు (గుణారి)తగినట్లే సుగుణాల రాశి. అప్పటి ఆచారాన్ని బట్టి ఆమెకు ఏడేళ్లకే వివాహమైంది. సేదామోల్ అనే గురువు స్ఫూర్తితో ఆధ్యాత్మిక సాధనకు నాంది పలికారు. అధిక సమయం దైవచింతనలో గడిపారు. ఆ ప్రాంతంలో శైవసిద్ధాంత పునరుద్ధరణకు కృషి చేశారు. ఆమె అత్తింటి వేధింపులను సహనంతో భరించారు. చుట్టుపక్కల వారు ఆమె సహనానికి విస్తుపోయేవారు. నేటికీ కశ్మీర్ ప్రాంతంలో అమాయకంగా, నిర్మలంగా కనిపించే ఆడపిల్లలను 'లాడ్ లాడ్' అని సంబోధిస్తుంటారు. పరిసర ప్రాంతాల వారు ఆమెను దైవాంశ సంభూతిరాలిగా పరిగణించేవారు. 'భగవత్ చింతన, దర్శనమే శ్రేష్ఠమైన కాంతి. దైవమే శ్రేష్ఠమైన మిత్రుడు, ఆయనను అన్వేషించి కనుగొన్న స్థలమే శ్రేష్ఠమైన తీర్థం. ఆ అన్వేషణే పరమ పవిత్రమైన కర్తవ్యం, సంతోషం' అని వివరించారు. ఆమె మహత్తు ఒక సంఘటనలను ఉదాహరణగా చెబుతారు. లాలేశ్వరి. అర్ధరాత్రి సమయంలో విస్తానది నుంచి నీరు తెచ్చి, పాత్రల్లో నింపుకొని మిగతా నీటిని పెరట్లోని కుండంలో పోసేది. కొంతకాలానికి అది పవిత్రమైన తీర్థంగా మారింది. ప్రజలు పెద్ద సంఖ్యలో దానిని దర్శించడానికి రాసాగారు. ఆ కుండాన్ని 'లల్లా త్రాగ్' అని వ్యవహరించసాగారు.'కష్టాలను స్థైర్యంతో అధిగమించగలగాలి. కోరికలకు నెలవైన మనసును అదుపులో పెట్టుకోవాలి. లేనిపక్షంలో మనసులో అగ్నిజ్వాలలు పుట్టి, దహించివేస్తాయి. తెలివిగలవారు ఆ పరిస్థితిని రానివ్వరు' అని బోధించారు. ఆమె బోధనలు 'లల్లా వాక్య', 'వాట్సున్'గా ప్రసిద్ధికెక్కాయి. ★

వారఫలాలు

29 జూన్ - 05 జులై, 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కాంట్రాక్టర్లు, రియల్టర్లకు లాభదాయకంగా ఉంటుంది. ఆలయాలు సందర్శిస్తారు. విద్యార్థులకు పోటీపరీక్షలలో విజయం. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపారులకు మరింత అనుకూల సమయం. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. కళాకారులకు సన్మానయోగం. రచయితలు, క్రీడా కారులు నైపుణ్యతను చాటుకుంటారు. 29,30 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

స్నేహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. మీ నిర్ణయాలను అందరూ స్వాగతిస్తారు. వివాహయత్నాలు కలసి వస్తాయి. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందు తాయి. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. పారిశ్రామికవర్గాలకు ఆహ్వానాలు అందుతాయి. రచయితలు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 30, జులై 1 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. రుణ ఒత్తిడులు. దుర్గాస్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కొన్ని సమస్యలు తీరి ఊపిరిపీల్చుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులకు అనుకున్న లాభాలు తథ్యం. ఉద్యోగస్తులు కోరుకున్న మార్పులు పొందుతారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు విశేషంగా కలసివస్తుంది. జులై 2,3 తేదీల్లో దూర ప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

దేవాలయాలు సందర్శిస్తారు. చిన్ననాటి స్నేహితు లను కలుసుకుని మంచీచెడ్డా విచారిస్తారు. వాహన సౌఖ్యం. మీ నిర్ణయాలపై కుటుంబంలో ఆమోదం లభిస్తుంది. వ్యాపారస్తులు గతం కంటే మరింత పుంజుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఊరట నిచ్చే ప్రకటన రావచ్చు. జులై 4,5 తేదీల్లో వృథాఖర్చులు. స్నేహితులతో తగాదాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

సభలు, సమావేశాలలో పాల్గొంటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబంలో ప్రోత్సాహ కరంగా ఉంటుంది. వాహనయోగం. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగస్తులు కొత్త హోదాలు దక్కించుకుంటారు. రాజకీయవేత్తలు, క్రీడాకారులు, రచయితలకు మరింత ఆదరణ లభిస్తుంది. జులై 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. దూర ప్రయాణాలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

పలుకుబడి పెరుగుతుంది. ఆస్తుల విషయంలో చిక్కులు తొలగుతాయి. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు లేదా ఇంక్రిమెంట్లు. రాజకీయ వేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత ఉత్సాహ వంతంగా ఉంటుంది. 30, జులై 1 తేదీల్లో దూర ప్రయాణాలు. అనుకోని ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

తుల: చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఆధ్యాత్మిక కార్య క్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులు లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, పరిశోధకులకు అరుదైన ఆహ్వానాలు అందుతాయి. జులై 2,3 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొన్ని సమస్యలు సహనాన్ని పరీక్షిస్తాయి. ఆరోగ్యంపై దృష్టి సారించండి. విలువైన వస్తువులు చేజార్చుకుంటారు. వ్యాపారులకు కొంత గందర గోళంగా ఉంటుంది. ఉద్యోగులకు మరింత పని భారం తప్పదు. కళాకారులకు ఒత్తిడులు పెరుగు తాయి. పరిశోధకులు, రచయితలకు విదేశీ పర్య టనలు వాయిదా. జులై 3,4 తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. విష్ణుధ్యానం చేయండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

జీవితభాగస్వామి తరఫున ఆస్తిలాభం ఉంటుంది. కాంట్రాక్టర్లు, రియల్టర్లకు కలసివచ్చే కాలం. వ్యాపారులు తగినంత లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నతస్థితితో పాటు, మంచి గుర్తింపు లభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు అనుకూల సమయం. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. జులై 4,5 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. అనారోగ్యం. కాలభైర వాష్టకం పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

పరిచయాలు మరింత పెరుగుతాయి. ప్రము ఖులతో చర్చలు సఫల మవుతాయి. నిరుద్యోగులకు ఒక సమాచారం మరింత ఊరటనిస్తుంది. వ్యాపారులు ఆశించిన పెట్టుబడులు అందు కుంటారు. ఉద్యోగులకు ఉన్నతస్థితి దక్కుతుంది. రాజకీయవర్గాలకు పదవీయోగం. కళాకారులు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 29,30 తేదీల్లో వ్యయప్రయాసలు. బంధువులతో వివాదాలు. శివపంచాక్షరి పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. దేవాలయాలు సందర్శిస్తారు. ఆరోగ్యం కుదుటపడి ఉపశమనం పొందుతారు. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. పారిశ్రామిక వర్గాలకు సంతోషకరమైన సమాచారం. రచయితలు, క్రీడా కారులకు మంచి గుర్తింపు. జులై 3,4 తేదీల్లో ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఇంట్లో శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన కార్యక్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. వ్యాపారులు సంస్థలను విస్తరిస్తారు. కొత్త భాగస్వాములను చేర్చు కుంటారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. పారిశ్రామికవర్గాలకు ఉత్సాహ వంతంగా ఉంటుంది. కళాకారులు, రచయితలకు అవార్డులు. జులై 2,3 తేదీల్లో దూరప్రయాణాలు. అనుకోని ఖర్చులు. ఆంజనేయ దండకం పఠించండి.

పదరసం-570



ఆధారాలు

అడ్డం

1. శపథం (2)
3. దేవాలయం (3)
5. పన్నెండు (3)
7. తెలుగునాట బాగా పండే ధాన్యం (2)
8. నాయకుడు (2)
9. మేఘుం, మందగొడితనం (2)
10. శిరోజాలు (3)
11. ఉపకారం (2)
12. రాక్షసులకు వికృతి (4)
13. చోటు, ప్రదేశం (2)
14. అడవి, రుద్రభూమి (2)
15. విధాత (3)
17. చులకన,లోకువ (3)
19. న్యాయం, పాలు (2)
20. నిజం ఇలాంటిదట (2)
21. సౌధం, ప్రాసాదం (3)
23. గీతలు (3)
24. కుంభకర్ణుడు దీనికి చిరునామా (2)
25. గల్ఫ్ దేశం (3)
27. కానుక (3)
29. దమయంతి భర్త (3)
31. కాలుడు తడబడ్డాడు (3)
32. కిటికీ (4)

నిలువు

1. భార్య సోదరుడు (5)
2. బేసికి వ్యతిరేకం (2)
3. పుష్కరిణులే (4)
4. కష్టాలు, బాధలు (3)
5. లోకం దీనికి దాసోహమట (2)
6. తిలలు (3)
9. వివాహం (3)
10. పూవులు (4)
11. శరీరాలు (3)
13. రజ్జువు (2)
15. అర్ధరాత్రి (4)
16. అజ్ఞాతవాసంలో భీముడి పేరు (4)
17. రుణం (2)
18. అభిమన్యుడి తల్లి (3)
20. నిధి, పాతర (4)
22. శివయ్య వాహనం.. బహువచనం (3)
24. గత ఏడాది (3)
26. అద్దె, కిరాయి (3)
28. మహాభారతానికి మరో పేరు (2)
29. ఇది సాగరంలో కలవాల్సిందే (2)
30. తాయెత్తు, తోరము (2)

పదరసం - 569 సమాధానాలు

1 ఆ	2 హా	రం		3 భు	వి		4 జా	షు	5 వా
6 పు	లి		7 భ	క్తి		8 గో	ప్యం		ర
	9 కు	దు	వ		10 స	దా		11 వే	ము
12 దౌ	డు		13 నం	14 ది		15 వ	కు	ళ	
హి		16 అ		17 శ	18 బ	రి		19 కు	20 శ
21 త్రు	వు	శ			లి		22 చిం		ర
డు		23 ని	24 దా	నం		25 వి	త	26 ర	ణం
	27 అ	పా	యం		28 వే	షం		గ	
29 క	మ	తం		30 కో	త్త		31 ప	డ	32 వ
33 మే	లం		34 అ	మ్మ		35 కు	క్షి		నం

వినోదాన్ని పంచే

తెలుగు చిత్రసీమలో స్టార్ హీరోయిన్‌గా కొన్నేళ్ల పాటు రాణించిన సమంతకు గత కొంతకాలంగా సరైన విజయం దక్కలేదు. ఆమె నటించిన 'శాకుంతలం, ఖుషీ' సినిమాలు కమర్షియల్‌గా సక్సెస్ సాధించలేదు. దానికి ముందు నాగచైతన్య నుంచి విడాకులు తీసుకోవడంతో పాటు ఆరోగ్య సమస్యలతో సతమతమైంది. ఇప్పుడిప్పుడే ఆమె వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితం కూడా సాఫీగా సాగుతున్నాయి. గత యేడాది సమంత నిర్మించిన 'శుభం' చక్కని విజయాన్ని అందుకోగా, దర్శక నిర్మాత రాజ్ నిడిమోరును ఆమె వివాహం చేసుకున్నారు. ఈ వివాహానంతరం ఈ భార్యాభర్తలు హిమాంక్ దువ్వూరుతో కలిసి 'మా ఇంటి బంగారం' మూవీని నిర్మించారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇటీవల విడుదలై విజయ పథంలో సాగిపోతోంది.

గతంలో నందినీరెడ్డి దర్శకత్వంలో సమంత 'జబర్దస్త్', 'ఓ బేబి' చిత్రాల్లో నటించింది. మొదటి సినిమా పరాజయం కాగా, రెండోది విజయం సాధించింది. దాంతో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన మూడో సినిమాగా 'మా ఇంటి బంగారం' నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే... అనాథ అయిన స్వర్ణ (సమంత) డాక్టర్ అనిరుధ్ (దిగంత్)ను పెళ్లి చేసుకుంటుంది. పెద్దల అనుమతి లేకుండా స్వర్ణను వివాహం చేసుకున్న అనిరుధ్ తన చెల్లెలి పెళ్లి కోసం మూడేళ్ల తర్వాత భార్యతో కలిసి సొంత ఊరు వస్తాడు. పెళ్లి అయ్యేలోపు అత్తవారి నుంచి మంచి మార్కులు పొంది ఆ కుటుంబానికి చేరువ కావాలన్నది స్వర్ణ కోరిక. ఇటువంటి సమయంలో స్వర్ణ గతం తెలిసిన ఓ వ్యక్తి ఆమెను గుర్తుపట్టి జైలులో ఉన్న నక్సలైట్ కరుణ (గుల్షన్ దేవయ్య)కు సమాచారం చేరవేస్తాడు. తనది అనుకున్న స్వర్ణ చేజారిపోతోందని తెలిసిన కరుణ జైలు నుండి తప్పించుకుని స్వర్ణ అత్తగారింటికి వచ్చి ఏం చేశాడు? తన గతాన్ని దాచిపెట్టిన స్వర్ణ ఎలా ఈ సమస్య నుంచి బయటపడింది? రాజకీయ నేపథ్యం కలిగిన అనిరుధ్ తండ్రికి అదే పార్టీకి చెందిన మధుసూదన రావు (వడ్లమాని సాయి శ్రీనివాస్)తో ఎలాంటి గొడవలు వచ్చాయి? అసలు స్వర్ణకు కరుణకు ఉన్న సంబంధం ఏమిటీ? అనేది మిగతా కథ.

అత్తవారింటిలో గరిట పట్టి, రుచికరమైన వంటలు చేసి పేరు తెచ్చుకోవా లనుకున్న కోడలు, తన ద్వారా వారికి కలిగిన ఇబ్బందుల్ని అధిగ మించడం కోసం 'గరిట బదులు గన్ను' పట్టడం అనేది ఇందులో కీలకమైన అంశం. వంటరాని ఈ కోడలు అత్తగారింట్లో వారిని మెప్పించడానికి రకరకాల డ్రామాలు ఆడుతుంది. తనది కాని పాత్రకు న్యాయం చేయాలని తపిస్తుంది. చివరకు ఊహించని సంఘటనలతో తన నిజరూపాన్ని బయటపెట్టి, వారందరికీ కాపాడి 'మా ఇంటి బంగారం' అనిపించుకుంటుంది.

ఒంటరి మహిళగా ఈ సమాజంలో ఎదురైన కష్టాలను తట్టుకోలేక స్వర్ణ నక్సలైట్లతో కలిసి అడవిలోకి వెళ్లిపోతుంది. నిజం చెప్పాలంటే గతంలో చాలా మంది యువతీయువకులు క్షణికావేశంలోనో, మార్గాంతరం లేకనో ఇలానే అడవుల బాట పట్టేవారు. ఇందులో స్వర్ణ కూడా అదే చేస్తుంది. ఆ తర్వాత ఆమెకు నక్సలైట్లలోనూ దుర్మార్గులు ఉన్నారని తెలియడంతో ఆ దారిని వదిలి జనజీవన స్రవంతి లోకి వస్తుంది. అయితే స్వర్ణ పెళ్లి చేసుకుని హాయిగా జీవితాన్ని సాగిస్తోందని తెలియగానే జైలులో ఉన్న నక్సలైట్ బయటకు వచ్చి, ఆమెను ఇబ్బందుల పాలు చేస్తాడు. అతని నుండి ఆమె తన కుటుంబాన్ని రక్షించడమే సినిమా క్లయిమాక్స్.

అమాయకురాలిగా స్వర్ణ పాత్రను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన దర్శకురాలు నందినీరెడ్డి ఆమెలోని మరో యాంగిల్‌ను నందర్భానుసారంగా పరిచయం చేస్తూ ప్రేక్షకులను సంభ్రమకు గురిచేయాలని భావించారు. కొంత వరకు సఫలం అయ్యారు. ప్రథమార్ధం అంతా సరదాగా సాగినా...

ద్వితీయార్ధంలో యాక్షన్ ఎపిసోడ్స్ కొంత చికాకును తెప్పిస్తాయి. ముఖ్యంగా నక్సలైట్ పాత్ర పోషించిన గుల్షన్ దేవయ్య నటన కాస్త అతిగా అనిపిస్తుంది. అలానే స్వర్ణ మామగారి పొలిటికల్ రైవల్రీ సైతం అతుకుల బొంతలా ఉంది.

నటీనటుల విషయానికి వస్తే... రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రను సమంత సమర్థవంతంగా పోషించింది. ఆమె తోడికోడలుగా శ్రీముఖి నవ్వులు పూయించింది. సోషల్ మీడియాలో జూనియర్ సూర్యకాంతంగా పేరు తెచ్చుకున్న మంజూష తొలిసారి వెండితెర మీద నటించినా.. తనదైన హాస్యంతో మెప్పించింది. సమంత భర్తగా నటించిన దిగంత్, నక్సలైట్ పాత్ర చేసిన గుల్షన్ దేవయ్య బదులు వేరే ఎవరినైనా తీసుకుని ఉండాల్సింది. ఇతర ప్రధాన పాత్రలను ఆనంద్, గౌతమి, శ్రీలక్ష్మి, గవిరెడ్డి శ్రీనివాస్, వడ్లమాని సాయిశ్రీనివాస్ తదితరులు పోషించారు. బాపు 'ముత్యాలముగ్గు'లోని 'ముత్య మంతా పసుపు' పాటను సందర్భానుసారం చక్కగా వాడుకున్నారు. టైటిల్స్‌లోనూ బాపు బొమ్మలు ఉపయోగించడంతో అచ్చ తెలుగు సినిమా చూడబో తున్నామనే భావన ప్రేక్షకులకు కలుగుతుంది. సంతోష్ నారాయణన్ సంగీతం, ఓంప్రకాశ్ సినిమాటోగ్రఫీ బాగున్నాయి. సమంత స్వయంగా నిర్మాత కావడంతో ఎక్కడా రాజీపడలేదు. కథకు తగ్గట్టుగా బాగానే ఖర్చుపెట్టారు. సినిమా గ్రాఫ్ అక్కడక్కడా కాస్త కిందకు దిగినా, ఓవర్ ఆల్‌గా ఫర్వాలేదనిపిస్తుంది.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-

వెల : ₹.60/-

వెల : ₹.270/-

వెల : ₹.80/-



వెల : ₹.54/-

వెల : ₹.120



వెల : ₹.80



వెల : ₹.250/-



వెల : ₹.180/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 37